తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 30.04.2026 | సంపుటి : 12 సంచిక : 280 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్









# బెంగాల్‌లో హోరాహోరీ
## అటు సగం.. ఇటు సగం

### విజయం మాదే..

- బెంగాల్‌తో సహా 4 రాష్ట్రాలు, యూటీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం
- ఓటింగ్‌లో చురుగ్గా పాల్గొన్న ప్రజలకు అభినందనలు
- మే 4న ఫలితాలు వికసిత భారత్ సంకల్పాన్ని బలోపేతం చేస్తాయి : మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి విజయం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. కేరళ, తమిళనాడు, అసోం, బంగాల్, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి

మిగతా 2లో..

### తృణమూల్, బీజేపీల ఆధిక్యంపై మిశ్రమ ఎగ్జిట్‌పోల్ అంచనాలు

- కేరళలో యూడీఎఫ్(కాంగ్రెస్)దే హవా
- అసోం,పుదుచ్చేరిలలో ఎన్‌డీఏ ముందంజ
- తమిళనాడు డీఎంకేదే..
- విడుదలైన ఎగ్జిట్‌పోల్స్

**కోల్‌కతా(జనంసాక్షి):**బంగాల్ రెండోవిడత పోలింగ్ బుధవారం ముగియటంతో ఎగ్జిట్ ఫలితాలు విడుదలయ్యాయి. బెంగాల్, అసోం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరికి సంబంధించిన ఎగ్జిట్ పోల్స్ రిలీజ్ అయ్యాయి. అసోంలో భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని ఎన్డీయే హ్యాట్రిక్ కొట్టనుందని ఎగ్జిట్ ఫలితాలు వెల్లడయ్యాయి. దాదాపు ఏడు సంస్థలు అంచనాలు విడుదల చేయగా అన్నీ కూడా కమలం పార్టీకే జైకొట్టాయి. అటు కేరళ శాసనసభ ఎన్నికల్లో యూడీఎఫ్(కాంగ్రెస్) కూటమి విజయం సాధిస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. 140 స్థానాలున్న కేరళ అసెంబ్లీలో అధికారం చేపట్టడానికి స్థానాల్లో విజయం సాధించాల్సి ఉండగా మెజార్టీ మార్క్‌ను జఆఈ కూటమి అందుకుంటుందని పేర్కొన్నాయి.

మిగతా 2లో..

### బెంగాల్ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది

- ఎన్నికలంటే ప్రజాస్వామ్య పండగ
- కానీ వారు పండగ స్ఫూర్తినే దెబ్బతీస్తున్నారు
- ఎన్నికల సంఘం పరిశీలకులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారు
- మమత బెనర్జీ ఆరోపణలు

కోల్‌కతా(జనంసాక్షి): పశ్చిమబెంగాల్‌లో బుధవారం రెండోవిడత పోలింగ్ ముగిసింది ఈనేపథ్యంలో తాను బరిలో నిలిచిన భవానీపూర్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి మమతాబెనర్జీ

మిగతా 2లో..

## ‘తుమ్మిడిహట్టి’పై వేగం పెంచండి

### బ్యారేజ్ నిర్మాణ కార్యాచరణ త్వరితగతిన చేయాలి

- 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ఇబ్బంది ఉండదు
- ఒకవేళ ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ప్రాజెక్టుపై అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రాణహితపై వెనక్కి తగ్గేది లేదు
- ప్రతిపాదనలు సిద్ధం చేశాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణ కార్యాచరణ వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని అన్నారు. ఒకవేళ ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ బ్యారేజ్‌పై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టుపై రూ.11 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీఎం సూచించారు.
**ప్రాణహితపై వెనక్కి తగ్గేది లేదు :మంత్రి ఉత్తమ్** ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు నిర్మాణా

మిగతా 2లో..

### వదంతులతోనే భారీగా కొనుగోళ్లు

తెలంగాణలో పెట్రోలియం ఉత్పత్తులకు అకస్మాత్తుగా డిమాండ్ పెరిగింది:ఉత్తమ్ కుమార్ రెడ్డి

2లో..

### 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యం

- 141 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మిల్లులకు చేరిన 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నూతన డీజీపీ సీవీ ఆనంద్ భేటీ

- డీజీపీగా తన నియామకంపై కృతజ్ఞతలు
- నేడు పదవీవిరమణ చేయనున్న శివధర్‌రెడ్డి
- 1న బాధ్యతలు తీసుకోనున్న ఆనంద్



2లో..

## మలిదశలోనూ పోటెత్తిన ఓటర్లు



**కోల్‌కతా(జనంసాక్షి):**బెంగాల్‌లో కొన్ని చోట్ల చెదురు ముదురు ఘటనలు మినహా రెండో దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు 89.99శాతం పోలింగ్ నమోదైంది. బెంగాల్‌లో 294 స్థానాలు ఉండగా ఏప్రిల్ 23న 152 నియోజకవర్గాల్లో పోలింగ్ ముగియగా బుధవారం 142 స్థానాలకు పోలింగ్

మిగతా 2లో..

- బెంగాల్‌లో ముగిసిన చివరి విడత పోలింగ్
- భారీగా ఓటింగ్ నమోదు
- సాయంత్రం 5 గంటల వరకు 90 శాతం పోలింగ్
- పలు చోట్ల ఘర్షణలు
- పోలింగ్ సమయం దాటినా క్యూలైన్లలో ఉన్నవారికి ఓటేసే అవకాశం
- మే 4న బంగాల్ సహా 5 రాష్ట్రాల ఫలితాలు

### హామీలు గుప్పించి ప్రజలను మోసం చేశారు

- అధికారం రావడం..పోవడం రొటీన్ వ్యవహారం
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం అవుతామని కేసీఆర్ ఆనాడే హెచ్చరించారు
- సీఎం రేవంత్‌తో నాకేమీ వ్యక్తిగత పంచాయితీ లేదు: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): అధికారం రావడం పోవడం రొటీన్‌గా జరిగే తంతు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ ,మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించడం లేదని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాయినింగ్ కార్యక్రమంలో మాట్లాడారు. అధికారం తమ కు కొత్తేం కాదని వెల్లడించారు.

మిగతా 2లో..



## మెట్రో రైలు సర్కారు స్వాధీనం

### ఎల్ అండ్ టీతో షేర్ల కొనుగోలు ఒప్పంద ప్రక్రియ పూర్తి

**హైదరాబాద్(జనంసాక్షి):**హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ పరమైంది. ఎల్ అండ్ టీతో షేర్ల కొనుగోలు ఒప్పందం ప్రక్రియ పూర్తయ్యింది. రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ జరిగింది. ఈ ఒప్పందంపై హెచ్ఎంఆర్ఎల్ తరఫున ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ లిమిటెడ్ తరఫున డీకే సేన్, ఎల్అండ్‌టీ మెట్రోరైలు (హైదరాబాద్) లిమిటెడ్ తరఫున కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. వాస్తవంగా మార్చి 31ని మెట్రో స్వాధీన తేదీ అనుకున్నప్పటికీ.. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆంఎఫ్‌సీ) నుంచి రుణం మంజూరు ఆలస్యం కావడంతో గడువును ఏప్రిల్ 30కి పొడిగించారు.ఎల్ అండ్ టీ, మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ సంస్థ 2017 నవంబర్ నుంచి మూడు కారిడార్లలో మొత్తం 69 కిలోమీటర్ల నెట్‌వర్క్‌తో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–ఎను నిర్వహిస్తోంది. మెట్రోలో ప్రస్తుతం రోజుకు సుమారు 4.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఫేజ్–ఎను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో ఫేజ్–ఎ, ప్రతిపాదిత ఫేజ్–ఎఎ నెట్‌వర్క్ రూపకల్పన, పనులు, సేవల అమలు సులభతరమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

మిగతా 2లో..



## ములుగు టాప్.. హైదరాబాద్ లాస్ట్

### ‘పది’ ఫలితాల్లో సత్తాచాటిన అటవీ ప్రాంత బిడ్డలు

- తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల
- 95.1 శాతం ఉత్తీర్ణత
- 96.26 శాతం ఉత్తీర్ణతతో ముందున్న బాలికలు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 95.1 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 5 లక్షల 28 వేలకు పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత పొందారు. 5,731 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవగా.. 6 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ

మిగతా 2లో..

### రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు
## రూ.వెయ్యికోట్లు విడుదల

**డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ**

**హైదరాబాద్(జనంసాక్షి):**రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాల మేరకు, ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం రూ.1000 కోట్ల నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఈ మేరకు నిధుల విడుదల చేయటం జరిగింది. ఈ మేరకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అసెంబ్లీ లో ఇచ్చిన హామీ నెరవేర్చినారు.గత ఏడాది ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల సందర్భంగా ప్రభుత్వం నెలకు రూ.700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారంగా మార్చి 2026 వరకు ప్రతినెల ఉద్యోగులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం అమలు చేసింది. అయితే,

మిగతా 9లో..





## మలిదశలోనూ పోటెత్తిన ఓటర్లు

జరిగింది. ఈ విడతలో 1,448మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 3.21 కోట్ల మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని ఇఒఎంలో నిక్షిప్తం చేశారు. ఇందుకోసం 41వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఈసీ ఏర్పాటు చేసింది.పలుచోట్ల ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. భవానీపూర్ నియోజవర్గంలో సీఎం మమతా బెనర్జీ ఓటు హక్కు వినియోగించున్నారు. టీఎంసీ ఎంపీలు మహువా మెయిత్రా, అభిషేక్ బెనర్జీ, బీజేపీ నేత, నటుడు మిథున్ చక్రవర్తి, మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ సహా పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండో దశలో పోటీ పడుతున్న కీలక అభ్యర్థుల్లో సీఎం దీదీ, ప్రతిపక్ష నేత సువేందు అధికారి ఉన్నారు. భవానీపూర్ నియోజకవర్గంలో మమతపై సువేందు అధికారిని బీజేపీ పోటీకి నిలిపింది. భాత్ పాడా, రాణాఘాట్, కోల్?కతా ఉత్తర్, కోల్?కతా దక్షిణ్, రాశ్ బెహారీ, జాధవ్ పుర్, బాలీగంజ్?లు రెండో దశలో కీలకంగా ఉన్నాయి.

అనేకచోట్ల హింస, ఆస్తుల ధ్వంసం

బంగాల్‌లో తుదిదశ పోలింగ్ సందర్భంగా పలు చోట్ల ఘర్షణలు చెలరేగాయి. అనేకచోట్ల హింస, ఆస్తుల ధ్వంసం వంటి ఘటనలు జరిగాయి. చాప్రా, శాంతిపూర్, నిమ్తలా, భాంగర్ తదితర ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు జరిగినట్లు పోలీసులు ధ్రువీకరించారు. చాప్రాలో ఉన్న బూత్ నంబర్ 53లో బీజేపీ ఏజెంట్ మోషారెఫ్ మీర్‌పై దాడి జరిగింది. వెంటనే అతడిని సమీప ఆస్పత్రికి తరలించారు. అధికార ఎఓఅకి చెందిన దుండగులు తమ పోలింగ్ ఏజెంట్‌పై దాడి చేశారని బీజేపీ నేతలు ఆరోపించారు. ఈ ఆరోపణలను టీఎంసీ ఖండించింది.అటు హౌవ్‌డా జిల్లా బల్లి ప్రాంతంలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. దీని వల్ల అక్కడున్న వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి అది కాస్తా ఘర్షణకు దారితీసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. ఘర్షణను అదుపు చేసి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నాయి. ఓటింగ్ సందర్భంగా హుగ్లీ జిల్లాలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొంది. నకిలీ పోలింగ్ ఏజెంట్లను నియమించారన్న ఆరోపణలతో ఎఓఅ, మోఈ మద్దతుదారుల మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. పోలీసులు జోక్యం చేసుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

## బెంగాల్ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది

వెళ్లారు. దీదీపై పోటీ చేస్తోన్న భాజపా నేత సువేందు అధికారి కూడా అక్కడికి వచ్చారు. ఆయన వచ్చేసరికి అక్కడే కూర్చొని ఉన్న మమతను ఉద్దేశించి..'ఆమెను చూడండి. ఆమెకు ఈ రోజు ఎవరూ ఓటేయరు" అని వ్యాఖ్యానించారు. దీంతో భాజపా, ఎన్నికల సంఘంపై సీఎం విమర్శలు చేశారు. "కేంద్ర బలగాలకు చెందిన సభ్యులు మా పార్టీ కార్యకర్తల ఇళ్లల్లోకి చొరబడి, ఓటర్లను భయపెడుతున్నారు. ఈ ఎన్నికల్లో భాజపా రిగ్గింగ్‌కు పాల్పడుతోంది. ఎన్నికల సంఘం పరిశీలకులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారు. తృణమూల్ కార్యకర్తను రాత్రి ఎలా కొట్టారో చూడండి. ఇదేం గూండాయిజం..? ఓటింగ్ ఇలా జరగకూడదు. ఎన్నికలంటే ప్రజాస్వామ్య పండగ. కానీ వారు పండగ స్ఫూర్తినే దెబ్బతీస్తున్నారు" అని మమత తీవ్ర ఆరోపణలు చేశారు. కాగా, ఆమె గూండాలను వెంటేసుకొని తిరుగుతూ ఓటర్లను భయపెడుతున్నారని సువేందు కౌంటర్ ఇచ్చారు.ఇదిలాఉండగా.. చాప్రా, శాంతిపుర్, భంగర్ సహా పలు ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం కనిపించింది. ఫల్తాబూత్ వద్ద కొందరు గుమిగూడి నినాదాలు చేయడంతో పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. ఇక ఉదయం 11 గంటల వరకు 39.97 శాతం పోలింగ్ నమోదైంది.

## ఇకమీదట మంచోడిగా ఉండను

**• చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోంది**

**• అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదు.**

**• ఆ దేశం తెలివిగా వ్యవహరిస్తే మంచిది**

**• దౌత్యపరమైన పరిష్కారం త్వరలో లభించకుంటే కఠిన వైఖరి అవలంబిస్తాం • ఫొటో పెట్టి మరీ ట్రంప్ వార్నింగ్**

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సారి హెచ్చరికలు చేశారు. అణు కార్యక్రమానికి సంబంధించి దౌత్యపరమైన పరిష్కారం త్వరలో లభించకుంటే అమెరికా కఠిన వైఖరి తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ తెలివిగా వ్యవహరిస్తే మంచిదన్నారు. ఈ మేరకు రైఫిల్ పట్టుకున్న ఫొటోను 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేసిన ట్రంప్.. ఇక మీదట తాను మంచివాడిగా ఉండనని పేర్కొన్నారు. "చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోంది. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదు. వారు తెలివిగా వ్యవహరిస్తే మంచిది. 'ఇక మీదట అంత మంచివాడిగా ఉండను' అని ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా-ఇరాన్‌ల మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన నెలకొన్న వేళ ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. అంతేకాదు, అమెరికా ప్రతిపాదనలు తిరస్కరిస్తే తాము మరింత దూకుడుగా, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు చేస్తున్నారు.

## ఇరాన్‌పై దీర్ఘకాలిక ముట్టడికి సిద్ధంకండి

**తన యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేసిన ట్రంప్..!**

వాషింగ్టన్(జనంసాక్షి):హర్మూజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించడంతో ఇరాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ తన యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై దీర్ఘకాలిక ముట్టడికి సిద్ధమవ్వాలని పేర్కొన్నట్లు అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. సైనిక దాడులను తిరిగి ప్రారంభించడం, యుద్ధం నుంచి వెనక్కి వెళ్లడంతో పోలిస్తే.. ఈ దిగ్బంధనంతోనే ఇరాన్ కు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ట్రంప్ భావిస్తున్నారు. దీంతో కొనసాగుతోన్న దిగ్బంధనాన్ని మరికొన్ని రోజులు పొడిగించాలని నిర్ణయించుకున్నారు. ఈ దిగ్బంధనం వల్ల ఇరాన్ చమురు ఎగుమతులు తగ్గిపోయాయి. ఇది దాని ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అమెరికా వ్యూహం అమలైతే.. ఇరాన్ సుదీర్ఘకాలం ఆర్థిక సమస్యలు ఎదుర్కోక తప్పదు. మరోవైపు.. అమెరికా దిగ్బంధనం చర్యలకు ప్రతిగా ఇరాన్ ఎలాంటి చర్యలకు దిగుతుందో అన్న ఆందోళనలు నెలకొన్నాయి.

జర్మన్ ఛాన్సలర్‌పై మండిపడిన ట్రంప్

జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌పై ట్రంప్ మండిపడ్డారు. ఇరాన్‌పై అమెరికా అనుసరిస్తున్న విధానాలు, ఇటీవల పాకిస్థాన్‌లో జరగాల్సిన దౌత్య చర్చలు విఫలమైన నేపథ్యంలో ట్రంప్ యంత్రాంగంపై మెర్జ్ పలు విమర్శలు చేశారు. దీనిపై తాజాగా ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా స్పందించారు. టెహ్రాన్ అణు కార్యక్రమం విషయాన్ని మెర్జ్ తప్పుగా అంచనా వేశారని, ఈ విషయంలో తన వైఖరిని కూడా ఆయన వక్రీకరిస్తున్నారని మెర్జ్‌పై మండిపడ్డారు. ఇరాన్ అణ్వాయుధం కలిగిఉన్నా ఫర్వాలేదని మెర్జ్ భావిస్తున్నారని, దేని గురించి మాట్లాడుతున్నారో ఆయనకే తెలియడం లేదని వ్యాఖ్యానించారు. ఆ దేశం వద్ద అణ్వాయుధం ఉంటే.. అది ప్రపంచం మొత్తాన్ని ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు.

## యూఎస్ తిరిగి సైనిక చర్యలకు దిగితే ఊరుకునేదిలేదు

**అమెరికా నౌకలను తగలబెట్టేస్తాం - ఐఆర్‌జీసీ వార్నింగ్**

టెహ్రాన్(జనంసాక్షి):ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ అమెరికాకు గట్టి హెచ్చరికలు చేసింది. యూఎస్ తిరిగి సైనిక చర్యలకు దిగితే.. పరిస్థితులు చాలా దారుణంగా ఉంటాయని పేర్కొంది. ఐఆర్‌జీసీ నౌకాదళానికి చెందిన సీనియర్ అధికారి ఈ బెదిరింపులకు పాల్పడినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. అమెరికా మళ్లీ దురాక్రమణకు పాల్పడితే.. పశ్చిమాసియా వ్యాప్తంగా ఉన్న ఇరాన్‌కు అనుకూలమైన గ్రూపులు రంగంలోకి దిగుతాయన్నారు. అమెరికాకు చెందిన భారీ నౌకలను సముద్రంలోనే తగలబెట్టేస్తామని వ్యాఖ్యానించారు. ఇదిలాఉండగా.. అమెరికాతో సీజ్‌ఫైర్ జరిగినా.. ఇప్పటికీ యుద్ధం కొనసాగుతున్నట్లే భావిస్తున్నామని ఇరాన్ ఆర్మీ ప్రతినిధి అమిర్ అక్రమినియా పేర్కొన్నారు.

# బెంగాల్‌లో హోరా హోరీ..

ఎన్డీఏ కూటమి పెద్దగా ప్రభావం చూపబోదని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అభిప్రాయపడ్డాయి. అటు తమిళనాడులో హోరాహోరీగా సాగిన ముక్కోణపు పోరులో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే విజయ దుందుభి మోగించనుందని మెజారిటీ సంస్థలు అంచనా కట్టాయి.

**అసోంలో ఎన్డీయే హ్యాట్రిక్!**

అసోంలో భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని ఎన్డీయే మరోసారి అధికారం చేపట్టనుంది. అసోంలోని 126 శాసనసభ స్థానాలకు ఈనెల 16న పోలింగ్ జరిగింది. ముందస్తు అంచనాలు విడుదల చేసిన సంస్థలన్నీ కమలం పార్టీకే జైకొట్టాయి. మొత్తం 126 స్థానాలకుగాను ఎన్డీయేకు 88 నుంచి 100 స్థానాలు, కాంగ్రెస్‌కు 24 నుంచి 36 స్థానాలు, ఇతరులకు 3 సీట్లు వస్తాయని యాక్సిస్ మై ఇండియా అంచనా వేసింది. ఎన్డీయే కూటమికి 85 నుంచి 95 స్థానాలు, కాంగ్రెస్‌కు 25 నుంచి 32 సీట్లు, ఇతరులకు ఆరు నుంచి 12 స్థానాలు వస్తాయని మ్యాట్రిజ్ ఎగ్జిట్ ఫలితాలు విడుదల చేసింది. ఎన్డీయేకు 68 నుంచి 72 స్థానాలు వస్తాయని పీపుల్స్ పల్స్ ముందస్తు అంచనాలు విడుదల చేసింది. కాంగ్రెస్‌కు 22 నుంచి 26 సీట్లు, ఇతరులకు మూడు నుంచి ఐదు స్థానాలు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ఎన్డీయేకు 88నుంచి 98 స్థానాలు చాణక్య స్ట్రాటజీస్ ఎగ్జిట్ ఫలితాలు విడుదల చేసింది. కాంగ్రెస్‌కు 22 నుంచి 32 సీట్లు, ఇతరులకు 3 నుంచి ఐదు స్థానాలు వస్తాయని పేర్కొంది. పీ-మార్క్ జఆఈ 71 నుంచి 79 స్థానాల్లోనూ, ఒఆఈ 62నుంచి 69 స్థానాలు, ఎన్డీఏ ఒకటి నుంచి నాలుగు స్థానాల్లో విజయం సాధిస్తుందని పేర్కొంది. జేవీసీ పోల్ జఆఈ 72 నుంచి 84 స్థానాల్లో, ఒఆఈ 52 నుంచి 61 స్థానాలు, ఎన్డీయే 3 నుంచి 7 స్థానాల్లో గెలుస్తోందని అంచనా వేసింది.

**తమిళనాడులో డీఎంకే అధికారం అంటున్న ఎగ్జిట్ పోల్స్**

ఇదిలా ఉండగా, హోరాహోరీగా సాగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డీఎంకే మరోసారి సత్తా చాటబోతోందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. బీజేపీతో జట్టుకట్టి బరిలో దిగిన అన్నాడీఎంకేకు మరోసారి నిరాశ తప్పదని సర్వేలు అభిప్రాయపడ్డాయి. సినిమాల నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్ పార్టీ టీవీకేకి రెండంకెల సీట్లు రావొచ్చని, అయితే, మూడో స్థానానికే పరిమితమని మెజారిటీ సర్వేలు అంచనా వేశాయి. 234 స్థానాలకుగానూ ఏప్రిల్ 23న తమిళనాడులో పోలింగ్ జరిగింది. అధికారం చేపట్టాలంటే 118 స్థానాలు (మ్యాజిక్ ఫిగర్) అవసరం. మెజారిటీ సర్వేలు డీఎంకే అధికారం రావొచ్చని అంచనా వేశాయి. ఒకవేళ అంచనాలు తలకిందులై స్థానాలు తగ్గితే విజయ్ పార్టీ మద్దతు అవసరమయ్యే అవకాశాలూ కొట్టి పారేయలేమని రాజకీయ పండితులు చెబుతున్నారు. డీఎంకేకు 122 నుంచి 132 సీట్లు, అన్నాడీఎంకేకు 87 నుంచి 100 స్థానాలు టీవీకేకు 10 నుంచి 12, ఇతరులు 0–6 స్థానాలు గెలుస్తారని మ్యాట్రిజ్ అంచనా వేసింది. పీపుల్స్ పల్స్ సంస్థ డీఎంకేకు 125 నుంచి 145 సీట్లు వస్తాయని అంచనా వేసింది. అన్నాడీఎంకేకు 65 నుంచి 80 స్థానాలు, టీవీకేకు 18 నుంచి 24 సీట్లు, ఇతరులు 0–6 స్థానాలు గెలుస్తారని చెప్పింది. అటు డీఎంకేకు 125 నుంచి 145 సీట్లు, అన్నాడీఎంకేకు 65 నుంచి 85 స్థానాలు, టీవీకేకు 16 నుంచి 26, ఇతరులు 1 నుంచి 6 సీట్లు వస్తాయని వివరించింది. పీపుల్స్ ఇన్‌సైట్ సైతం డీఎంకేకు 120 నుంచి 140 సీట్లు, అన్నాడీఎంకేకు 60 నుంచి 70 స్థానాలు, టీవీకేకు 30 నుంచి 40 సీట్లు, ఇతరులు 0 నుంచి 4 సీట్లు వస్తాయని పేర్కొంది.

**పుదుచ్చేరిలో ఎన్‌డీఏదే అధికారమన్న ఎగ్జిట్ పోల్స్**

పుదుచ్చేరిలో ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్సీ) నేతృత్వంలోని ఎన్డీఏ విజయం సాధిస్తుందని ఎగ్జిట్? పోల్స్ అంచనా వేశాయి. మొత్తం 30అసెంబ్లీ స్థానాలకు గాను ఎన్డీఏకు 16 నుంచి 19 అసెంబ్లీ సీట్లు, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు 10 నుంచి 12 సీట్లు వస్తాయని పీపుల్ పల్స్ అంచనా వేసింది. అంతేకాకుండా, విజయ్?కు చెందిన టీవీకే ఖాతా తెరవదని, ఇతరులు సున్నా నుంచి రెండు సీట్లను గెలుచుకుంటాయని అంచనా వేసింది. ఎన్డీఏ 16 నుంచి 20 సీట్లతో విజయం సాధిస్తుండగా, కాంగ్రెస్ మిత్రపక్షాలు ఆరు నుంచి ఎనిమిది సీట్లను గెలుచుకుంటాయని యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్ అంచనా వేసింది. టీవీకే రెండు నుంచి నాలుగు అసెంబ్లీ సీట్లు, ఇతరులు ఒకటి నుంచి మూడు సీట్లు గెలుచుకుంటాయని పేర్కొంది.

**బంగాల్ ఎగ్జిట్ పోల్స్ హోరా హోరీ..**

హోరాహోరీగా సాగిన బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం ఎవరిదనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలో మొత్తం 294 స్థానాలుండగా అధికారం చేపట్టేందుకు 148 స్థానాలు అవసరం. వీటిలో పీపుల్స్ పల్స్, పోల్ ఆఫ్ ఎగ్జిట్ పోల్స్ సర్వేలు తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించే అవకాశం ఉందని పేర్కొంది. కాగా మ్యాట్రిజ్, పీ-మార్క్, చాణక్య స్ట్రాటజీస్, పోల్ డైరీ వంటి సర్వేలు ఎన్‌డీఏ వైపు మొగ్గు చూపాయి.

## విజయం మాదే..

ఎన్నికల్లో విజయం తమదేనని పేర్కొన్నారు. బుధవారం బంగాల్ రెండో దశ ఎన్నికల్లో ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొనడాన్ని ఆయన ప్రశంసించారు. ప్రజాస్వామ్య పండుగల్లో ఇది ఒక ముఖ్యమైన రోజు అని అభివర్ణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హర్దోయ్‌లో గంగా ఎక్స్‌ప్రెస్ వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య పండుగలో ఇవాళ కీలకమైన రోజు. బంగాల్‌లో రెండో దశ పోలింగ్ కొనసాగుతోంది. మొదటి దశ మాదిరిగానే ప్రజలు పెద్ద ఎత్తున ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఓటు వేస్తున్నారు. సోషల్ మీడియాలో పొడవైన క్యూల దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం బంగాల్‌లో భయరహిత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయి. కానీ, గతంలో అలాంటి పరిస్థితి ఉండేది కాదు. ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యం బలపడుతుండడానికి నిదర్శనం. రికార్డు స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొంటున్న ఓటర్లకు నా అభినందనలు" అని ప్రధాని పేర్కొన్నారు.ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ–ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించిందని ప్రధాని గుర్తు చేశారు. ఈ క్రమంలో వరుసగా మూడో విజయాన్ని కూడా నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, గుజరాత్‌లో మున్సిపాలిటీలు, జిల్లా పంచాయతీలు, నగర పంచాయతీల్లో 80 నుంచి 85 శాతం స్థానాలను బీజేపీ గెలుచుకుందని కూడా మోదీ చెప్పారు. అయితే, మే 4న వెలువడనున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వికసిత్ భారత్ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. అవి దేశాభివృద్ధి వేగానికి కొత్త శక్తి ఇవ్వనున్నాయని అన్నారు.మరోవైపు, కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్ కల్పించే నారీ శక్తి బిల్లు ఇరుపార్టీలు వ్యతిరేకించాయని మండిపడ్డారు. ఆ పార్టీలు అభివృద్ధికి, మహిళలకు వ్యతిరేకమన్నారు. ఒకవేళ బిల్లు ఆమోదం పొంది ఉంటే, 2029 ఎన్నికల తర్వాత లోక్‌సభ, రాష్ట్రశాసన సభల్లో మహిళలకు రిజర్వేషన్లు లభించేవన్నారు. ఇతర ఏ కేటగిరీలో సీట్లను తగ్గించకుండానే, పెద్ద సంఖ్యలో మహిళలు ఎన్నికై దిల్లీకి చేరుకునేవారని పేర్కొన్నారు. అయితే, సమాజ్ వాదీ పార్టీ, దాని మిత్రపక్షాలు పట్ల యూపీ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని వ్యాఖ్యానించారు.అలాగే, బీజేపీ హయాంలో జరిగిన ఉత్తర్‌ప్రదేశ్ అభివృద్ధి గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. ఒకప్పుడు గుంతల రోడ్లకు గుర్తింపు పొందిన ఉత్తర్‌ప్రదేశ్, ఇప్పుడు అత్యధిక ఎక్స్‌ప్రెస్ వేలు కలిగిన రాష్ట్రంగా మారుతోందని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల యూపీ అభివృద్ధిపథంలో సాగుతోందని ప్రధాని తెలిపారు.



## సీఎం రేవంత్‌తో నూతన డీజీపీ సీవీ ఆనంద్ భేటీ

**హైదరాబాద్,ఏప్రిల్ 29(జనంసాక్షి):**తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో భేటీ అయ్యారు. రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణలో తనపై నమ్మకం ఉంచి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు ఈ సందర్భంగా సీవీ ఆనంద్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణ, డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం,పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై సీఎం ఈ సందర్భంగా పలు సూచనలు చేసినట్లు సమాచారం. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉన్న సీవీ ఆనంద్, ఇప్పుడు రాష్ట్ర పోలీస్ బాస్ గా పగ్గాలు చేపట్టడంతో పోలీస్ శాఖలో సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది.సీఎం రేవంత్ రెడ్డి సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలుపారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా విధులు నిర్వహించాలని సూచించారు.

## మే 10న 'జనాగ్రహ సభ'..

**మోదీ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించిన భాజపా**

**పలు అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్న ప్రధాని**

హైదరాబాద్(జనంసాక్షి): మే 10న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం చేసినట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు వెల్లడించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. "లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రధాని మోదీ తొలిసారి హైదరాబాద్‌కు వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.7 వేల కోట్లకుపైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. తెలంగాణ అభివృద్ధి జరగాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్లను కాంగ్రెస్ అడ్డుకుంది. ఉత్తరాది, దక్షిణాది పేరుతో విభజన రాజకీయాలు చేస్తోంది" అని రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.

## ములుగు టాప్.. హైదరాబాద్ లాస్ట్

వెల్లడించింది. పదో తరగతి ఫలితాలను 809695 8096 అనే మీ సేవా వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీ సేవా వాట్సాప్ నెంబర్‌కు విద్యార్థులు హాయ్ అని మెసేజ్ టైప్ చేయాలి. తర్వాత ఎస్ఎస్సి రిజల్ట్స్ అని టైప్ చేసి హాల్ టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఫలితాలను చూడొచ్చు. ఇకపోతే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియం విద్యార్థుల్లో 89.14 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల్లో 95.86 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఉర్దూ మీడియం విద్యార్థుల్లో 86.71 శాతం నమోదయ్యింది. ములుగు జిల్లాలో అత్యధికంగా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా 89.23 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. గ్రేడ్స్ మాత్రమే కాకుండా సబ్జెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు.

## పంచాయితీ అధికారులకు పదోన్నతులు

**తెలంగాణ సర్కార్ పచ్చజెండా**

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ అధికారుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. గ్రామ పంచాయతీ అధికారుల పదోన్నతులకు తెలంగాణ సర్కార్ పచ్చ జెండా ఊపింది. జూనియర్ అసిస్టెంట్లు, జీపీవోలకు 60:40 నిష్పత్తిలో సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని నిర్ణయించింది. జిల్లా స్థాయిలో రొటేషన్ పద్ధతిలో ఈ పక్రియ సాగనుంది. ఈ కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 12 నుంచి అమలులోకి రానున్నాయి. దీనివల్ల వేలమంది అధికారులకు లబ్ది చేకూరడమే కాకుండా, గ్రామాల్లో పాలన మరింత పటిష్టం కానుంది. అధికారులు వెంటనే ఈ పక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

## హామీలు గుప్పించి ప్రజలను మోసం చేశారు

మొన్ననే తమ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకుందని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతోపాటు బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయని చెప్పారు. అధికారంలోకి రాకుంటే కొంపలు అంటుకుపోతాయి అనుకోవద్దని నేతలకు సూచించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పారని.. తొందరపడకండి ఆగమై ఓటు వేయకండి అని కేసీఆర్ కల్వకుర్తిలో చెప్పిన మాటలను గుర్తు చేశారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చే సమయంలో ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.. పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారు అంటూ అడిగారన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధు మాత్రం కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. చాలా నియోజక వర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు ఈ ఎమ్మెల్యే మాకొద్దు అనుకుని తమ ఎమ్మెల్యేలను ఓడగొట్టారని కేటీఆర్ అన్నారు. అలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని తెలిపారు.

## 'తుమ్మిడిహట్టి'పై వేగం పెంచండి



నికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. మంత్రి బుధవారం మీడియాతో మాట్లాడారు. తుమ్మడి హట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు భగీరథ ద్వారా ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. తుమ్మి డిహట్టి నుంచి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ ప్రతిపాద నలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆర్వీ అసోసి యేట్స్, ఐఐటీ హైదరాబాద్ సమిష్టిగా నాలుగు ప్రతిపా దనలు ప్రభుత్వం ముందుకు తెచ్చారని వివరించారు. ప్రతీ ప్రతిపాదనకు అయ్యే ఖర్చు, అనుకూల, ప్రతి కూల తలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో జరగనున్న సమీక్షా సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. మెడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణకు అవసరమైన పరీక్షలను వర్షాకాలం లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతీ 1.5 మీటర్ల దూరంలో ఎస్పీటీ టెస్టులు నిర్వహించాలి. ప్రతీ మూడు మీటర్ల దూరంలో పెర్మిబిలిటీ టెస్టులు జరపాలి. బోర్లు వేస్తున్న సమయంలో రాయి వచ్చినప్పటికీ రాయి లోపటికి 5 మీటర్లు లోతుగా బోర్లు వెయ్యాలి. బ్యారేజ్ ల పునరుద్ధరణ కోసం నియమించిన సమన్వయ కమిటీ బ్యారేజ్‌లను సందర్శించి టైంలైన్‌ను ఫిక్స్ చేసుకోవాలి. అఖిఖఖా డైరెక్టర్ క్షేత్ర స్థాయిలో ఉంటూ పునరుద్ధరణకు అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలి. పునరుద్ధరణ కోసం జరుగుతున్న పురోగతి పనుల వివరాలను ఎప్పటికప్పుడు సమగ్రంగా సమాచారం అందించాలి.' అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు.

## వదంతులతోనే భారీగా కొనుగోళ్లు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పెట్రోలియం ఉత్పత్తులకు అకస్మాత్తుగా డిమాండ్ పెరిగిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఖమ్మం, మిర్యాలగూడ, నిర్మల్ వంటి సరిహద్దు ప్రాంతాలపై దీని ప్రభావం పడిందన్నారు. వదంతులతో ప్రజలు అధికంగా కొనుగోళ్లు చేస్తున్నారని తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయనే ఊహాగానాలతో పరిస్థితి తీవ్రమైందన్నారు. హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఏర్పడిందన్నారు. "ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు 24 గంటలూ పనిచేయాలని కోరాం. రాష్ట్రవ్యాప్తంగా 3,817 ట్యాంకర్లు పంపారు. పరిస్థితులపై అంచనాకు కలెక్టర్లతో జిల్లా ఇంధన సరఫరా కమిటీని ఏర్పాటు చేశాం. ఇంధన నిల్వల పర్యవేక్షణకు అధికారులను సిద్ధంగా ఉంచాం. పెట్రోల్, డీజిల్ అవుట్‌లెట్లలో ప్రతి నాలుగు గంటలకు తాజా సమాచారం తీసుకుంటూ సరిపడా నిల్వలు ఉంచేలా పర్యవేక్షిస్తున్నాం. ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1967ను సంప్రదించాలి" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోలు పక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా సాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623, వివిధ సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు నడుస్తున్నాయి. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 6,500 లారీలను సిద్ధం చేశారు. ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. ధాన్యం నిల్వ కోసం ముందస్తుగా 20 కోట్ల గన్నీ సంచులను సిద్ధంగా ఉంచారు. ఇప్పటివరకు రూ. 2,031 కోట్ల విలువైన 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రైతులకు ఇప్పటికే రూ. 323 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. 3.46 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయడం ద్వారా 64,779 మంది రైతులకు లబ్ది చేకూరింది. అలాగే, 30,220 మెట్రిక్ టన్నుల సెనగ కొనుగోలు పక్రియ పూర్తయ్యిందని అన్నారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను నెలకొల్పింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించేందుకు నిరుటి కంటే ఈసారి కేంద్రాల సంఖ్యను పెంచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన 8,525 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623 కేంద్రాలు, సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు, ఇతర సహకార సంస్థల ద్వారా 353 కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో దాదాపు 43,000 మంది శిక్షణ పొందిన సిబ్బంది కొనుగోళ్లలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు మంగళవారం నాటికి సుమారు 8.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు పూర్తయిందన్నారు.

## అండమాన్‌లో జరుగుతున్నది అభివృద్ధి కాదు


**- అతిపెద్ద పర్యావరణ చౌర్యం**

**- రూ.లక్షల కోట్ల దోపిడి**

**- నిరాశ్రయులవుతున్న స్థానిక ప్రజలు**

**- లెఫ్టినెంట్ గవర్నర్ రాజులా వ్యవహరిస్తున్నారు : రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి): అండమాన్ నికోబార్ దీవుల్లో భారీ ఎత్తున భూకబ్జా, పర్యావరణ విధ్వంసం, పరిపాలనా అవినీతి జరుగుతోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. స్థానిక ఆదివాసీలు, పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. వలసదారులకు, గిరిజనులకు సరైన పరిహారం అందడం లేదని అన్నారు.విజయపురంలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, "మీ భూములను మీ నుంచి తీసుకుని అదానీ వంటి పెద్ద వ్యాపారవేత్తలకు



ఇస్తున్నారు. ఇక్కడ అటవీ హక్కుల చట్టం అమలు కావడం లేదు. వలసదారులకు, గిరిజనులకు సరైన పరిహారం అందడం లేదు. నిశ్శబ్దంగా భారతదేశ వారసత్వాన్ని దోచుకుంటున్నారు" అని ఆరోపించారు. అండమాన్ నికోబార్ ప్రజల సమస్యలను దేశ ప్రజలకు తెలియజేస్తామని, వారి హక్కులను కాపాడేందుకు ప్రయత్నిస్తామని ఆయన అన్నారు.అండమాన్‌లో పరిపాలనాపరమైన సమస్యలు ఉన్నాయని ఆరోపిస్తూ, నీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే లెఫ్టినెంట్ గవర్నర్ వైపు నుంచి అవినీతి పెరిగిపోయిందని విమర్శించారు. "ఇక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ రాజులా వ్యవహరిస్తున్నారు. తనకు నచ్చినట్లు చేస్తున్నారు. ఆయన తన ఇల్లు, కార్యాలయానికి 'లోక్ భవన్' అని పేరు పెట్టుకున్నా, ప్రజలను కలవరు. ప్రజల మాట వినాలి, గౌరవించాలి. ఇది నియంతృత్వం కాదు" అని అన్నారు.మరోవైపు గ్రేట్ నికోబార్‌లో కేంద్రం చేపట్టిన అభివృద్ధి పనుల వల్ల భారీ స్థాయిలో పర్యావరణ విధ్వంసం జరుగుతోందని, స్థానిక ప్రజలు నిరాశ్రయులవుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ప్రాజెక్టును దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా జరుగుతున్న "అతిపెద్ద కుంభకోణాలలో" ఒకటిగా ఆయన అభివర్ణించారు.తాజాగా రాహుల్ గాంధీ గ్రేట్ నికోబార్‌ను సందర్శించినట్లు ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు. అలాగే ఆ ప్రాజెక్టుల వల్ల అడవులు, ఆదివాసీ వర్గాలపై పడుతున్న ప్రభావం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "నేను ఈరోజు గ్రేట్ నికోబార్‌లో పర్యటించాను. నా జీవితంలో నేను చూసిన అత్యంత అద్భుతమైన అడవులు ఇవి. తరతరాల జ్ఞాపకాలను నిక్షిప్తం చేసుకున్న చెట్లు, ఎన్నో ఏళ్లుగా పెరిగిన అడవులు ఇవి. ఈ ద్వీపంలోని ప్రజలు- అటు ఆదివాసీలు, ఇటు స్థిరపడిన వారు ఎంతో మంచివారు. కానీ వారి హక్కులను దోచుకుంటున్నారు" అని పేర్కొన్నారు.

# రైతన్న కోసం హైకోర్టుకు హరీష్

## రుణమాఫీ దక్కని రైతుల పక్షాన హైకోర్టుకు..



**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి) :** 'రుణమాఫీ చేస్తామని.. దేవుళ్ల మీద ఒట్లు పెట్టి మరీ మాట తప్పి, రైతుల నోట్లో మట్టి కొట్టిన రేవంతు సర్కారుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేసారు. రుణమాఫీ కాక రైతులు పడుతున్న కష్టాలు, కన్నీళ్లను చూసి చలించిపోయిన హరీశ్ రావు న్యాయ పోరాటానికి సిద్ధమయ్యారు. అన్యాయానికి గురైన రైతుల కోసం తాను హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో రుణమాఫీకి 43,363 మంది రైతులు అర్హులయ్యారు. రుణమాఫీ ప్రయోజనం పొందినవారు 20,514 మంది మాత్రమే. రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతుల సంఖ్య 22,849 మంది ఉన్నారు. రుణమాఫీ పొందిన రైతుల శాతం 47% మాత్రమే.

### మాట తప్పిన రేవంత్ రెడ్డి..

రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి, ఆ పైన ఉన్న అప్పులను రైతులు చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని షరతు విధించింది. ఈ మాట నమ్మి, ఎంతోమంది రైతులు అప్పులు చేసి, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి మరీ ఆ అదనపు మొత్తాన్ని చెల్లించారు. ప్రభుత్వం మాఫీ చేస్తుందని ఆశపడితే, ఇంతవరకు నిధులు విడుదల చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనివల్ల బ్యాంకుల నుండి రైతులపై ఒత్తిడి, వడ్డీల భారం పెరిగిపోయి, రైతులు మానసిక వేదనకు గురవుతున్నారు.

### హైకోర్టులో హరీష్ రిట్ పిటీషన్..

నియోజకవర్గంలోని వేలాది మంది రైతుల కష్టాలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద హైకోర్టును ఆశ్రయించానని సిద్దిపేట ఎమ్మెల్యే , మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను కోర్టు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వివరించారు. రైతుల ఖాతాల్లో వెంటనే రుణమాఫీ సొమ్మును జమ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, అర్హులైన 22,849 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులను జమ చేయాలని, బ్యాంకుల నుండి రైతులను కాపాడాలని డిమాండ్ చేసారు. హైకోర్టు ద్వారా తమ రైతులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందనీ విశ్వాసం వ్యక్తం చేశారు.

# పెరిక సంఘం ఆధ్వర్యంలో భద్రకాళి బ్రహ్మోత్సవాలు



**వరంగల్ (జనంసాక్షి) :** వరంగల్‌లోని భద్రకాళి దేవాలయంలో వడ్డే రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. పెరిక కుల సంఘం రి.నెం: 891/2014, 757/2017 ఆధ్వర్యంలో శరభవాహన సేవ బుధవారం ఉదయం భద్రకాళి బ్రహ్మోత్సవాల కమిటీ చైర్మన్ దిడ్డి నరేందర్, కన్వీనర్ ఆచార్య వడ్డే రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైనాయి. వరంగల్ పట్టణంలోని భద్రకాళి దేవాలయంలో ప్రతి ఏడాది జరిగే భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత 14 సంవత్సరాలుగా పెరిక కులం ఐక్యతతో అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నదని, అందులో భాగంగా బుధవారం హస్తా నక్షత్ర వృషభ లగ్న పుష్కరాంశ ఉ. 7.37 ని.లకు ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభ, వాయిద్య మేళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెరిక కుల సంఘ పెద్దలు, జిల్లా పెరికకుల సంఘం నాయకులు కుటుంబ సభ్యులతో పాల్గొని అమ్మవారికి భక్తుల గోత్రనామాలతో అర్చన చేసి పూజలు నిర్వహించారు. పెరిక కులం బి.సి వర్గాలలో ఒక సముచిత స్థానం పొందే విధంగా ముందుకు సాగాలని గ్రేటర్ వరంగల్ పెరిక కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ వడ్డె రవీందర్ పిలుపునిచ్చారు. ఈ బ్రహ్మోత్సవాలలో పెరిక కుల సంఘం ముఖ్య సలహాదారు చింతం లక్ష్మీనారాయణ, హనుమకొండ జిల్లా అధ్యక్షులు సాయిని నరేందర్, వరంగల్ జిల్లా అధ్యక్షులు అచ్చె వినోద్ కుమార్, జిల్లా నాయకులు బెడిద అనిల్ కుమార్, బెడద వెంకన్న, దొంగరి శ్రీనివాస్, చిలుసాని రాజు పెరిక మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

### ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం వాయిదా

గతంలో ప్రకటించిన విధంగా బుధవారం ప్రధానం చేయాల్సిన పెరిక కుల ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం వాయిదా వేసినట్లు గ్రేటర్ వరంగల్ పెరిక కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ వడ్డె రవీందర్ తెలిపారు. ఇంటర్, ఐఐటి, మెడిసిన్ తోపాటు ఈరోజు ఫలితాలు వెలువడి అయ్యే పదవ తరగతి విద్యార్థులకు కలిపి ప్రతిభా పురస్కారాలు ఇవ్వాలని కమిటీ నిర్ణయించినందని తెలిపారు. ఇట్టి మార్పును విద్యార్థులు గమనించాలని, తదుపరి ప్రతిభా పురస్కారాల - 2026 బహుకరణ తేదీ త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల ప్రతినిధి , ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి కేటాయించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ అర్హత కలిగి ఇందిరమ్మ ఇండ్లు రానివారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 100 ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మిగిలిన ఇండ్లు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రహదారుల విస్తరణలో భాగంగా బావురావుపేట గ్రామం నుండి కత్తెరసాల వరకు 5 కోట్ల రూపాయలు, బావురావుపేట నుండి కాచనపల్లి వరకు 3 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని, త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో రహదారులు, మురుగు కాలువల అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. భూ నిర్వాసితులకు 26 కోట్ల రూపాయల నష్టపరిహారం మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. బోర్ వెల్ ల ఏర్పాటు ద్వారా నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 300 బోర్ వెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. చెన్నూరు పరిధిలో హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో దాదాపు 5 వేల 500 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందని, ఈ విడతలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణ పనులకు దశలవారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడత కార్యక్రమాన్ని జూన్ మాసంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ గురుకుల విద్యార్థుల విజయదుందుభీ

## 98.99శాతం ఉత్తీర్ణత.. రెండో స్థానంలో బీసీ గురుకులాలు

- 204 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత
- అత్యధిక మార్కులు 588 సాధించిన నితీషా, శ్రీనిధి
- 3598 మంది విద్యార్థులు 90 శాతంపైగా మార్కులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల సంస్థ విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించి విజయఢంకా మోగించారు. అత్యధిక మార్కులు 588 ఇద్దరు బాలికలు నితీషా, శ్రీనిధి సాధించగా, 587 మార్కులు సాయి మనోజ్ రెడ్డి, లాస్య సాధించి తమ ప్రతిభను చాటారు. ఈ ఏడాది బీసీ గురుకుల విద్యార్థులు 98.99 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర సగటు కంటే 4.84 ఎక్కువ ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 294 పాఠశాలల నుంచి 204 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. 60 విద్యార్థులు 580 కంటే ఎక్కువ మార్కులు సాధించగా 570 కంటే ఎక్కువ మార్కులు 364మంది విద్యార్థులకు రాగా , 560 కంటే ఎక్కువ మార్కులు 1061 మంది విద్యార్థులు సాధించి తమ ప్రతిభను చాటారు. 3598 మంది విద్యార్థులు 90శాతం పైగా మార్కులతో తమ సత్తా చాటారు. ఈ ఏడాది 19,245మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 19,047 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారిలో 9,093 మంది బాలురు, 9,954 మంది బాలికలు ఉన్నారు.

### బీసీ సంక్షేమ వసతి గృహాల ఉత్తీర్ణత శాతం 96.05

రాష్ట్రంలోని బీసీ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. రాష్ట్రంలో ప్రీ-మెట్రిక్ బీసీ హాస్టల్స్ 365 నుంచి పదో తరగతి పరీక్షలకు 4941 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 4746 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో బీసీ సంక్షేమ వసతి గృహాల ఉత్తీర్ణత శాతం 96.05గా నమోదు అయ్యింది. ఇందులో 285 వసతి గృహాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అన్ని జిల్లాల లోని హాస్టల్స్ 90 శాతం కన్న ఎక్కువ ఉత్తీర్ణత సాధించగా ఆదిలాబాద్, హైదరాబాద్ , ములుగు జిల్లాలు 100శాతం ఫలితాలను సాధించాయి. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను , బోధనా సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్య కార్యదర్శి బాల మాయాదేవి, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు.

# సమర్థ భూ పరిపాలన లక్ష్యంగా..!

## తెలంగాణ రెవెన్యూ జేఏసీ దేశవ్యాప్తంగా అధ్యయనం

- బెంగళూరులో రెవెన్యూ క్లబ్, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు



**హైదరాబాద్, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** సమర్థ భూ పరిపాలన లక్ష్యంగా తెలంగాణ రెవెన్యూ జేఏసీ దేశవ్యాప్తంగా అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (కేఏఎస్), రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో రెవెన్యూ క్లబ్ మరియు రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి టీజీఈజేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, టీజీఈజేఏసీ కో చైర్మన్ కే.రామకృష్ణ, టీజీటీఏ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాకతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సేవల్లో అధికారులు సమగ్రత, సమర్థత కలిగి ఉండటానికి రెసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఏ విధంగా ఉపయోగ పడుతుందనే అంశంపై వారు స్టడీ చేశారు. ఈ స్టడీ టూర్ ద్వారా అధికారులు ప్రభుత్వ సేవల్లో కలిగి ఉండాల్సిన వృత్తి నైపుణ్యం, విధుల్లో బాధ్యత, ఆధునిక పరిపాలనా దృక్పథానికి ఒక కొత్త దిశను గుర్తించారు. రెవెన్యూ క్లబ్ లక్ష్యం అధికారుల సామర్థ్యాలను పెంపొందించడం, సేవల నాణ్యతను మెరుగుపరచడం, మరియు పరిపాలనలో సమర్థతను పెంచడం తదితర ప్రధాన అంశాలను కలిగి ఉంది. అంతేకాకుండా రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా నిరంతర అభ్యాసం, పరిశోధనాత్మక ఆలోచన, మరియు ప్రాక్టికల్ అడ్మినిస్ట్రేషన్ నైపుణ్యాల అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించారు.

### కర్నాటక ప్రభుత్వం నుండి ఏటా రూ.3కోట్ల ఆర్థిక సహకారం

రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ కు కర్ణాటక ప్రభుత్వం ప్రతి సంవత్సరం మదు కోట్ల రూపాయల ఆర్థిక ప్రోత్సాహం అందించడం, ప్రభుత్వానికి ఈ కార్యక్రమంపై ఉన్న ప్రత్యేక బాధ్యతలను గుర్తు చేస్తున్నట్టు తమ అధ్యయనంలో గుర్తించారు. కర్నాటక రెవెన్యూ అసోసియేషన్ చరిత్ర కూడా ఎంతో గొప్పదే కావడం గమనార్హం. 1919లో మైసూరు సివిల్ సర్వీస్ అసోసియేషన్‌గా ప్రారంభమై 1983లో కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(కేఏఎస్)గా రూపాంతరం చెంది, అప్పటి నుండి అధికారుల సంక్షేమం, శిక్షణ, మరియు సమర్థ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తోంది. ఒక సంస్థగా ఇది కేవలం ఉద్యోగుల ప్రయోజనాలకే పరిమితం కాకుండా, సమాజానికి మెరుగైన సేవలు అందించడంలో కూడా తన బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు పరిపాలనా వ్యవస్థలో ముఖ్యమైన భాగస్వాములు. అధికారుల మధ్య సమన్వయం పెంచడమే కాకుండా, విధానాల అమలులో ఉన్న లోపాలను గుర్తించి, వాటి పరిష్కారానికి మార్గద ర్శకంగా ఉండేలా రూపొందించారు. ఇలాంటి రెవెన్యూ క్లబ్‌లు ఒకవైపు ఉద్యోగుల హక్కులను కాపాడుతూనే, మరోవైపు ప్రభుత్వ లక్ష్యాల సాధనలో భాగస్వాములవుతున్నాయి. ఇలా ద్విముఖ పాత్రే వాటి ప్రత్యేకత. ఇతర రాష్ట్రాల అనుభవాల నుండి నేర్చుకోవడం ఈ కాలంలో అత్యంత అవసరమే. కర్ణాటక వంటి రాష్ట్రాలు తమ సంస్థల ద్వారా ఆదాయ మార్గాలను సృష్టించుకోవడం, స్వయం సమృద్ధి సాధించ డం, అధికారుల నైపుణ్యాభివృద్ధిని సంస్థాగ తంగా అభివృద్ధి చేయడం వంటి అంశాలు మనకు ఆదర్శంగా నిలుస్తాయని టీజీఈజేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ఈ విధమైన అధ్యయన పర్యటనలు (స్టడీ విజిట్స్) ద్వారా మంచి పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) గుర్తించి, వాటిని మన రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా స్వీకరించడం అత్యంత ప్రాముఖ్యమైనదని అన్నారు.

### ప్రజా సంక్షేమంలో ఉద్యోగ సంఘాల పాత్ర కీలకం కావాలి..

తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ సమయంలో, ప్రభుత్వ ఉద్యోగ సంఘాల పాత్ర మరింత కీలకంగా మారుతోందని వి.లచ్చిరెడ్డి అన్నారు. పాలనలో పారదర్శకత, వేగం, మరియు ప్రజలతో అనుబంధం పెరగాలంటే అధికారుల నైపుణ్యం, విజన్, మరియు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ఉద్యోగ సంఘాలు ముందడుగు వేయడం సమయానుకూలమని ఆయన అన్నారు. అన్ని రాష్ట్రాల సివిల్ సర్వీస్ సంఘాలతో సమన్వయం పెంచి, ఆల్ ఇండియా స్థాయిలో పూర్తి అవగాహన సాధించడం వల్ల పరిపాలనలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ సహకారం ద్వారా విధానాల్లో కొత్త ఆలోచనలు, సమర్థవంతమైన అమలు పద్ధతులు అభివృద్ధి చెందుతాయన్నారు. మొత్తానికి, కర్ణాటకలో ప్రారంభమైన ఈ రెవెన్యూ క్లబ్, రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ దేశానికి ఒక ఆదర్శ నమునాగా నిలుస్తుందని లచ్చిరెడ్డి అభిప్రాయపడ్డారు.

# తెలంగాణ రాష్ట్ర ఎస్ఎస్సి ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల విజయదుందుభీ

## అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి







**కరీంనగర్ బ్యూరో ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** విద్యార్థులకు పటిష్టమైన ప్రణాళికలను రూపొందిస్తూ వారిని సంచలనాత్మక విజయాలను నమోదు చేసే విధంగా ప్రోత్సాహం అందిస్తూ వారి కలలను సహకారం చేస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర పదవ తరగతి ఫలితాల్లో అద్భుతమైన ఫలితాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక విలేకరుల సమావేశానికి, అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బుధవారం రోజు ప్రకటించినటువంటి ఎస్ఎస్సి ఫలితాలలో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం పై చెయి సాధించడమే కాకుండా అద్భుతమైన ఫలితాలను సాధించడం అల్ఫోర్స్ విద్యా విధానానికి ఒక గొప్ప ప్రతిక అని వారు గుర్తు చేశారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రులు ఆశయాలకు అనుగుణంగా కృషి చేస్తూ తరగతి గదిలో బోధించినటువంటి విషయాలు ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ అద్భుతమైనటువంటి ఫలితాలు వైపు పయనించాలని వారు సూచించారు. అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో ఆర్.సాత్విక్ 589 మార్కులతో అగ్రస్థానంలో నిలిచాడని, ఓ.ఆద్య, టి.రాజు, బి.అక్షిత్ రెడ్డి, 588 మార్కులు సాధించారని, 1274 మంది విద్యార్థులకు 1026 విద్యార్థులు 500 మార్కులు పైన సాధించడం చాలా స్ఫూర్తిదాయకమని చెప్పారు. 48 మంది విద్యార్థులు 580 మార్కులు పైగా సాధించారని 334 మంది విద్యార్థులు 560 మార్కులు పైగా సాధించడం చాలా గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. అద్భుతమైన విజయాల సాధనకు అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బందికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. అనునిత్యం వారి పిల్లలకు ప్రోత్సాహం అందిస్తూ లక్ష్యాల వైపు పయనించే విధంగా ప్రోత్సహిస్తున్నటువంటి తల్లిదండ్రులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఛైర్మెన్ నరేందర్ రెడ్డిని తల్లిదండ్రులు ప్రశంసిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ముకుందరెడ్డిని కలిసిన ఎంబీ కృష్ణయాదవ్ అండ్ టీం**

పౌర సంబంధాల శాఖ స్పెషల్ సెక్రటరీగా బాధ్యతలు తీసుకున్న ముకుంద రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు యం బి కృష్ణ యాదవ్ ఎం రమణ రవీందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- హైదరాబాద్, ఏప్రిల్ 29 (జనంసాక్షి)

# దర్శకుడు, జర్నలిస్ట్ రఘురామ్ హఠాన్మరణం

**హైదరాబాద్, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుంది. ప్రముఖ దర్శకుడు, సీనియర్ జర్నలిస్ట్ బండి రఘురామ్ (56) కన్నుమూశారు. హైదరాబాద్ మధురానగర్ లో నివాసముంటున్న ఆయన.. మంగళవారం వాకింగ్ చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే బంధువులు, సన్నిహితులు ఆస్పత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జగిత్యాల జిల్లాకు చెందిన బండి రఘురామ్ కేవలం సినీ దర్శకుడే కాదు. జర్నలిజంలో ఎం.ఫిల్, ఇంగ్లీష్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. లిబియన్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన ఆయన, సినిమాలపై ఉన్న మక్కువతో ఆ ఉద్యోగాన్ని వదిలి టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ప్రముఖ దర్శకుడు సానా యాదిరెడ్డి వద్ద 'పిట్టలదొర', 'బ్రహ్మచారి' వంటి చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో-డైరెక్టర్‌గా పనిచేసి దర్శకత్వ మెళకువలు నేర్చుకున్నారు. 2004లో శివాజీ, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన 'వరం' చిత్రంతో రఘురామ్ దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించక పోయినప్పటికీ, దర్శకుడిగా ఆయన ప్రతిభను చాటుకుంది. ఆ తర్వాత పలు చిత్రాలకు రైటర్‌గా, ఘోస్ట్ రైటర్‌గా తన సేవలను అందించారు. ఇటీవల మళ్ళీ మెగాఫోన్ పట్టేందుకు ప్రయత్నాలు చేస్తూ, స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్న తరుణంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సినిమాల్లోకి రాకముందు, వచ్చాక కూడా రఘురామ్ జర్నలిజం రంగంలో చురుగ్గా ఉండేవారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఈటీవీ, వీ6 వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో స్పెషల్ కరస్పాండెంట్‌గా పనిచేశారు. ముఖ్యంగా ఆయన ఇచ్చే సినిమా రివ్యూలకు, విశ్లేషణలకు పాఠకుల్లో మంచి గుర్తింపు ఉండేది. ఆయన మరణవార్త విన్న సినీ ప్రముఖులు, జర్నలిస్ట్ మిత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. రఘురామ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒకేసారి అటు సినీ రంగంలో, ఇటు మీడియా రంగంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30 ఏప్రిల్ 2026

# మండుతున్నఎండలతో-మానవ మనుగడకే ముప్పు!

మన తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఎండాకాలం తీవ్రత రోజురోజుకీ పెరుగుతోంది. గతంతో పోలిస్తే ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడం, ఉక్కపోత అధికమవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా ఈసారి పగటి వేడి మాత్రమే కాదు, రాత్రి వేడి కూడా పెరగడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. సాధారణంగా చల్లదనాన్ని ఇస్తూ శరీరానికి విశ్రాంతినిచ్చే రాత్రులు కూడా ఇప్పుడు వేడి గాలులతో నిండిపోతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4.5 నుంచి 6.4 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదవడం 'వేడి రాత్రుల' తీవ్రతను సూచిస్తోంది.



వాతావరణ మార్పులు, పట్టణీకరణ, గ్రీన్‌హౌస్ వాయువుల పెరుగుదల-కలిసి ఈ పరిస్థితిని తీవ్రమయ్యేలా చేస్తున్నాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిడుగులు, నీటి ఎద్దడి, వ్యవసాయ నష్టాలు వంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. 2023లో దేశవ్యాప్తంగా పిడుగుల వల్ల 2,560 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 99 మంది, తెలంగాణలో 47 మంది మరణించడం అప్రమత్తత ఎంత అవసరమో చెబుతోంది.

**వాతావరణ మార్పులు-జీవన వ్యవస్థలపై ప్రభావం..**

ఎల్ నినో ప్రభావంతో ఋతుపవనాలు ఆలస్యమవుతాయి. దీని వల్ల ఎండలు సాధారణం కంటే ఎక్కువకాలం కొనసాగుతాయి. వర్షపాతం తగ్గిపోవడం లేదా ఆలస్యమవడం వల్ల రైతులు విత్తనాలు వేయడంలో ఇబ్బందులు పడతారు. విత్తనాలు ఆలస్యమైతే పంటల పెరుగుదల ప్రభావితం అవుతుంది. దిగుబడులు తగ్గిపోవడం వల్ల రైతుల ఆదాయం పడిపోతుంది. ఇది వ్యవసాయ రంగానికి మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా దెబ్బతీస్తుంది.

నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బావులు ఎండిపోవడం, నీటి మట్టాలు పడిపోవడం సాధారణమవుతోంది. పట్టణాల్లో నీటి సరఫరా సంక్షోభంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

వాతావరణ మార్పులు జీవవైవిధ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పశ్చిమ కనుమలు, హిమాలయాలు, సుందర్బన్ల వంటి ప్రాంతాల్లో అనేక జాతులు అంతరించిపోతున్నాయి. అడవుల్లో అగ్నిప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇవి ప్రకృతి సమతౌల్యాన్ని దెబ్బతీస్తున్నాయి.

ఇక వ్యవసాయ దిగుబడుల విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరం. పరిశోధనల ప్రకారం వరి దిగుబడులు 2050 నాటికి 20శాతం, 2080 నాటికి 47శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. గోధుమ దిగుబడులు కూడా 19శాతంనుంచి 40శాతం వరకు పడిపోవచ్చు. దీని వల్ల కోట్లాది ప్రజలు ఆహార భద్రత సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. ధరలు పెరగడం, సరఫరా లోపాలు వంటి సమస్యలు మరింత తీవ్రమవుతాయి.

**ఆరోగ్య ముప్పులు-జాగ్రత్తలే రక్షణ..**

అధిక ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుదలతో వడదెబ్బ ముప్పు గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, శారీరక శ్రమ చేసే కార్మికులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు.

పసిపిల్లల్లో డీహైడ్రేషన్ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. శరీరంలో నీరు తగ్గిపోవడం వల్ల సోడియం స్థాయులు పెరిగి ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంది. పెద్దల్లో తలనొప్పి, వాంతులు, అలసట, అధిక చెమటలు, కొన్నిసార్లు చెమటలు రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి వడదెబ్బ సంకేతాలుగా పరిగణించాలి.

మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి వేడి మరింత ప్రమాదకరం. శరీరం వేడిని తట్టుకోలేకపోతే అపస్మారక స్థితి కూడా రావచ్చు. కాబట్టి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరం.

ఈ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చాలా కీలకం. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. నిమ్మరసం, ఉప్పు, చక్కెర కలిపిన ద్రావణాలు తీసుకోవడం ద్వారా శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతౌల్యాన్ని కాపాడుకోవచ్చు. పసిపిల్లలకు తరచూ తల్లిపాలు ఇవ్వాలి. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలి.

ఇటీవల 'వేడి రాత్రులు' కూడా పెద్ద సమస్యగా మారాయి. పట్టణాల్లో అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం వల్ల రాత్రివేళ కూడా వేడి తగ్గడం లేదు. తారు రోడ్లు, కాంక్రీట్ భవనాలు పగటిపూట వేడిని నిల్వ చేసి రాత్రివేళ విడుదల చేస్తాయి. గాలి ప్రసరణకు అడ్డంకులు ఏర్పడటంతో వేడి నేల దగ్గరే నిలిచిపోతుంది.

ఈ సమస్యను తగ్గించేందుకు చెట్ల పెంపకం చాలా అవసరం. శీతల పైకప్పులు, ప్రతిఫలించే నిర్మాణ పదార్థాలు, గాలి ప్రసరణకు అనుకూల నగర ప్రణాళికలు అమలు చేయాలి. ఇవి రాత్రి వేడిని తగ్గించడంలో సహాయపడతాయి.

**అప్రమత్తతే ప్రాణరక్షణ..**

ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న ఈ సమయంలో ప్రభుత్వం, ప్రజలు కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వాతావరణ మార్పులను అంచనా వేసి ముందస్తు చర్యలు తీసుకోవాలి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడం, నీటి సంరక్షణపై దృష్టి సారించడం అత్యవసరం.

ప్రజలు వ్యక్తిగత స్థాయిలో కూడా జాగ్రత్తలు పాటించాలి. తగినంత నీరు తాగడం, ఎండలో బయటకు వెళ్లకుండా ఉండడం, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకపోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఈ వేసవిలో

నిర్ణీత ఉష్ణోగ్రత దాటాక పెరిగిన ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత ప్రాణాలకు పరీక్షగా మారుతున్న వేళ... అప్రమత్తతే మనకు కవచం. జాగ్రత్తలే జీవరక్షణ మార్గం.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

## జ్ఞాన భోధి

రాజ భోగాలన్నీ వదిలి,
జ్ఞానమే దారిగా సాగిన
ఆధ్యాత్మిక చైతన్యం అతను
మానవాళికి శాంతిని పంచి!
అహాన్నీ,ద్వేషాన్ని ప్రేమతో
జయించడమే బుద్ధుని సూత్రం
సత్యం బాటలో శాంతి సౌధాన్ని నిర్మించడమే
తథాగతుని వాక్కు

కోరికలేగదా అన్నింటికీ కారణం
మన ఆలోచనల ఫలితమే
మన జీవితమనే అసలు సత్యం!!
మనస్సు ప్రశాంతంగా ఉంటేనే
సంతోషం వెన్నంటి జీవన సూత్రం

ఆయన రూపం
శాంతికి చిరునామా,
ఆయన బోధనలు
మానవాళికి వెలుగుబాట
కన్నులలో కరుణ,
పెదవులపై చిరునవ్వు,
సత్యాన్వేషణకై
సిద్ధార్థుడి నుండి
బుద్ధుడిగా మారిన వైనం
సమస్త మానవాళికి ఆదర్శం

సమ్యక్ వాక్కు, సమ్యక్ జీవనం
అందరికీ తెరచిన జ్ఞాన ద్వారం
అష్టాంగ మార్గం..

వేల కొలది వ్యర్థ మాటలు కన్నా
శాంతిని ప్రసాదించే
ఒక్క మాట చాలు
నిజమైన సత్యాన్ని బోధించే జ్ఞాని
గౌతమ బుద్ధుడే
ఆయనే శాంతికి మారు పేరు!

బుద్ధం శరణం గచ్ఛామి:
సంఘం శరణం గచ్ఛామి:
ఆలోచనలను, ఆత్యాశను నియంత్రించుకునే
ధ్యానమే
మనందరి ఆరోగ్యసూత్రంగా మలుచుకుందాం

**(వైశాఖ పౌర్ణమి.. బుద్ధ జయంతి సందర్భంగా**

అనిత కృష్ణ గండమళ్ళ
9490876621

# వివాహం ఒక మృత శిల.. ప్రేమ ఒక జీవన స్రవంతి



"ప్రేమ ఒక పక్షి అయితే, స్వేచ్ఛ దాని రెక్కలు. ఆ రెక్కలను కత్తిరించి నీవు ప్రేమను పంజరంలో దాచలేవు." – ఓషో

వివాహం అనేది మనిషి తన భయాన్ని పోగొట్టుకోవడానికి నిర్మించుకున్న ఒక 'కృత్రిమ రక్షణ కవచం'. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదనే సత్యాన్ని అంగీకరించలేక, మనిషి 'చట్టం' ద్వారా ప్రేమను బంధించడానికి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నమే వివాహం. ఒక రకంగా వివాహం అనేది ప్రేమకు శత్రువు. ఓషో దృష్టిలో, ప్రేమ అనేది ఒక అడవి పువ్వు వంటిది. అది స్వేచ్ఛగా ఉన్నప్పుడే వికసిస్తుంది. దానిని తెంపి పూలదండగా మార్చి 'వివాహం' అనే పంజరంలో పెట్టిన క్షణమే అది చనిపోతుంది. ఇక్కడ నేను చెప్పదల్చుకున్నదేమిటంటే వివాహ బంధం వద్దు అనేది కాదు అది వారి నిర్ణయం వారి స్వేచ్ఛ అనేదే. కానీ వివాహ బంధంలో ప్రేమ, స్నేహం లేకపోవడం అంటే.. అది కేవలం ఒక చట్టబద్ధమైన ఒప్పందంగానే ఉంటుంది. స్నేహం ప్రేమ లేని వివాహ బంధాన్ని, ఇంకా సూటిగా చెప్పాలంటే వివాహ బంధాన్ని "చట్టబద్ధమైన వ్యభిచారం" అని కూడా ఓషో పిలిచేవారు. అంటే, మనసు కలవకుండా కేవలం భౌతిక అవసరాల కోసం, సామాజిక భద్రత కోసం కలిసి ఉండటం ఆత్మను చంపుకోవడమే. ఇక్కడ 'నేను నీ యజమానిని', 'నీవు నా ఆస్తివి' అనే అహంకారం పెరుగుతుంది. స్నేహం లేని చోట కేవలం అధికారం ఉంటుంది. వివాహ బంధం లేకపోయినా ప్రేమ, స్నేహం ఉండటం గురించి ఓషో చాలా ఉన్నతంగా చెప్పారు. ఆయన ప్రకారం, 'Friendship is the highest form of love."

(స్నేహం ప్రేమ యొక్క అత్యున్నత రూపం) గా విశ్లేషిస్తారు. ఎందుకంటే స్నేహంలో ఎటువంటి షరతులు ఉండవు, ఎటువంటి ఆశలు ఉండవు. వివాహం లేని ప్రేమలో 'స్వేచ్ఛ' ఉంటుంది. స్వేచ్ఛ ఉన్న చోటే దైవత్వం ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు కలిసి ఉండాలని నిర్ణయించుకున్నది చట్టం వల్ల కాదు, వారి అంతరాత్మల పిలుపు వల్ల. ఇది ఒక నిరంతర ప్రవాహం. ఇక్కడ ఒకరిపై ఒకరు ఆధారపడటం ఉండదు, కలిసి పంచుకోవడం ఉంటుంది. ఓషో మాటల్లో చెప్పాలంటే, ఇది "రెండు స్వతంత్ర అస్తిత్వాల నృత్యం"

సమాజం వివాహాన్ని గౌరవిస్తుంది ఎందుకంటే అది నియంత్రణకు వీలుగా ఉంటుంది. కానీ, ప్రేమ స్వేచ్ఛను కోరుకుంటుంది. ముందే చెప్పినట్లుగా ఓషో విశ్లేషణ ప్రకారం ప్రేమ లేని వివాహం అనేది ఒక గోడ. ఇది మనిషిని ఎదుగనివ్వదు. ఇది కేవలం భౌతిక భద్రతను ఇస్తుంది కానీ ఆనందాన్ని ఇవ్వదు. వివాహం లేని ప్రేమ అనేది ఇది ఒక బాట. ఇది మనిషిని తన అంతరంలోకి ప్రయాణించేలా చేస్తుంది. ఇక్కడ ఒకరిని ఒకరు మార్చాలనే ప్రయత్నం ఉండదు, ఒకరిని ఒకరు ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించడం ఉంటుంది. ఓషో ఏనాడూ వివాహాన్ని వ్యతిరేకించలేదు, కానీ 'ప్రేమ లేని వివాహాన్ని' వ్యతిరేకించారు. బంధం అనేది 'సంకెళ్లు' కాకూడదు, అది 'కలిసి నడిచే బాట' కావాలి.

వివాహ పత్రం మీద సంతకం చేసినంత మాత్రాన బంధం ఏర్పడదు, అది ఇద్దరు వ్యక్తుల మధ్య మౌనంగా, నిరంతరం ప్రవహించే స్నేహం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. స్నేహం లేని పెళ్లి ఒక ఎడారి.. పెళ్లి లేకపోయినా స్నేహం, ప్రేమ ఉన్న చోట నందనవనం ఉంటుంది.



కస్తూరి దారా
Jannukastoori@gmail.com

## ఛాయచిత్రాలు



బంగారుభాష
దారిమార్చని భాష
సోమర్ల భాష
నియంత యుద్ధం
నడవాలి పెత్తనం
నాయక ట్రంపు
విశ్వరహస్యం
విజ్ఞాన గూఢచారి
ఛేదన చింత

పదార్థ ధర్మం
మనసు ప్రభావితం
దేహం ప్రశాంతం
పండిన పంట

దళారి షావుకారి
రైతు బికారి
వెల్గు నీడలు
జీవఛాయ చిత్రాలు

బతుకు ఆల్బమ్

రేడియమ్
9291527757

# ట్రంప్‌పై హత్యాయత్నాలు – భద్రతా వైఫల్యాలు

ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఇటీవల వరుస హత్యా ప్రయత్నాలు జరుగుతున్న వార్తలు ప్రపంచాన్ని కలిచివేస్తున్నాయి. 2026 ఏప్రిల్ 25న వాషింగ్టన్ హిల్టన్‌లో జరిగిన వైట్ హౌస్ కరెస్పాండెంట్స్ డిన్నర్ లో తాజాగా జరిగిన కాల్పులు మరో ఘటనగా నిలిచాయి . ఇప్పటికే 2024 పెన్సిల్వేనియా ర్యాలీ, ఫ్లోరిడా గోల్ఫ్ కోర్స్ ఘటనతో కలిపి మూడుసార్లు ప్రత్యక్ష ప్రాణాంతక ప్రయత్నాలు జరిగాయి . ఇవి అమెరికా చరిత్రలో జాన్ ఎఫ్ కెన్నెడీ, రొనాల్డ్ రీగన్ పై జరిగిన దాడులను గుర్తుకు తెస్తున్నాయి అంటే ఆ దేశ అంతర్గత భద్రత వ్యవస్థ ఇంకా అదే తరహా బలహీనతలను ప్రదర్శిస్తోందని స్పష్టమవుతోంది. ఈ వ్యాసం ఈ భద్రతా, ఇంటెలిజెన్స్ వైఫల్యాలపై విమర్శాత్మక విశ్లేషణను అందిస్తుంది.

**భద్రతా వైఫల్యాలు- స్పష్టమైన లోపాలు:**

ట్రంప్ పై అత్యంత తీవ్రమైన దాడి జూలై 13, 2024న బట్లర్ ర్యాలీలో జరిగింది. ఇక్కడ 20 ఏళ్ల యువకుడు థామస్ క్రూక్స్, అధ్యక్షుడి నుండి కేవలం 150 గజాల దూరంలోని భవనం పైకప్పుపైకి ఎక్కి ఏఆర్ -15 రైఫిల్‌తో కాల్పులు జరిపాడు. ఈ ఘటన అమెరికన్ సీక్రెట్ సర్వీస్ (యూఎస్ ఎస్ఎస్) చరిత్రలోనే అతిపెద్ద దుర్బలత్వాన్ని బయటపెట్టింది. సెనేట్ కమిటీ నివేదికల ప్రకారం, ఈ భద్రతా ఏర్పాటు "పూర్తి విచ్ఛిన్నం" అయింది. ఆరోపణల ప్రకారం, స్థానిక పోలీసులు ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని గుర్తించి, రేంజ్ ఫైండర్ తో ఉన్న సమాచారాన్ని 25 నిమిషాలకు పైగా(యూ.ఎస్.ఎస్ఎస్)కి చేరవేసినా, సరైన చర్య తీసుకోబడలేదు. సంఘటనా స్థలంలోని కమాండ్ సెంటర్ ఈ కీలక సమాచారాన్ని ట్రంప్ వ్యక్తిగత భద్రతా బృందానికి చేరవేయడంలో విఫలమైంది .

సెనేట్ జ్యుడీషియరీ కమిటీ చైర్మన్ చక్ గ్రాస్లీ విడుదల చేసిన (జీ.ఏ.ఓ.) నివేదిక ప్రకారం, దాడికి పది రోజుల ముందే (యూ.ఎస్.ఎస్ఎస్) కి ట్రంప్ పై నిర్దిష్ట ముప్పు గురించి తెలుసు. అయితే, దానిని స్థానిక భాగస్వాములతో పంచుకోవడానికి ఎలాంటి విధానం లేకపోవడం వలన ఈ హెచ్చరిక అడ్డుకట్ట వేయలేకపోయారు. రీగన్ పై హింక్లీ చేసిన దాడి తర్వాత భద్రతా మార్పులు చోటుచేసుకున్నా, మళ్ళీ అదే హిల్టన్ హోటల్‌లోనే మరో వ్యక్తి ఆయుధాలతో చొరబడడం భద్రతా వ్యవస్థలో లోపాన్ని మరోసారి చాటిచెప్పింది.

**ఇంటెలిజెన్స్ లోపాలు -సమాచారం ఇచ్చినా స్పందన లేదు:**

ఈ దాడుల్లో మరో ప్రధాన లోపం ఇంటెలిజెన్స్ (గూఢచారి) వ్యవస్థదే.(యూ.ఎస్.ఎస్ఎస్) ఒంటరిగా పనిచేయడం (విడివిడిగా ఉన్న సమాచారం) ప్రధాన సమస్యగా నివేదికలు గుర్తించాయి. చీఫ్ ఆఫ్ స్టాఫ్ లేదా స్థానిక పోలీసులతో సమన్వయం సరిగా లేకపోవడం వలన జరగబోయే దాడి చేసేవారిని గురించిన ప్రొఫైలింగ్ లో వైఫల్యం నమోదైంది . 2024 సెప్టెంబరులో ఫ్లోరిడాలో ర్యాన్ రూత్, 2025 మే లో అక్రమ వలసదారుని పేరుతో బెదిరింపులు చేసిన వ్యక్తి వంటి ఘటనలు ఉన్నప్పటికీ, ప్రీ-ఎవెంట్ స్క్రీనింగ్ లో లోపాలు కొనసాగాయి. అంతకుమించి, ఇరాన్ అనుబంధ బృందాలు మరియు దేశీయ మూలాల నుండి రసాయనిక ఆయుధాలతో (రిసిన్ లేఖలు) బెదిరింపులు ఉన్నా, వాటి తీవ్రతను అంచనా వేయడంలో ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు విఫలమయ్యాయి. సమాచారం ఉన్నా, దాన్ని 'జరగబోయే ప్రమాదం' నుండి 'ప్రత్యక్ష ముప్పు'గా మార్చి చర్య తీసుకోవడంలో జాప్యం జరిగింది.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్. 9849328496.

# స్త్రీలవ్యక్తిత్వాల బహు ముఖీనత

ప్రేమ – పరిత్యాగం – సంస్కారం: స్త్రీ హృదయ ఔన్నత్యంపై నేడు సమగ్ర విశ్లేషణ అవసరం. స్త్రీ వ్యక్తిత్వాన్ని సమాజం ఎప్పుడూ ఒక నిర్దిష్టమైన చట్రంలో చూడాలని ప్రయత్నిస్తుంది. పురుషులకు అవి లేవు.

కానీ ఎలిజబెత్ టేలర్ వంటి అంతర్జాతీయ నటీమణి జీవితం నుంచి, శరత్ బాబు గారి రాజ్యలక్ష్మి, గురజాడ వారి మధురవాణి, మరియు పాకీజా వంటి పాత్రల వరకు అందరిలోనూ ఒక 'ఉదాత్తమైన ప్రేమ' అంతర్లీనంగా కనిపిస్తుంది. వీరిని కేవలం వారి వృత్తి లేదా వివాహాల సంఖ్యతో కొలవలేము. వీరిలో ఉన్న సహృదయత, తాము ప్రేమించిన వారి కోసం చేసిన త్యాగాలు మరియు విడదీయలేని ఆత్మీయ బంధాల గురించి లోతైన విశ్లేషణ ఎంతో అవసరం. జీవితంలో సాహిత్యంలో అనేక మంది పురుషులతో ప్రేమలు ఆత్మీయతలు పంచుతున్న స్త్రీల ఉదాత్త వ్యక్తిత్వాలను తెలుసుకుంటే నేటి ఫెమినిజంలో అనేక వెలుగులు ప్రసరిస్తాయి. స్వతంత్రురీలు పురుషులు నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. పురుషుల ప్రేమలో అనేక ప్రేమలు లైంగిక సంబంధాలు ప్రధానంగా ఉండవచ్చు. కాని స్త్రీల ప్రేమలో అది ప్రధానం కావచ్చు. కాకపోవచ్చని. అనేక సార్లు వారు ప్రేమ అనుకున్నది మాతృ ప్రేమ వంటిది కలగలిసి వుంటుంది. కొందరు మహిళావాదులు ఈ మాటతో విభేదిస్తారు. స్త్రీల జన్య పరమైన లక్షణాలలో ప్రేమ వాత్సల్యం అనుబంధాలు సహజ లక్షణాలు. వీటిని మనుషుల్లో కాకుండా పశువులలో, జంతువులలో పక్షుల్లో చూసినపుడు సులభంగా అర్థమవుతాయి.

మహానటి ఎలిజబెత్ టేలర్: ప్రేమలో అంకితభావం – స్నేహపూర్వక సంస్కారం గమనించ వచ్చు. ఎలిజబెత్ టేలర్ ఎనిమిది సార్లు వివాహం చేసుకోవడం వెనుక ఉన్నది కేవలం ఆకర్షణ కాదు, ఆమెకు వివాహ బంధంపై ఉన్న గౌరవం. "నేను ఎవరిని ప్రేమించినా పెళ్లి చేసుకుంటాను" అని ఆమె చెప్పడం వెనుక ఉన్న సాహసం ఫెమినిజం కోణంలో అద్భుతమైనది. ఆమె తన మాజీ భర్తలతో శత్రుత్వం పెంచుకోలేదు. రిచర్డ్ బర్టన్ తో ఆమెది ఒక అమర ప్రేమ. అలాగే తన మాజీ భర్త మైఖేల్ వైల్డింగ్ కొడుకును తన వివాహంలో తోడుగా ఉంచుకోవడం, మాజీ భర్త లారీ ఫోర్టెన్స్కీ వైద్య ఖర్చులు భరించడం ఆమె 'ఉదాత్త ప్రేమ'కు నిదర్శనం. ఆమె జీవితం ఒక సహృదయ అను సంధానం.

టేలర్ జీవితాన్ని పరిశీలిస్తే, ఆమె వివాహాలను కేవలం సంఖ్యతో కాకుండా, ఆ బంధాల్లో ఆమె చూపిన 'నిజాయితీ'తో కొలవాలి. పితృస్వామ్య సమాజంలో ఒక పురుషుడు ఎన్ని పెళ్లిళ్లు చేసుకున్నా చెల్లుబాటు అయ్యే చోట, టేలర్ తన విడాకులను దాచుకోకుండా, తన మాజీ భర్తలతో ఒక 'కుటుంబ సభ్యురాలు'గా మెలిగింది. ఇది విడాకులు అంటే శత్రుత్వం కాదు, కేవలం బంధం రూపు మారడమే అని నిరూపించింది. ఆమె చూపిన ఈ సహృదయత ఆధునిక స్త్రీవాదానికి ఒక గొప్ప పాఠం.

శరత్ బాబు నవల శ్రీకాంత్ లోనిరాజ్యలక్ష్మి : బురదలో విరిసిన తామర.

శరత్ బాబు గారి 'శ్రీకాంత్ నవలలోని రాజ్యలక్ష్మి పాత్ర ఒక అపురూప సృష్టి. చిన్నప్పుడు ప్రేమించిన శ్రీకాంతు కోసం ఆమె తన ఐశ్వర్యాన్ని, విలాసాన్ని త్యాగం చేస్తుంది. ఆమె వేశ్యా నర్తకి అయినప్పటికీ, అతని పట్ల ఆమె చూపిన మమకారం ఒక ప్రేమికురాలిగానే కాక, ఒక తల్లిలాగా, ఒక సేవకురాలిలాగా కనిపిస్తుంది. "నేను నీ పాదదాసిని" అని ఆమె అనడం బానిసత్వం కాదు, అది ప్రేమలో తనను తాను అర్పించుకున్న సమర్పణ భావం. సమాజం ఆమెను 'పతిత'గా చూసినా, శ్రీకాంతు దృష్టిలో ఆమె 'రాజ్యలక్ష్మి'.

రాజ్యలక్ష్మి పాత్రలో మనకు 'ప్రేమ ద్వారా మోక్షం' కనిపిస్తుంది. సమాజం ఆమెపై వేసిన వృత్తి పరమైన ముద్రను ఆమె తన ఆత్మసంస్కారంతో తుడిచివేసుకుంది. శ్రీకాంత్ అనే సంచారికి ఆమె ఒక స్థిరమైన నీడను ఇచ్చింది. ఆమెలోని సేవానిరతి కేవలం అణకువ కాదు, అది తన ప్రియుడిని ఒక ఉన్నత స్థితిలో చూడాలనుకునే ఉదాత్తమైన తపన. ఇది స్త్రీ తన ప్రేమ ద్వారా ఒక పురుషుడిని ఎలా సంస్కరించగలదో చూపిస్తుంది.

మధురవాణి (కన్యాశుల్కం): సామాజిక స్పృహ కలిగిన స్వతంత్ర వనిత

గురజాడ అప్పారావు గారి మధురవాణి కేవలం ఒక వేశ్య పాత్ర కాదు, ఆమె ఒక మేధావి. గిరీశం వంటి మోసగాళ్లను ఎదిరించి, విద్యావంతురాలై, సమాజంలోని కుళ్లును కడిగేయాలని చూస్తుంది. ఆమెలో ఉన్న ధైర్యం, ఎదుటివారి మేలు కోరే గుణం ఆమెను ఉన్నత స్థానంలో నిలబెడతాయి. తన వ్యక్తిత్వాన్ని తాకట్టు పెట్టకుండా, తనదైన శైలిలో జీవించడం ఆమెలోని ప్రత్యేకత.

మధురవాణి పాత్ర అప్పట్లోనే 'ఆర్థిక స్వతంత్రం' మరియు 'మానసిక వికాసం' ఉన్న స్త్రీగా కనిపిస్తుంది. పురుషాధిక్య సమాజంలోని కుతంత్రాలను తన తెలివితేటలతో తిప్పికొడుతూనే, మరోపక్క అమాయకపు ఆడపిల్లల జీవితాల కోసం తాపత్రయపడుతుంది. ఆమె ప్రేమ కేవలం ఒక వ్యక్తికే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతగా మారుతుంది. ఇది స్త్రీ శక్తికి మరియు ఆమెలోని పరిణతికి అద్దం పడుతుంది.

**పాకీజా (సాహిబాన్): కళాత్మక వేదన - విముక్తి:**

'పాకీజా' చిత్రంలో సాహిబాన్ (మీనా కుమారి) పాత్ర కళావంతుల వంశంలో పుట్టినా, ఆమె మనసు నిత్యం పవిత్రతను కోరుకుంటుంది. చుట్టూ ఉన్న విలాసాలు ఆమెను బంధించినా, సలీమ్ (రాజ్ కుమార్) తో ఆమెకు ఏర్పడిన పరిచయం ఆమెలో నూతన ఆశను నింపుతుంది. రైలు ప్రయాణంలో సలీమ్ రాసిన లేఖను జీవితాంతం దాచుకోవడం, తన నృత్యాన్ని తన ఆరాధనగా మార్చుకోవడం ఆమెలోని 'నిర్మల ప్రేమ'కు నిదర్శనం.

సాహిబాన్ పాత్రలోని విషాదం ఆమె వృత్తిలో లేదు, ఆమె ఆత్మ కోరుకునే స్వేచ్ఛలో ఉంది. సలీమ్ ఆమె పాదాలను 'అపవిత్రం' చేయవద్దని రాసిన లేఖ, ఆమెలో ఆత్మగౌరవాన్ని మేల్కొల్పుతుంది. సమాజం ఆమెను నర్తకిగా చూస్తే, ఆమె తనను తాను ఒక ప్రేమికురాలిగా, ఒక ఆత్మీయురాలిగా పునర్నిర్మించుకుంటుంది. ఈ పాత్ర స్త్రీ అంతరంగంలోని 'పరిశుద్ధత' భౌతికమైన స్థితిగతుల కంటే మిన్న అని చాటి చెబుతుంది.

**సాహిత్యపు సంపద వసంత సేన:**

ప్రాచీన సాహిత్యంలో 'మృచ్ఛకటికం' లోని వసంతసేన పాత్ర కూడా దారిద్ర్యంలో ఉన్న చారుదత్తుడిని ప్రేమిస్తుంది. అతని గుణానికి ఆకర్షితురాలై తన దగ్గరున్న నగలన్నింటినీ వదులుకుంటుంది. సంపద కన్నా గుణమే మిన్న అని నిరూపించిన ఈ పాత్ర రాజ్యలక్ష్మి పాత్రకు పునాది వంటిది. మధుర వాణి గిరీశం పాత్రలు శకారుడు, వసంత సేన ఈ పాత్తలనుండి తీసుకొని విస్తరించారు.

వసంతసేన పాత్ర ద్వారా 'గుణనిధి' అయిన పురుషుడికి స్త్రీ ఇచ్చే అగ్రతాంబూలం కనిపిస్తుంది. ఆమెకు రాజులు, ధనవంతులు అందుబాటులో ఉన్నా, పేదవాడైన చారుదత్తుడిలోని నిజాయితీని ఆమె ప్రేమిస్తుంది. తన సంపదను అతని దారిద్ర్య నిర్మూలనకు వాడటం ద్వారా ఆమె ప్రేమలోని 'ఉదారత' బయటపడుతుంది. ఇది స్త్రీ కేవలం రక్షణ కోరుకునే వ్యక్తి కాదు, రక్షణ ఇవ్వగలిగే శక్తి అని నిరూపిస్తుంది.

**ప్రేమ (రాజేశ్ ఖన్నా సినిమా) - సంశ్లేషణ:**

రాజేశ్ ఖన్నా నటించిన 'అమర ప్రేమ్' మహబూబా వంటి సినిమాల్లో కూడా కథానాయకుడికి తన జీవితాన్ని ధారబోసే స్త్రీ మూర్తిని చూస్తాం. ఆమె అతనిని వ్యసనాల నుండి మళ్ళించి, ఒక మనిషిగా తీర్చిదిద్దుతుంది. ఎలిజబెత్ టేలర్ ఎలాగైతే తన భర్తల ఎదుగుదలకు, వారి అనారోగ్యంలో తోడుగా నిలిచిందో, ఈ సినిమాల్లోని నాయకి పాత్రలు కూడా అలాగే పురుషుడి అంతరంగ ప్రక్షాళన చేస్తాయి.

ఇక్కడ ప్రేమ ఒక 'చికిత్స'లా (నముశ్రీఅఅస్త్ర) పనిచేస్తుంది. రాజేశ్ ఖన్నా పాత్రల్లోని అస్థిరతను కథానాయిక తన స్థిరమైన ప్రేమతో జయిస్తుంది. ఇది ఒక రకమైన 'ప్రేమ సంశ్లేషణ'. స్త్రీ ప్రేమ అనేది కేవలం ఒక భావోద్వేగం కాదు, అది ఒక వ్యక్తిని పునర్నిర్మించే సృజనాత్మక శక్తి. టేలర్ కూడా తన జీవితంలో రిచర్డ్ బర్టన్ వంటి వారి వ్యక్తిత్వాలకు ఊతంగా నిలిచి, వారిలోని ప్రతిభను ప్రపంచానికి చాటింది.

**శరత్ బాబు నవల చరిత్ర హీనులు - రెండు ముఖ్య పాత్రలు:**

శరత్ బాబు గారి 'చరిత్ర హీనులు' లోని కిరణ్మయి, సావిత్రి పాత్రలు సమాజం దృష్టిలో 'చరిత్ర లేనివారు'గా ముద్ర వేయబడ్డారు. కానీ కిరణ్మయి అపారమైన మేధాశక్తి కలిగిన స్త్రీ. సావిత్రి ఒక అమాయకపు ప్రేమికురాలు. వీరిద్దరిలోనూ ఉన్నది త్యాగనిరతే. సమాజం వారిపై వేసిన నిందలు వారి హృదయ పవిత్రతను చెరపలేకపోయాయి. కిరణ్మయి తన భర్త కోసం చేసిన సేవ, ఆమె అనుభవించిన మానసిక సంఘర్షణ ఆమెను ఒక 'ఉదాత్త స్త్రీ'గా నిలబెడతాయి.

కిరణ్మయి మరియు సావిత్రి పాత్రలు 'నైతికత' అనే పదానికి సమాజం ఇచ్చే నిర్వచనాలను ప్రశ్నిస్తాయి. చరిత్ర ఎప్పుడూ పైపైన కనిపించే విజయాలనే రికార్డు చేస్తుంది, కానీ ఈ స్త్రీలు తమ అంతరంగాల్లో చేసిన యుద్ధాలను,



పొందిన గాయాలను చరిత్ర గుర్తించదు. అందుకే వారు 'చరిత్ర హీనులు'. కానీ వారి ప్రేమలోని నిశబ్ద శక్తి, వారు ఎదుర్కొన్న అవమానాలు వారిని అమర పాత్రలుగా మార్చాయి. ఇది స్త్రీ సహనానికి మరియు ఆమెలోని అనితరసాధ్యమైన ప్రేమకు పరాకాష్ట.

ఫెమినిజం వెలుగులో:పైన పేర్కొన్న పాత్రలన్నీ ఒక్కో మెట్టు మీద ఉన్నాయి.

**వీరిలో ఉన్న సామాన్య అంశాలు:**

**సేవ, త్యాగం:** తమ సుఖం కన్నా తాము ప్రేమించిన వారి క్షేమమే వీరికి ముఖ్యం.

**సహృదయత:** ఎలిజబెత్ టేలర్ మాదిరిగానే, వీరందరూ తమ గతాన్ని ద్వేషించలేదు, తమను వదిలి వెళ్ళిన వారిని శపించలేదు.

**నిర్మల ప్రేమ:** సమాజం వీరిని ఏ పేరుతో పిలిచినా (వేశ్య, కళావంతురాలు, పతిత), వారు చూపిన ప్రేమ మాత్రం అత్యున్నత మైనది.

ఫెమినిజం అంటే కేవలం హక్కుల పోరాటం మాత్రమే కాదు, తన మనసు నచ్చిన రీతిలో జీవించే స్వేచ్ఛ కూడా. ఎలిజబెత్ టేలర్ నుండి రాజ్యలక్ష్మి వరకు అందరూ తమ ప్రేమను ఒక సాధనగా మార్చుకున్నారు. వారు 'చరిత్ర హీనులు' కాదు, చరిత్రను తిరగరాసిన హృదయ విజేతలు. తాము ప్రేమించిన వారి కోసం సర్వస్వాన్ని ధారపోసే మహనీయుల 'మహా పాత్రల' జీవితాలు ఎప్పటికీ తరగని స్ఫూర్తిదాయక కావ్యాలు.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## పెట్రోల్, డీజిల్ బ్లాక్‌లో విక్రయిస్తే చట్టపరమైన చర్యలు



**యాలాల్, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణలో యాలాల మండలం జిల్లాలోనే వెనుకబడి ఉందని, ఓటరు జాబితా నమోదు ప్రక్రియలో పురోగతి ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం యాలాల మండలంలోని తహసిల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో నివేదిక అందించాలని ఆదేశించారు. మండలంలో ఉన్న పెట్రోల్ బంకులను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి పెట్రోల్, డీజిల్ పక్కదారి పట్టకుండా చర్యలు తీసికోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేయాలని సివిల్ సప్లై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఎరువుల షాప్ ను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బంది,యూరియా కొరత లేకుండా రైతులకు యాప్ ద్వారా యూరియా అందేటట్లు చూడాలని మండల వ్యవసాయ అధికారికి సూచించారు. మండలంలో ఉన్న ఫర్టిలైజర్ షాపులను టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసుకొని దుకాణంలో ఉన్న యూరియా విత్తనాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. గ్రామాలలో నిర్మిస్తున్న పంచాయితీ భవనాలను ఎండాకాలంలోపు పూర్తి చేయించాలని సూచించారు. రైతు వేదికలలో రైతులకు సమావేశం ఏర్పాటు చేసి రైతులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం మండలం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించి ,ఇంవార్డ్ , రిజిస్టర్‌లను పరిశీలించి, సరిపోయే మందులను అందుబాటులో ఉంచాలని, ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో డి ఏ ఓ రాజారత్నం, డిఎంహెచ్వో స్వర్ణకుమారి, యాలాల ఎమ్మార్వో వెంకటస్వామి, డిప్యూటీ ఎమ్మార్వో కిరణ్ కుమార్ ఎంపీడీవో శ్రీనిజ, ఎంఈఓ మహిపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులుఉన్నారు.

# ముష్కిన్ చెరువులో నిర్మాణాలు వద్దు

- 10 రోజులు గడువిచ్చిన హైడ్రా అధికారులు
- తాత్కాలిక షెడ్డుల్లో ఉన్నవారితో నేరుగా చెప్పిన హైడ్రా
- ఎఫ్టీఎల్ పరిధిని పరిరక్షించేందుకు హైడ్రా చర్యలు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** ముష్కి చెరువు ఎఫ్టిఎల్ పరిధిలో ఉన్న అక్రమణలను 10 రోజుల్లో తొలగించాలని హైడ్రాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం హైడ్రా అధికారులు నార్సింగ్ సర్కిల్ పరిధిలోని ముష్కి చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ " మీరంతా ముష్కిన్ చెరువు ఎఫ్ టీ ఎల్ (ఫుల్ ట్యాంక్) పరిధిలో ఉన్నారు. ఇక్కడ తాత్కాలిక షెడ్డుల్లో ఉంటున్నారు. మిమ్ములను పావులుగా వాడుకుని చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న భూములను కొట్టేయాలని కబ్జాదారులు ప్రయత్నిస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలు,మట్టి పోసి.. చెరువు స్వరూపాన్ని మార్చేసి బడా నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను తెచ్చి చెరువు పరిధిలో వేస్తున్నారు. ఇక్కడే చెత్తను వేరు చేసి వ్యర్థాలను చెరువులోకి వదిలేస్తున్నారు. దీంతో చెరువు కలుషితమౌతోంది. ఇక్కడ ఉన్న తాత్కాలిక షెడ్డులు(నివాసాలు), దుకాణాలను పెట్టించి.. వారి ఆక్రమణలను తొలగించకుండా అడ్డుగా మిమ్ములను ముందుంచుతున్నారు. చెరువు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మీరంతా ఖాళీ చేస్తే. చెరువును అభివృద్ధి చేయాలని చూస్తున్నాం. ఇక్కడ చెరువు అభివృద్ధి పనులు చేసేవారికి ఆటంకాలు కల్పించవద్దు " అని రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, నార్సింగ్ విలేజ్‌కు దగ్గర్లోని ముష్కిన్ చెరువో ఎఫ్‌టీఎల్ పరిధిలో తాత్కాలిక షెడ్డుల్లో ఉన్న వారికి హైడ్రా అధికారులు బుధవారం



చెప్పారు. మీకు 10 రోజులు సమయం ఇస్తున్నాం.. ప్రత్యామ్నాయం చూసుకుని చెరువు ఎఫ్టీఎల్ పరిధిని ఖాళీ చేయాలని సూచించారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య , హైడ్రా ఏసీపీ తిరుమల్ , ఇరిగేషన్ శాఖ డీఈ రమాదేవి తో పాటు.. పలువురు హైడ్రా అధికారులు, రెవెన్యూ, ఇరిగేషన్ అదికారులు అక్కడ తాత్కాలిక షెడ్డులు వేసుకుని నివాసముంటున్న వారితో మాట్లాడారు. పేదలను, అమాయకులను అడ్డంపెట్టుకుని ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని కూడా హెచ్చరించారు. ఎఫ్టీఎల్ పరిధిని ఖాళీ చేయాలని 6 నెలలుగా హెచ్చరించినా పట్టని ఆక్రమణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 52.20 ఎకరాలు ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్

చుట్టూ వేలాది నివాసాలు.. లక్షలాది మంది తిరిగాడే ప్రాంతంలో ఉన్న ఒక్కగానొక్క ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధి 52.20 ఎకరాలు. చెరువును ఆక్రమించి నిర్మాణ వ్యర్థాలతో నింపేసి.. తాత్కాలిక షెడ్డులతో కబ్జా చేయాలనుకునే వారి కుట్రలను అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. చెరువు చెంతనే చెత్తను వేరు చేసే యూనిట్లకు అద్దెకు ఇచ్చి.. ముష్కిన్ చెరువును మురికి కూపంగా మార్చడాన్ని సీరియస్గా పరిగణించింది. బడాబాబుల కబ్జాలకు కార్మికులు, సామాన్యులు బలి కావద్దు.. అంటూ విజ్ఞప్తి చేసింది. హెచ్ ఎం డీ ఏ నిర్ధారించిన మేరకు ముష్కిన్ చెరువు ఎఫ్టీఎల్ పరిధి 52.20 ఎకరాలు. ఇందులో పయనీర్స్ సంస్థ 18 ఎకరాల వరకూ తమదంటూ వాధిస్తూ వస్తోంది. రైతులకు చెందినది 12 ఎకరాల వరకూ ఉంది. వీటికి తోడు.. మరో 4.20 ఎకరాలు వేర్వేరు వ్యక్తులు క్లైమ్ చేస్తున్నారు. ఇలా మొత్తం 34.20 ఎకరాలు చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోనిదే అని హెచ్ ఎం డీఏ లెక్కల ప్రకారం తేలుతుంది. శిఖం సర్కారీ ల్యాండ్ 21 ఎకరాల మేర ఉంది. ఇక బఫర్తో కలిపితే ముష్కి చెరువు 62 ఎకరాల వరకూ ఉంటుంది. గతంలో బఫర్ జోన్లో నిర్మించిన ప్రహరీని రెవెన్యూ అధికారులు కూల్చేశారు కూడా. అయినా పట్టించుకోకుండా.. చెరువులో మట్టిని నింపుతూ ఎఫ్టీఎల్ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టడానికి బడా నిర్మాణ సంస్థ సిద్ధమౌతోంది. వరద నీరు రాకుండా కాలువలను మూసేసి నిర్మించిన ప్రహరీని అక్కడి స్థానికులు చూపించారు.

### స్థానికుల హర్షం..

సకల జీవకోటికీ ప్రాణాధారమైన చెరువును కాపాడుతున్న హైడ్రాకు ధన్యవాదాలు. చెరువు కబ్జాలపాలౌతోందని ఫొటోలు, సాక్ష్యాలతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. మట్టి నింపుతున్న వైనాన్ని వీడియోను చూపించాం. వెంటనే హైడ్రా అధికారులు వచ్చి పరిశీలించారు. చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో బండ్ నిర్మాణం చేపడితే అడ్డుకున్నారు. ఇప్పుడు 52 ఎకరాల మేర చెరువు అభివృద్ధి జరగడానికి చర్యలు తీసుకున్నారు. హైడ్రాకు ధన్యవాదాలు. హైడ్రాను ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళల భద్రతకు షీ టీమ్స్ ద్వారా విస్తృత ప్రచారం

- అడిషనల్ ఎస్పి చైతన్య రెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** మహిళల భద్రతకు షీ టీమ్స్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంగారెడ్డి యం.ఎన్.ఆర్ మెడికల్ కళాశాలలో జిల్లా పోలీసు, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్, చైల్డ్ వెల్ఫేర్ శాఖల సమన్వయంతో మహిళల భద్రత, బాలల రక్షణ, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు,ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ... మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్ ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1930, 1098



లేదా జిల్లా షీ టీమ్ నంబర్ 8712656772 ను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, "డిజిటల్ అరెస్ట్" వంటి మోసాలకు లోనుకాకూడదని, మోసపోయిన వెంటనే 1930 కు కాల్ చేయడం లేదా ఎన్ సి ఆర్ పి పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే పోక్సో చట్టం ప్రకారం నిందితులకు కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని పేర్కొంటూ, అనుమానాస్పద సమాచారాన్ని 1908 లేదా 8712656777 నంబర్లకు తెలియజేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ ... సమాజ అభివృద్ధికి మహిళల భద్రత, బాలల రక్షణ అత్యంత కీలకమని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు మౌనం వీడి సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, సిడబ్ల్యుసి సభ్యులు, వైద్య ఆరోగ్య అధికారులు, పోలీసు అధికారులు, కళాశాల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## ప్రభుత్వ మద్దతు ధరతో రైతులకు లబ్ధి

**శివ్వంపేట, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర తో రైతులు లబ్ధి పొందాలని సర్పంచ్ హైమావతి ఆంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని రామేశ్వరం చండి రైతు ఉత్పత్తిదారుల సంఘం గోమారం వద్ద కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. సర్పంచ్ కుమ్మరి హైమావతి ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోలు గ్రేట్ ఏ రకాని 2389 సాధారణ రకం 2369 రూపాయలు నిర్ణయించడం జరిగిందన్నారు. రైతు సంఘాలు ఏర్పాటు చేసినటువంటి సెంటర్లకే విక్రయించాలని ఆమె సూచించారు. అలాగే రూ 500 బోనాసు కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమం లో నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పెద్దపట్లోరి మాధవరెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు డీ. శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి డి. నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, నాగరాజు యాదవ్, నర్సారెడ్డి, రాజేందర్, అనిల్ పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇల్లులతో పేదల కళ్లల్లో ఆనందం

**శివ్వంపేట, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్లతోనే పేదల కళ్ళలో నిజమైన ఆనందం చూస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివంపేటలో బొట్టు లక్ష్మి -నర్సింలు దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి బుధవారం ఆయన హాజరై కొత్త ఇంటికి ప్రారంభించి ఇంటి యజమానికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, పిఎసిఎస్ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మధవ రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మురళి గౌడ్, మాజీ జెడ్పిటిసిలు ఉమా లక్ష్మీకాంతం, కమల, రత్నాపూర్ సర్పంచ్ ఆంజనేయులు, దొంతి ఉపసర్పంచ్ శ్రీనివాస్ పిల్లుట్ల ఉప సర్పంచ్ స్వామి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల వారాల గణేష్, గడ్డమీది కృష్ణగౌడ్, నారాగౌడ్, మంతూరి రమేష్, మండల ఎక్స్ కోఆప్షన్ సభ్యులు దావూద్, కుమ్మరి ఆంజనేయులు, కుమ్మరి హనుమంతు, గొల్ల యాదయ్య, గొల్ల రాములు, బిచ్కుందు అంజయ్య, కమలయ్య గారి వెంకటేష్, బిజిలిపురం సత్తయ్య,



దేవన బోయిన కృష్ణ, కోలా కిషన్, బాసంపల్లి ,ప్రభులింగంగౌడ్, సద్దాం హుస్సేన్, షేక్ అలీ, వజ్జా శ్రీనివాస్, వెతుకు మల్లేష్, ఈసుగారి అరుణ్, సాకలి భరత్, భాస్కర్ ఆంజనేయులు, మ్యాస ఆంజనేయులు, సరిగారి నారాయణ, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కరువు

**వీపనగండ్ల, ఏప్రిల్ 30 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని గ్రామాలతో పాటు మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత కొన్ని రోజుల క్రితం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి రాధాకృష్ణ అన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి మాత్రం ఇసుక కరువు ఏర్పడిందని అన్నారు. కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో పేదల ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ఇసుక రిచ్ లను ఏర్పాటు చేసి ఇసుకను ఉచితంగా అందజేయాలని మండల తహసీల్దార్ ఖాజా మైనుద్దీన్ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో పేదల ఇళ్ల నిర్మాణానికి ఇసుక లేకపోవడంతో అధిక ధరల తో ఇసుకను కొనలేక ఇళ్ల నిర్మాణాన్ని మధ్యలోనే ఆపేసుకున్న పేద ప్రజలు ఉన్నారని అన్నారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సరిపడినంత ఇసుకను ఇవ్వలేక ప్రజలను చాలా ఇబ్బందులకు గురి చేస్తుందని అధికారులు వెంటనే స్పందించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పేదల ఇందిరమ్మల నిర్మాణానికి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తే ఉద్యమంతో గుణపాఠం చెప్తామని అన్నారు. ఇళ్ల



నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయం చాలక కొందరు అప్పులు చేస్తున్నారని, అదేవిధంగా ఇసుక చాలక అధిక ధరలు వెచ్చించి ఆర్థిక భారంఎక్కువ అవుతుందని ప్రజలు వాపోతున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందుకున్న తహసిల్దార్ జిల్లా అధికారులతో మాట్లాడి తొందర్లోనే సమస్య పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి డి మురళి, రఘు రామకృష్ణ, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

# మూసీ నదికి జీవించే హక్కును చట్టబద్ధంగా గుర్తించాలి

- మూసీ నది కూడికపై వివరణాత్మక నివేదిక ఇవ్వాలి
- మూసీ నది పునరుజ్జీవన ప్రజా కమిటీ...

**ముషీరాబాద్, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** మూసీ నదికి జీవించే హక్కును చట్టబద్ధంగా గుర్తించాలనీ, మూసీ నది ఒడ్డున నివసించే ప్రజల జీవన హక్కులను కాపాడాలని, వారికి గౌరవప్రదంగా పునరావాసం కల్పించాలనీ మూసీ నది పునరుజ్జీవన ప్రజా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్దగల ధర్నాచౌక్లో మూసీ నది పునరుజ్జీవన ప్రజా కమిటీ ఆధ్వర్యంలో స్వేచ్ఛగా ప్రవహించే మూసినది, స్వచ్ఛమైన మూసినది కోసం సత్యాగ్రహం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మూసీ నది పునరుజ్జీవన ప్రజాసంఘం నాయకులు సాగర్ ధారా, అడ్వకేట్ డాక్టర్ లుబ్నా సర్వత్, సయ్యద్ రఫీ, ప్రొఫెసర్ వెంకట దాస్ లు మాట్లాడారు. ఫార్మా, భారీ లోహాలు, పురుగుమందులు వంటి కాలుష్య కారకాలను కలిగి ఉన్న మూసీ నదిలోని పూడిక మరియు నీటిని మూసీ నదిలో పలుచోట్ల విశ్లేషించాలన్నారు. ఇది దిగువన ఉన్న వ్యవసాయం, భూగర్భ జలాలు, నగర ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంధని, అందువల్ల మూసీ నది పూడిక పై వివరణాత్మక నివేదికను ఇవ్వాలన్నారు. పారిశ్రామిక, ఫార్మా వ్యర్థాలను కేంద్రీకృత, అశాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడానికి



భారీ, పొడవైన పైపుల కు బదులుగా, వికేంద్రీకృత, మూలం వద్దనే నిర్వహించే విధానాన్ని ఆచరణాత్మకంగా అమలు చేయాలన్నారు. ఇది ఖర్చులను తగ్గిస్తుందని, బాధ్యతను పెంచుతుందనీ సూచించారు. మూసీ నది పునరుజ్జీవనం పై ప్రజ పర్యవేక్షణ పాటించాలని, వార్డు, కమిటీ, గ్రామ పంచాయతీల నుండి సమాచార సమ్మతిని పొందడానికి వార్డు కమిటీలను ఏర్పాటు చేయడం తప్పనిసరన్నారు. నది అధ్యయనం కోసం చెంగోచాన్ యాత్ర నివేదికలను, అందుకు అయిన ఖర్చులతో సహా, ప్రజలకు అందుబాటులో ఉంచాలనీ డిమాండ్ చేశారు. జన్వాడ ఖుల్కాపూర్ నుండి హుస్సేన్ సాగర్ వరకు ప్రవహించే ఖుల్కాపూర్ నాలాతో పాటు మూసీ నది జలవిజ్ఞానాన్ని పరిగణనలోకి తీసుకోలేదనీ, చందనవేలి నుండి ఇబ్రహీంపట్నం ట్యాంక్ వరకు ప్రవహించే ఫిరంగి నాలాను మూసీ నది జలవిజ్ఞానంలో చేర్చలేదన్నారు. అందువల్ల, జలవిజ్ఞాన నివేదికను తప్పనిసరిగా ఇవ్వాలనీ కోరారు. మూసీ నది పునరుజ్జీవనం ప్రజల కోసం అయినప్పుడు, ప్రజా భవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి ఉండాల్సిందనీ, తాజ్ కృష్ణ ప్రజెంటేషన్ పై ప్రజల డబ్బు ఎందుకు వృథా చేశారనీ ప్రశ్నించారు. మూసీ నదిపై అప్రజాస్వామిక, అశాస్త్రీయ ఉల్లంఘన జరగడానికి తెలంగాణ ప్రజలు అనుమతించకూడదనీ సూచించారు. మూసీ నదిలోని కొన్ని ప్రదేశాలలో ప్రవాహ సామర్థ్యాన్ని పెంచవలసి రావచ్చు, ఇందుకోసం మూసీ నది లోతు, వెడల్పులపై సరైన అధ్యయనం చేయాలన్నారు. నీటిపారుదల శాఖ ఈ పనిని ఐఐటి హైదరాబాద్‌కు అప్పగించిందని (మీడియా నివేదికల ప్రకారం) ఈ విషయాన్ని ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజల ప్రాణాలకు ప్రాధాన్యతనిస్తూ, నది పరిసర ప్రాంతాల్లోని ప్రజల కోసం అత్యవసర ఆశ్రయాల వంటి భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. మూసీ పునరుజ్జీవన ఉపసంఘం సభ్యులైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఉప సంఘానికి మా పిసిఎంఆర్ఆర్ వినతిపత్రాల పై చర్చిస్తామని హామీ ఇచ్చారనీ, ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదనీ చెప్పారు. ప్రధాన అధ్యయన నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరిన, ఇప్పటి వరకు వాటిని అందుబాటులో ఉంచలేదన్నారు. అందువల్ల, టిపిసిసి అధ్యక్షులతో చర్చించి తదుపరి చర్యలు చేపడతామన్నారు.

## పాడిపంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలి

- ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**శివ్వంపేట, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** అమ్మవారి దయతో ఈ ఏడాది పాడి పంటలతో ఈ ప్రాంత ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తి అమ్మవారి కోరుకోవడం జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుక పూజలకు ఆమె పార్టీ నాయకులతో కలిసి బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె దేవాలయం లో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### పిల్లుట్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్, టిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు వేమారెడ్డి, శేఖర్ గౌడ్, చింత స్వామి, కుమ్మరి శంకర్, ఏ స్వాములు, గణేష్, రాంచంద్రం గౌడ్ లతో పాటు గ్రామస్థులు, భక్తులు, రైతులు పాల్గొన్నారు.

# మహిళలు, బాలికల భద్రత, డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

● జిల్లా ఎస్పీ వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** మహిళలు, బాలికల భద్రత, డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. యువత క్రమశిక్షణ తో నడుచుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించ గలరని, అలాగే దేశ భవిష్య త్ ను నిర్ణహించే నేటి యువ త డ్రగ్స్ వంటి మత్తు పదార్థా లకు దూరంగా ఉండాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడి కల్ కళాశాలలో విద్యార్థులకు బాలల, మహిళల భద్రత మరియు, డ్రగ్స్, బాల్య వివాహల నిర్మూలన అంశం పై నిర్వహించిన అవగాహ నా కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూసమాజాన్ని పట్టి పిడుస్తున్న డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. మెడికల్ కళాశాలలో ఐసీసీ ఇంటర్నల్ కంప్లైంట్ సెల్ ఒక టీం ఏర్పాటుచేసి అందులో లెక్చరర్స్, విద్యార్థులు సభ్యులుగా ఉండి మెడికల్ కళాశాలలో మత్తుపదార్థాలు ఎవరైనా తీసుకున్న వెంటనే ఎవరికి ఇలాంటి సమాచారం ఉన్న ఈ టీంకు జస్ట్ మెసేజ్ చేస్తే వాళ్లు దగ్గరుండి ఇచ్చిన వారి సమాచారం




గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకొని లేదా కౌన్సిలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. మత్తు పదార్థాలు ముందు ఒక అలవాటు గా వాడకం మొదలు అయి అవి దొరకక పోయిన, వినియోగించక పోయిన ఆరోగ్యం క్షినించి అవి లేకపోతే జీవించలేని స్థాయికి వెళ్ళిపోతామనీ, డ్రగ్స్ వల్ల నర్వస్ సిస్టం నాశనం అయి ఆరోగ్యం క్షినిస్తుందని, దేశ భవిష్యత్ ను నిర్ణహించే నేటి యువత అలాంటి వ్యాసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. దేశ భవిష్యత్ యువత చేతులలో ఉందని, క్రమశిక్షణ తో ఉండాలని తెలిపారు. అలాగే మెలికల్ కళాశాల ఆసుపత్రిలో మెడికల్ విధులు నిర్వర్తించే స్టాఫ్ కు సరైన వసతి సెక్యూరిటీ ఉండాలని, వీలు నిర్వర్తించే విధులు సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉంటే సెక్యూరిటీ ఉంటుంద ని తెలిపారు. బాలికలు, మహిళల భద్రత పై పోలీస్ శాఖ బాధ్యతని ఎస్పీ తెలిపారు. బాల్యవివాహల వల్ల బాలికలు మంచి భవిష్యత్తు ను కోల్పోవడం తో పాటు అనారోగ్యం పాలు అవుతారని, బాలల సంక్షే మన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు బాలలకు పౌష్టిక ఆహారం అందించడం తోపా టు విద్య, వైద్య సదుపా యాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తు ను నిర్మిం చుకోవాలని, జీవితంలో సెటిల్ అయ్యాకే పెళ్లి గురించి ఆలోచించాలని అన్నారు. యువత తమ చుట్టూ బాల్యవివాహాలు జరిగితే సామాజిక బాధ్యతగా పోలీస్ వారికీ సమాచారం ఇవ్వడంతో పాటు వాటిని అడ్డుకొని తల్లి తండ్రులను చైతన్యం చెయ్యాలని అన్నారు. యువత విద్య అంటే ఉద్యోగం, డబ్బు సంపాదించడం ఒక్కటే కాదని తాము చైతన్యం అవుతూ సమాజంను చైతన్య పరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, ఆర్ ఎం ఓ. డాక్టర్ రాఘవేందర్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, సునీత, శిరీష, షి టీమ్, భరోసా టీం, కళాశాల స్టాఫ్ మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదింటి కుటుంబాలకు సేవ చేయడమే లక్ష్యం



**వెల్దుర్తి, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** పేదింటి కుటుంబాల వధువులకు సేవ చేయడమే లక్ష్యమని వెల్దుర్తి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రంగి కృష్ణ అన్నారు బుధవారం మండలంలోని ఆరవడం గ్రామానికి చెందిన చాకలి భాగ్యమ్మ కూతురు మానస పెళ్లికి పుస్తె మట్టెలను పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే లక్ష్యంతో ముందస్తుకు సాగుతున్నానని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి చేస్తున్నానని త్వరలో వెల్దుర్తి మండల కేంద్రంలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు విద్యార్థులకు విద్య పట్ల ఏదైనా అవసరం ఉన్న తమకు సమాచారం ఇస్తే విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు గతంలో విద్యార్థులకు మండలంలో చాలా స్కూళ్లలో ఆట వస్తువులను పంపిణీ చేయడం జరిగిందన్నారు గ్రామాలలో పలు అభివృద్ధి పనులు నిర్వహించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో ఆరెగూడెం గ్రామ మాజీ సర్పంచ్ పాలవంచ శేఖర్ టిఆర్ఎస్ నాయకులు మహిపాల్ రెడ్డి హనుమంత్ రెడ్డి రాజిరెడ్డి సత్తిరెడ్డి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కళ నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

● మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి



**నంగునూరు, ఏప్రిల్ 28 (జనం సాక్షి) :** పేదల సొంతింటి కళ నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు. బుధవారం రోజు నర్మట గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి సొంత గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. చైర్మన్ లబ్ధిదారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి, సామూహిక గృహప్రవేశాలు చేయించారు. అనంతరం, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి మా కళ సాకారం చేసి మాకు గొప్ప ఆత్మ భరోసాను కల్పించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి, ఇంచార్జి మంత్రి డాక్టర్, వివేక్ వెంకట స్వామికి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు శనిగరం స్వాతి బాబు, నాగరాజు పల్లి సర్పంచ్ ముక్కెర లింగం, హౌసింగ్ ఏఈ రవి, పంచాయతీ కార్యదర్శి సురేష్ రెడ్డి, ఉపసర్పంచ్ కుంచెం విక్రమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముసత్యాల యాదగిరి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ఆడెపు లావణ్య, మాజీ సర్పంచ్ చేర్యాల బాలయ్య, అనరాజు నాగరాజు, చెలికాని యాదగిరి, దాసరి కిషన్, బొల్లు సంజీవ్, తుపాకుల శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కలెక్టర్ గా పదవీబాధ్యతలు చేపట్టిన సి.ఎచ్. ప్రియాంక బుధవారం రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవ ర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ని మక్తల్ లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కలెక్టర్ కు శాలువాతో సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- విద్యుత్ అంతరాయం లేకుండా ఫీడర్ వారీగా పర్యవేక్షించాలి
- సాదా బైనామా దరఖాస్తులను క్షుణ్ణంగా పరీక్షించాలి
- అన్ని రూట్లలో పరిధి ప్రారంభం, ముగింపు బోర్డులు ఏర్పాటు చేయాలి
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** జిల్లా వ్యాప్తంగా పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సాగించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నుండి సబ్ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మిషన్ భగీరథ, హౌసింగ్, విద్యుత్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలకు సంబంధిత అన్ని శాఖల డివిజనల్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ జైన్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని రూట్లలో పరిధి ప్రారంభం, ముగింపు బోర్డులను స్పష్టంగా



కనిపించేలా 15 రోజుల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. డివిజన్ వారీగా తాగునీటి సరఫరా పరిస్థితిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్‌ను అడిగి తెలుసుకున్న కలెక్టర్, బల్క్ సప్లై, పంపింగ్ సమస్యలు, ఇంట్రా మరియు గ్రిడ్ వివరాలపై సమీక్షించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు 1916 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వేసవి కాలంలో విద్యుత్ అంతరాయం లేకుండా ఫీడర్ వారీగా పర్యవేక్షణ చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ పూర్తి చేసి త్వరితగతిన పరిష్కరించాలని, ఫిజికల్ ఫైల్స్‌ను ప్రాపర్‌గా పంపించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సాధారణ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంలో ఎటువంటి జాప్యం ఉండకూడదన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫ్యామిలీ మెంబర్స్, జనన, మరణ ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ మరియు గ్రామ పంచాయతీల నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రధాన రహదారుల పక్కన చెత్త పేరుకుపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి అధికారి వారానికి కనీసం రెండు సార్లు ప్రభుత్వ విద్యాసంస్థలు, వసతి గృహాలను సందర్శించి తనిఖీలు నిర్వహించాలని, అవసరమైన మరమ్మతులు, పెయింటింగ్ వంటి పనులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు చొరవ తీసుకుంటే మండల అభివృద్ధి వేగవంత మవుతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై డివిజన్ వారీగా సమీక్షించి, లబ్ధిదారులను త్వరగా నిర్మాణం పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, హౌసింగ్ పీడీ చలపతిరావు, విద్యుత్ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మత్తులో యువత జీవితాలు నాశనం చేసుకోవద్దు

● జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** యువత క్రమశిక్షణతో నడుచుకుంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, అలాగే దేశ భవిష్యత్ ను నిర్ణహించే నేటి యువత డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజు గోనుపాడు పోలిటెక్నిక్ కళాశాల లో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల, మహిళల భద్రత మరియు ,డ్రగ్స్, బాల్య వివాహల నిర్మూలన అంశం పై నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాల్యవివాహల వల్ల బాలికలు మంచి భవిష్యత్తు ను కోల్పోవడం తో పాటు అనారోగ్యం పాలు అవుతారని, బాలల సంక్షేమన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు బాలలకు పౌష్టిక ఆహారం అందించడం తోపాటు విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తు




ను నిర్మించుకోవాలని, జీవితంలో సెటిల్ అయ్యాకే పెళ్లి గురించి ఆలోచించాలని బాలికలకు సూచించారు. యువత తమ చుట్టూ బాల్యవివాహాలు జరిగితే పోలీస్ వారికీ సమాచారం ఇవ్వడం తో పాటు వాటిని అడ్డుకొని తల్లి తండ్రులను చైతన్యం చెయ్యాలని అన్నారు. యువత విద్య అంటే ఉద్యోగం, డబ్బు సంపాదించడం ఒక్కటే కాదని తాము చైతన్యం అవుతూ సమాజంను చైతన్య పరచాలని అన్నారు. లక్ష్య సాధనను ముందుగా నిర్ణహించుకొని ప్రణాళిక బద్దంగా ముందుకు సాగాలని అన్నారు. ఏ స్థాయికి వెళ్ళిన అందుకు కారణం అయినా గురువులను మరువకూడదని అన్నారు. సమాజాన్ని పట్టి పిడుస్తున్న డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మత్తు పదార్థాలు ముందు ఒక అలవాటు గా వాడకం మొదలు అయి అవి దొరకక పోయిన, వినియోగించక పోయిన ఆరోగ్యం క్షినించి అవి లేకపోతే జీవించలేని స్థాయికి వెళ్ళిపోతామనీ, డ్రగ్స్ వల్ల నర్వస్ సిస్టం నాశనం అయి ఆరోగ్యం క్షినిస్తుందని, దేశ భవిష్యత్ ను నిర్ణహించే నేటి యువత అలాంటి వ్యాసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. దేశ భవిష్యత్ యువత చేతులలో ఉందని, క్రమశిక్షణ తో మేలుగుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు భవిష్యత్ లోను డ్రగ్స్ కు దూరంగా ఉంటామని గట్టిగ నిర్ణహించుకోవాలని తెలియజేస్తూ సెల్ఫీ ఫోటో దిగడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి డబ్ల్యు ఓ అధికారి సునంద, పోలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్ మోహన్ రావు, వైద్య అధికారి ప్రదీప్, డి సి పి ఓ నరసింహ, అబ్కారి శాఖ ఎస్సై లు కృష్ణ, వెంకటేష్, రూరల్ ఎస్సై శ్రీకాంత్, కళాశాల స్టాఫ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పనిచేసే చోట వేధిస్తే సమాచారం ఇవ్వండి

**నారాయణపేట, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** పనిచేసే చోట మహిళలను వేధిస్తే సమాచారం ఇవ్వాలని నారాయణపేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళ భద్రతపై నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎంబీబీ బంకెట్ హాల్‌లో టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సూపర్ మార్కెట్లలో, షాపుల్లో, హాస్పిటళ్లలో పనిచేస్తున్న మహిళా వర్కర్లకు మహిళల భద్రత, కార్యాలయ వేధింపులు, సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు వంటి పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశాల్లో భద్రత అత్యంత ముఖ్యమని, ఎక్కడైనా వేధింపులకు గురైతే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వర్క్ ప్లేస్‌లో ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, కస్టమర్ల ద్వారా ఇబ్బందులు కలిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంటి నుండి పని చేసే చోటికి వచ్చే సమయంలో లేదా తిరిగి ఇంటికి వెళ్లే సమ యంలో ఎవరైనా ఫాలో అవుతూ, వేధింపులకు గురిచేస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే మెసేజులు, కాల్స్ ద్వారా వేధింపులు కూడా నేరాలేనని, అలాంటి సందర్భాల్లో వెంటనే స్పందిం చాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో యువతతో పాటు మహిళలు అప్రమ త్తంగా



ఉండాలని, అనుమా నాస్పద వ్యక్తుల గురించి సమాచారం ఇవ్వాలని చెప్పారు. అలాగే సైబర్ నేరగాళ్ల నుండి రక్షణ కోసం వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని, అపరిచిత లింకులు ఓపెన్ చేయకూడదని హెచ్చరించారు. ప్రయాణ సమయంలో రోడ్డు ప్రమాదాలు జరగ కుండా జాగ్రత్తలు తీసుకోవా లని, రాత్రి సమయంలో ఒంటరిగా ప్రయాణించే మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆశతో ఉండా లి కానీ అత్యాశకు పోకూడ దు"అని పేర్కొంటూ, మోస పూరిత ఆఫర్లు, స్కీమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మహి ళల సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఎస్సై వెంకటే శ్వర్లు, ఎవరికైనా ఇబ్బందు లు ఉంటే వెంటనే తెలియ జేయాలని కోరారు. కార్యక్ర మంలో పాల్గొన్న ఇద్దరు మహిళలు తమ సమస్యల ను వివరించారు. ఒక మహి ళ గత రెండు నెలలుగా ఒక వ్యక్తి ఫోన్ కాల్స్, మెసేజుల ద్వారావేధిస్తున్నాడని, అతడి నంబర్ ను బ్లాక్ చేస్తే వేరే నెంబర్ నుండి కాల్స్ చేస్తున్నారని, మరో మహిళ ఇంటి నుండి షాప్‌కు వచ్చే సమయంలో ఒక వ్యక్తి ఫాలో అవుతున్నాడని తెలిపారు. దీనిపై స్పందించిన ఎస్సై వెంకటేశ్వర్లు అటువంటి వ్యక్తులపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. షి టీమ్ హెల్ప్‌లైన్ నంబర్ 8712670398 కు, అలాగే మహిళా కానిస్టేబుల్ నంబర్‌కు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా షాపుల్లో పనిచేసే మహిళలు రాత్రి 8 గంటల వరకు పని ఉండడం వల్ల ఇంటికి వెళ్లే సమయంలో భయంగా ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన ఎస్సై, లేబర్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటా రని, తాను కూడా ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకె ళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, మహిళా వర్కర్లు పాల్గొన్నారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని ఎస్సై వెంకటే శ్వర్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య, స్థానిక పోలీసులు, మహిళా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా కలెక్టర్ ప్రియాంక



**మక్తల్, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక, బాలల భద్రత వారం రోజుల కార్యక్రమాలలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన అనే అంశంపై జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మక్తల్ మున్సిపల్ ఆఫీసులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక హజరారయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా పిల్లలు ఎక్కువగా సెల్ ఫోన్ ఉపయోగించడం వలన ఆన్లైన్ గేమ్స్, మెసేజ్ యాప్స్ ద్వారా పిల్లలను ట్రాప్ చేసే అంశాల గురించి వివరించారు. ఏఐ టెక్నాలజీ ద్వారా ఏ విధంగా మోసపోతారు అనే అంశాల గురించి పిల్లలకు పూర్తిగా అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురి కాకుండా పిల్లలు సెల్ ఫోన్ వారి యొక్క చదువుకు వారి యొక్క అవసరాలకు ఉపయోగించాలి తప్ప ఎట్టి పరిస్థితుల్లో సెల్ ఫోన్ ఉపయోగాన్ని ఎక్కువగా వినియోగించకూడదని సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్ గౌడ్, మక్తల్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హబీబ్, సి.డి.పి.ఓ. సరోజ, డి.సి.పి.ఓ. కరిష్మా, సైబర్ సెల్ ప్రతినిధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి, కోతుల బెడద లేకుండా చూడాలి

- మున్సిపల్ మొదటి సమావేశంలో తీర్మానానికి శ్రీకారం



**ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక తర్వాత మొదటి సారిగా ఏర్పాటు చేసిన పాలక వర్గ సమావేశం బుధవారం ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యతితిగా పాల్గొన్నారు. ఈ సమావేశం లో ఖానాపూర్ మున్సిపల్ వార్డు లోని మొత్తం 12 వార్డ్ లలో ప్రజలు తీవ్రంగా ఎదుర్కుంటున్న ఎండ తీవ్రంగా ఉండటంతో నీటి ఎద్దడి లేకుండా బోరు మోటార్ల మరమత్తులు,ఎక్కడైతే నూతన మోటార్లు అవసరమో చూసి వాటిని ఏర్పాటు చేయడం వంటి వాటి పై సమీక్షించారు ,అలాగే కోతుల సమస్య కూడా ఉండటంతో వాటిని కూడా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వాటిని పట్టి వేరే చోటుకి తరలించే విధంగా చూడాలని తీర్మానం చేశామని అన్నారు.సమావేశం అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ను ఖానాపూర్ మున్సిపల్ పాలక వర్గం శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్ ,గౌరె తిరుమల గంగధార్, తాళ్లపల్లి రాజగంగన్న, సాజియా బేగం జమాల్, గుమ్ముల ఆనంద్ కుమార్, మేష పోసాని, నిమ్మల రమేష్ ,బొప్పరపు సత్యవతి, బండి పెళ్లి సింధుజ ప్రకాష్ గౌడ్ ,చిన్నం సత్యనారాయణ, తొడసం ఇందిరా , ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరాపై
# అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా మండల స్థాయి అధికారులతో సమీక్ష



హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 29 (జనం సాక్షి) :ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడంతో పాటు, వేసవికాలంలో తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పురోగతిపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని దూర ప్రాంతాల మిల్లులకు కాకుండా ములుకనూరు, ఎల్కతుర్తి పరిధిలోని సమీప మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా ఎక్కడా అంతరాయం కలగకుండా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు.ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను సమయానికి పూర్తి చేయాలని, కార్మికులకు బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు "బడిబాట" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, డ్రాప్‌ఔట్‌లను పూర్తిగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి విద్యా, ఇంజనీరింగ్ శాఖలు సమన్వయంతో సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల కోసం రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్‌డీవో మేన్ శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా ఉద్యాన అధికారి అనసూయ, డీఈవో గిరిరాజ్ గౌడ్, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేష్, ఇతర అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలి

- జిల్లా న్యాయమూర్తి ఎ.వీరయ్య



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(జనంసాక్షి) :** జిల్లా న్యాయస్థాన సముదాయంలో కొనసాగుతున్న అండర్ ట్రయల్ కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తి ఎ.వీరయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన సముదాయంలో గల కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి– జిల్లా న్యాయ సేవ అధికారి వి. సంకేత్ మిత్ర, జిల్లా కలెక్టర్ కె. హరిత, జూనియర్ సివిల్ జడ్జ్ జె.అనంతలక్ష్మి, ప్రత్యేక సబ్ –జైల్ పర్యవేక్షకులు ప్రేమ్ కుమార్ లతో కలిసి కేసులకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అండర్ ట్రయల్ కేసులకు సంబంధించి కేసుల సత్వర పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అండర్ ట్రయల్ కేసులలో కక్షిదారుల పరిస్థితి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. చార్జ్ షీట్ వేసిన,వేయని కేసులకు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. బెయిల్ మంజూరు అయిన వెంటనే నిర్ణీత నిబంధనలను పాటిస్తూ సంబంధిత వ్యక్తులను విడుదల చేయాలని, అండర్ ట్రియల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవుల దాహం తీర్చండి

- రాష్ట్రస్థాయిలో పశుపక్షాల రాష్ట్రస్థాయి సేవా పురస్కార్ పొందండి
- బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** మూగ జీవాల దాహం తీర్చండి, రాష్ట్రస్థాయిలో పశుపక్షాల రాష్ట్రస్థాయి సేవా పురస్కార్ పొందాలని రాష్ట్ర బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలో ఆయన మాట్లాడుతూ మా బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో వేసవికాలంలో మూగ జీవులకు నీటిని, శుభ్రమైన గింజలను అందించడం వంటి పోటీలు చిన్నారి విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్రంలోని విద్యార్థులు ఐదో తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంత మంచి చక్కటి అవకాశం అన్నారు. వేసవి సెలవుల్లో ఇంటి వద్ద మూగజీవులకు దాహం తీర్చుటకు, శుభ్రమైన గింజలు అందించుటకు ఏర్పాటు చేసే విధానము ఒక ఫోటో మూడు నిమిషాల వీడియో విద్యార్థి ఆన్లైన్ ద్వారా 9440988001 నెంబర్ కు వారు ఏర్పాటు చేసిన నీటిని, గింజలను కలిపి ఫోటోను, వీడియో చిత్రీకరణ చేసి 100 అక్షరాలతో చిన్న వ్యాసాన్ని రాసి పంపించాలన్నారు. వీరికి తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాల చిన్నారి విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో పశుపక్షాల సేవ పురస్కార్ 2026 అందిస్తామన్నారు. సర్టిఫికెట్, మెమెంటోను, శాలువాతోను ఘనంగా సన్మానిస్తామన్నారు. విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. ఈ పోటీలో ఎంతమంది విద్యార్థులు పాల్గొంటారో వారందరికీ ఆన్లైన్ ద్వారా సర్టిఫికెట్ పంపిస్తామన్నారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో పశు పక్షాలను ప్రేమించడం, మంచి నీటిని, శుభ్రమైన గింజలను అందించడంలో చిన్నప్పటి నుండే సేవాగుణం అలవర్చుకుంటారని అన్నారు. కార్యక్రమం ఫోటోలను, వీడియోలను మే ఐదో తారీఖు వరకు పంపించాలని అన్నారు.

## ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్ సస్పెన్షన్

వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 29 (జనం సాక్షి) : వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు పోలీస్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, డబ్బు ఇవ్వని వారి ఇంటి పై దాడికి పాల్పడినందుకు గాను ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ యం. తిరుపతి సస్పెండ్ కాగా, హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో మద్యం నైట్ ఇంచార్జి విధులు నిర్వహించినందుకు హెడ్ కానిస్టేబుల్ టి. రాములు సస్పెండ్ అయ్యారు. అలాగే స్టేషన్ అధికారి ఇచ్చిన ఆదేశాలను అతిక్రమిస్తున్నందుకు గాను చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు చెందిన ఓ రమేష్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు

## అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ అందించాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాను అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. బుధవారం స్థానిక భుక్తాపూర్ లోని విద్యుత్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను సందర్శించిన కలెక్టర్, అటెండెన్స్ రిజిస్టర్లు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత వేసవి దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాను అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని స్పష్టం చేశారు. రైతులు విద్యుత్ సమస్యల కారణంగా ఇబ్బందులు పడకుండా క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు విఫలమైనా లేదా సాంకేతిక లోపాలు తలెత్తినా, నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా వాటిని పునరుద్ధరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరిగితే సహించేది లేదని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్. శేషారావు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వినియోగం పై ఉక్కుపాదం మోపాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(జనంసాక్షి ):** జిల్లాలో గంజాయి సాగు చేసిన, వినియోగించిన, రవాణ ,చేసే వారిని గుర్తించి వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. బుదవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరం లో జిల్లా నార్కోటిక్ కంట్రోల్ భ్యూరో సమావేశానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మోర్మాట్ అదనపు ఎస్పి అడ్మిన్ చిత్ర రంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, గంజాయి వినియోగం, అక్రమ రవాణ చేసే వారి పై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి ,ఇతర మత్తు పదార్థాలు సేవించడం వల్ల ఆరోగ్యాలు పాడై కుటుంబాన్ని ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నారని, మత్తులో వుండి ఎన్నో నేరాలకు కారనమౌతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. గంజాయి సాగు చేసే వారిని గుర్తించి వారికి ప్రభుత్వమూ నుండి అందే సంక్షేమ పథకాలను రద్దు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి గంజాయి సేవించడం వల్ల కలిగే నష్టాల పై అవగాహన పర్చలన్నారు. పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులకు గంజాయి, సేవించడం వల్ల ఉజ్వల భవిష్యత్తు దెబ్బతింటుందని వాటి వల్ల జరిగే నష్టాల పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల, కళాశాలల సమీపంలో వుండే పాన్ టేలాలు,కిరణా దుకాణాల పై నిఘా పెట్టాలని అన్నారు. కల్లు కశీపొండ్ లలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలనీ తెలిపారు. ఆటో డ్రైవర్లు, బస్ డ్రైవర్లు, రోజు వారి కూలీలకు, గంజాయి సేవించడం వల్ల జరిగే నష్టాల పై అవగాహన పర్చాలన్నారు. వాహనాలు, ఆటోలను ప్రతి రోజు తనిఖీలు చేపట్టాలన్నారు. సరిహద్దు రాష్టాల నుండి మత్తు పదార్థాలు అక్రమ రవాణ జరుగకుండా వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. మెడికల్ షాపులలో లబించే అధిక మోతాదు మందుల విక్రయాల పై తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశం లో సంబందిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పదవి బాధ్యతలు చేపట్టనున్న సొసైటీ పాలకవర్గాలు!

- తీర్పు వెలువరించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం...

**చెన్నారావుపేట, ఏప్రిల్ 29 (జనం సాక్షి):** చెన్నా రావుపేట, అమీ నాబాద్ సొసైటీ చైర్మన్లు పాలకవర్గాలతో కలిసి మళ్లీ పదవి బాధ్యతలను చేపట్టనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పాలకవర్గాలన్నీ కూడా తిరిగి పదవి బాధ్యతలు చేపట్టాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. గత కొద్ది నెలల పాటు ప్రభుత్వం సొసైటీ పాలకవర్గాలను రద్దు చేసి పర్సన్ ఇన్చార్జిలతో సొసైటీల పరిపాలనను కొనసాగిస్తుంది. దీంతో కొంతమంది సొసైటీ చైర్మన్లు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సొసైటీ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు తిరిగి పదవి బాధ్యతలను చేపట్టాలని తీర్పునివ్వడంతో చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ చింత కింది వంశీ, సొసైటీ చైర్మన్ మురహరి రవిలు వర్షం వ్యక్తం చేశారు.

## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి



**హనుమకొండ ప్రతి నిధి, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** మే 3న నిర్వహించనున్న నీట్ పరీక్షను ఎటువంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహిం చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమన్వయ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లతో ఆయన ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మే 3 మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నీట్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష సమయం కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 8 పరీక్షా కేంద్రాల్లో 4,320 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. వరంగల్ ఎన్ఐటీలో రెండు కేంద్రాలు ఉండగా, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో–ఎడ్యుకేషన్), కాకతీయ డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, లాల్ బహుదూర్ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు.పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే ప్రవేశం కల్పించబడుతుందని, 1:30 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. ఆలస్యంగా వచ్చే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని తెలిపారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచిస్తూ, విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాల్సిందిగా, ఆర్టీసీ అధికారులు అభ్యర్థుల రాకపోకలకు తగిన బస్సులను నడపాల్సిందిగా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి కేంద్రంలో ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాల్సిందిగా ఆదేశించారు. అలాగే తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సదుపాయాలు సమృద్ధిగా కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నీట్ జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, ఏసీపీ నరసింహారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, విద్యాశాఖ అధికారులు, ఆర్టీసీ, పోస్టల్, విద్యుత్ శాఖల ప్రతినిధులు మరియు పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## అక్రమంగా చేపలు పట్టే ప్రైవేట్ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

- చెరువు వద్ద సొసైటీ సభ్యుల ఆందోళన
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**భీమిని, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** భీమిని మండలంలోని కమలాపూర్ ప్రాజెక్టు చెరువులో అక్రమంగా చేపలు పట్టే ప్రైవేటు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పెద్ద పేట మత్స్యకార సొసైటీ సంఘం సభ్యులు బుధవారం కమలాపూర్ చెరువు వద్ద ఆందోళనకు దిగారు. గత పది సంవత్సరాల నుండి భీమిని మత్స్యకార సొసైటీ ఏర్పడిందన్నారు. మూడు సంవత్సరాలుగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ కు చెందిన ఓ ప్రైవేట్ వ్యక్తితో సొసైటీ లో ఉండే అధ్యక్షుడు మరి కొంతమంది సొసైటీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా చెరువును లీజుకు ఇచ్చినట్లు తెలిపారు. చేపలు పట్టుకునేందుకు చెరువు వద్దకు వెళితే అక్కడ కాపలా పెట్టిన ప్రైవేటు వ్యక్తి మీరు చాపలు ఎలా పడతారో చూస్తానంటూ బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ విషయంపై మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ లో మత్స్యశాఖ అధికారి అవినాష్ కు సమస్యపై పలుమార్లు సమాచారం అందించినప్పటికీ అధికారి పట్టించుకోలేదన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వానికి లీజు అమౌంట్ చెల్లిస్తున్నామన్నారు. సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం కూడా పట్టించుకోకపోవడంతో చెరువులోని చాపలను అక్రమ మార్గంలో కాగజ్ నగర్ పట్టణానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంలో మండలానికి చెందిన ఓ రాజకీయ నాయకుని హస్తం ఉన్నట్లు ఆరోపించారు. సొసైటీ కి పంచాయతీ పెద్దగా వ్యవహరిస్తూ సొసైటీ సభ్యుల పై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా చేపలు పట్టి అమ్ముకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఈ విషయంపై భీమిని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

## ముగ్గురు ఇన్స్‌స్పెక్టర్లకు డి.ఎస్పీలుగా పదోన్నతులు



**వరంగల్ ఈస్ట్ ,ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో ముగ్గురు ఇన్స్పెక్టర్లకు డిఎస్పీ దిగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్గా పనిచేస్తున్న గొర్ల సీతారెడ్డి, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ సార్ల రాజు, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్స్పెక్టర్ బోలగాని శ్రీనివాస్ గౌడ్ వున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 మంది ఇన్స్పెక్టర్ లకు డిఎస్పీలుగా పదోన్నతి లభించింది.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

- రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో, ఏప్రిల్ 29(జనం సాక్షి):** బుధవారం జిల్లా కలెక్టర్ సీరోలు మండలం ఉప్పరిగూడెం, కాంపల్లి, కురవి మండలాలో కొనసాగుతున్న దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు, జిల్లా వ్యాప్తంగా సహకార శాఖ 150, ఐకెపి 50, గిరిజన కార్పొరేషన్ 8, మెప్మా 1, శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొత్తం ( 209 ) కేంద్రాల నుండి రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని సేకరించడం జరుగుతుందని, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 3934.860 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అకాల వర్షాలు రానున్న నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేయాలని టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలని కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం మ్యాచర్ వచ్చే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని, ధాన్యం కేంద్రాల వద్ద త్రాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, రవాణా చేయు విషయంలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలను సిద్ధం చేయాలని, గన్ని సంచులు, మ్యాచ్చర్ మిషన్లు, ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, టెంట్లు, చేర్లు, తదితర అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోళ్లు చేసిన దాన్యంకు సంబంధించి రైతుల ఖాతా వివరాలను సేకరించి ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు త్వరగా పడే విధంగా సంబంధిత సెంటర్ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, సివిల్ సప్లై అధికారి రమేష్, మేనేజర్ సివిల్ సప్లై నరసింహారావు, సంబంధిత నిర్వాహకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30 ఏప్రిల్ 2026

# ప్రజా పాలనలో అర్జీ ఏదైనా..పరిష్కారం పక్కా..!

- మూడు నెలల్లోగా పెండింగ్ సమస్యలన్నీ క్లియర్
- సాధాబైనామాలకు 45 రోజుల్లోనే విముక్తి
- త్వరలో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** ప్రజా ప్రభుత్వం ప్రజల ముంగిటకే వచ్చిందని, ప్రజలు ఇచ్చే ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల గ్రామంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

**గడువులోగా పరిష్కారం..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "సాధారణ సమస్యలను వారం రోజుల్లోనే పరిష్కరించాలని అధికారులకు సూచించాం. ఇక ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు గరిష్టంగా 3 నెలల గడువు విధిస్తున్నాం. ఈలోపు ప్రతి దరఖాస్తుకు ఒక స్పష్టమైన పరిష్కారం చూపడమే మా లక్ష్యం" అని ప్రకటించారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సాధాబైనామా సమస్యలను 45 రోజుల్లోనే కొలిక్కి తెస్తామని కీలక ప్రకటన చేశారు.


**పేదల సొంతింటి కల.. మా బాధ్యత**

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇళ్లు లేక ఇబ్బంది పడ్డ పేదలకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశాం. ప్రతి సోమవారం బిల్లులు విడుదల చేస్తూ పారదర్శకత పాటిస్తున్నాం అని తెలిపారు. త్వరలోనే రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు. రూరల్ మండల పరిధిలోని 12 గ్రామాల్లో గత రెండున్నరేళ్లలో రూ.386 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు.

**అన్నదాతకు వెన్నుదన్నుగా..**

రైతుల సంక్షేమంలో తమ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. రూ. 20,656 కోట్లతో 25 లక్షల మందికి రైతు రుణమాఫీ పూర్తి చేశామని, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. కొత్త రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్ల కోసం వేచి చూస్తున్న అర్హులకు త్వరలోనే శుభవార్త చెబుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, అరేంపుల సర్పంచ్ బండి సతీష్,మాజీ సర్పంచ్ బండి జగదీష్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖల చీఫ్ ఇంజనీర్లు, జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే యువత భవిష్యత్ సురక్షితం



**గరిడేపల్లి, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** డ్రగ్స్ దూరంగా ఉంటే యువత భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని ఎస్సై చలికంటి నరేష్ అన్నారు. మండల కేంద్రంలో గరిడేపల్లిలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీసులు బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సుల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన డ్రగ్స్ యువత జీవితాలను నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.తాత్కాలిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం, చదువు, కుటుంబ భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు. డ్రగ్స్ కు బానిసైన యువత నేరాల బాట పట్టే ప్రమాదం ఉందని తెలిపారు.సమాజాన్ని మత్తు పదార్థాల బారినుంచి కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.డ్రగ్స్ విక్రయాలు వినియోగంపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు డ్రగ్స్ కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది సుంకరి నగేష్, గోపి, ప్రశాంత్, మల్లయ్య, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత కోసం నిర్మాణాత్మక చర్యలు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, వినూత్న కార్యక్రమాల ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ సైతం నిర్మాణాత్మక కార్యాచరణతో ముందుకు సాగుతుందని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సిఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించి ఉదయం రిజిస్ట్రేషన్ ద్వారా 300 మంది స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యురాళ్లకు ఈ శిక్షణా తరగతులను నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం మైక్రో, చిన్న తరహా, మధ్యతరహా పారిశ్రామిక సంస్థలను అభివృద్ధి పరచడానికై ఉచిత శిక్షణను అందించి యువ మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడానికి ఒక గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తక్కువ ఇంట్రెస్ట్ తో లోన్లు, ప్రభుత్వ పథకాలకు సబ్సిడీలు, ప్రభుత్వ టెండర్లలో భాగస్వామ్యం చేసే అవకాశం, 45 రోజుల వ్యవధితో కూడిన పేమెంట్ ప్రొటెక్షన్, సులువుగా అనుమతులు మరియు లైసెన్సుల అర్హతను సాధించడానికి మార్గం సుగమమవుతుందన్నారు. ఉదయం రిజిస్ట్రేషన్ కార్యక్రమం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో కొనసాగుతుందని, ఇది మహిళా సాధికారతకు, మహిళా పారిశ్రామికవేత్తల నిర్మాణానికి దోహదపడుతుందన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- రెవెన్యూ అదనపు కలెక్టర్



**వలిగొండ, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో బుధవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి మార్కెట్ యార్డ్ ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ... వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో దశరథ, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యే లక్ష్యం



**కొండమల్లేపల్లి, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర రోడ్డు రవాణా భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యే బాలు నాయక్ నేడు కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొలుముంతల పహాడ్ గ్రామ పంచాయతీలో 202 సర్వేనెంబర్లోని 20 ఎకరాలలో 200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణా శంకుస్థాపన కార్యక్రమానికి నేడు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. నేటి పోటీ ప్రపంచంలో నాణ్యమైన విద్య కోసం మధ్య పేద తరగతి తల్లిదండ్రులు తమ స్తోమతకు మించి అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు పూర్తిగా అందుబాటులోకి వస్తే రూపాయి ఖర్చు లేకుండా అత్యున్నత స్థాయి బోధన, భోజన వసతి సౌకర్యాలు లభిస్తాయి. ఇది వేలాది కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద ఊరట నిస్తుంది. ప్రస్తుత గురుకుల వ్యవస్థలలో ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కో పాఠశాల ఉండగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల సమీకృత విధానం ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు అందరూ ఒకే ప్రాంగణంలో ఒకే గొడుగు కింద చదువుకోనున్నారు. ఈ విధానం విద్యార్థుల కుల వివక్షను తొలగించడమే కాకుండా చిన్ననాటి పాత తరంలా సామాజిక ఐక్యతను పెంపొందిస్తుంది. ఇలాంటి విద్యా విధానం నేటి సమాజానికి ఎంతో అవసరం.

## బిడ్డ జీవితం నాశనం చేశారని కళాశాలపై ఆరోపణ



మణుగూరు, ఏప్రిల్ 29 (జనంసాక్షి) : నా బిడ్డని కళాశాల నిర్వాహకులు నమ్మక ద్రోహంతో మోసం చేశారని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించారు.బుధవారం మణుగూరు మండలంలో విద్యార్థిని తల్లిదండ్రులు నా కూతురికి అన్యాయం జరిగిందని విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ..పాల్వంచ కే ఎల్ ఆర్ కళాశాలలో డిప్లమా మూడవ సంవత్సరం చదువుతున్న పేరుబోయిన స్వర్ణంబిక మణుగూరు నుంచి పాల్వంచకు కళాశాల బస్సులో వెళ్తోంది. ఈ క్రమంలో జనవరి 21న మొండికుంట అటవీ ప్రాంతంలో కేఎల్ఆర్ కాలేజ్ బస్సు ప్రమాదానికి గురైంది. ఆ బస్సు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా కుడి చేయి సైతం విరిగింది.. ఈ నేపథ్యంలో కాలేజీ యాజమాన్యం వైద్యం చేయిస్తామని, చదువుకు ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకుంటామని కళాశాల చైర్మన్, ప్రిన్సిపల్ ఆ రోజు హామీ ఇవ్వడంతో నమ్మి వచ్చాము. గత నాలుగు నెలల నుండి విద్యార్థినికి వైద్య సేవలు అందిస్తున్నామని చెబుతున్నారు కానీ రెండు నెలల నుంచి వైద్య ఖర్చులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్లైన్లో క్లాసులు విని పరీక్ష రాయుటకు వెళితే అనుమతి ఇవ్వలేదు. ఆనాడు విద్యా ,వైద్యం విద్యార్థినికి పూర్తి బాధ్యత మాదే అని చెప్పి ఇప్పుడు పరీక్ష రాయకుండా నిలిపివేసి నా కూతురు జీవితాన్ని మమ్మల్ని దారుణంగా మోసం చేశారని కన్నీటి పర్యంతమయ్యారు.. నా బిడ్డ జీవితం నాశనం చేయొద్దు పరీక్ష రాయనివ్వండని ఎన్ని సార్లు వేడుకున్నా కనికరించక పోగా కళాశాల నుంచి బయటికి వెళ్ళమని నెట్టేశారు.మరల కాలేజీకి వెళ్లి పరీక్ష రాయకపోతే సంవత్సరం వృధా అవుతుందని వేడుకొనగా ఇంకోసారి ఇక్కడికి వస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నారు.. నా కూతురుకు న్యాయం చేయాలని, తమ కూతురుకు జరిగిన అన్యాయం ఇంకెవరికి జరగకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మాకు న్యాయం చేయాలని విద్యార్థిని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

## గౌడ కులస్తులకు అండగా ఉంటా..

ఎమ్మెల్సీ టీపీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్ సిటీ, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** గౌడ కులంలో జన్మించినందుకు నాకు చాలా గర్వ కారణంగా ఉందని గౌడ కులస్తుల అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంటేశ్వర్ లో గల పట్టణ గౌడ సంఘం (01) ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పట్టణ గౌడ సంఘం మరియు కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నెంబర్ 01 సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గౌడ కులస్తులలో ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో నిజాయితీతో గౌడవృత్తికి సమాజంలో అన్ని కులాలకు కంటే మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. గౌడ కులస్తులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తిన తాము సహించబోనని వారికి వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురైన ప్రభుత్వ పరంగా ప్రభుత్వపరంగా పరిష్కారం పరిష్కారం అయ్యే విధంగా అయ్యే విధంగా ప్రత్యేక చొరవ చూపుతానని ఆయన భరోసానిచ్చారు. గౌడ కులంలో నికార్సైన అర్హులైన గౌడ కులస్తులను గుర్తించి వారిలో ప్రతి ఒక్కరికి గౌడ కులస్తుల లో సభ్యత్వం ఇవ్వాలన్నారు ఇవ్వాలన్నారు.ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా గౌడ కులవృత్తికి చేసింది శూన్యమని కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంలోని గౌడ కులస్తులకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రతి ఒక గౌడ కులస్తులు తమకు చెందిన స్థలాల్లో ఈత వనాలు పెంచుకుంటూ మన సొసైటీ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ వాటిని పెంచాలని పెంచాలని అన్నారు. మరి ముఖ్యంగా గౌడ కులస్తులందరూ ఐక్యమత్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గౌడ్ శేఖర్ గౌడ్ ఖిల్లా గంగాధర్ గౌడ్ దయాకర్ గౌడ్ నర్సాగౌడ్ శ్రీనివాస్ గౌడ్ లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో వాహనాల తనిఖీ



**మునగాల, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న బాలల భద్రత డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమం సందర్భంగా మునగాల పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ప్రజా రవాణా వాహనాలను బస్సులు ఆటోలు ఇతర ట్రాన్స్పోర్ట్ వాహనాలను తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీలలో భాగంగా గంజాయిలాంటి మత్తు పదార్థాలను ఎవరైనా తరలిస్తున్నారా అని నిఘా ఉంచారు. అనంతరం స్థానిక ప్రజలకు ఎస్ఐ బి. ప్రవీణ్ కుమార్ అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ అనే మహమ్మారి పీడిస్తున్నదని, దీని బారి నుండి మన పిల్లలను, యువతను మన సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని ఎస్సై తెలిపారు. డ్రగ్స్ మత్తుకు బానిసలై యువత ఆరోగ్యాలను నాశనం చేసుకుంటున్నారని బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని తెలిపారు. గంజాయిలాంటి మత్తు పదార్థాలు సరఫరా జరగకుండా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేసిందని, దీనికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించి డ్రగ్స్ నిర్మూలన భాగస్వామ్యం కావాలని తెలియజేశారు.

## అక్రమ కేసులకు బెదిరేది లేదు

- కాగ్నా నీటితో కడిగిన ముత్యంలా రోహిత్ రెడ్డి
- మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్ నాయక్



**తాండూరు, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** అక్రమ కేసులకు బెధిరేది లేదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్తు విఠల్ నాయక్ పేర్కొన్నారు. చంచల్ గూడ జైలు నుంచి విడుదలైన మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిని బుధవారం హైదరాబాద్ మణికొండ నివాసంలో 13వ వార్డు కౌన్సిలర్ సురేష్ నాయక్ కూతురు అడ్వకేట్ వర్త్యా ప్రశాంతితో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వర్తు విఠల్ నాయక్ కలిసి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వర్తు విఠల్ నాయక్ మాట్లాడుతూ కాగ్నా నీటితో కడిగిన ముత్యంలా రోహిత్ రెడ్డి రావడం సుభసూచికమన్నారు. తాండూరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు రోహిత్ రెడ్డిపై ఉన్నాయని వెల్లడించారు. రాబోయే ఎమ్మెల్యే ఎన్నికల్లో వచ్చేది బి ఆర్ ఎస్ ప్రభుత్వమేనని దీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా రానున్న బిఆర్ఎస్ ప్రభుత్వంలో రోహిత్ రెడ్డిని మంత్రిగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు, అబిమానులు తదితరులు ఉన్నారు.

## నాగులవంచ వసతి గృహంలో పదిలో 100% ఉత్తీర్ణత



**చింతకాని, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** చింతకాని మండల పరిధిలోని నాగులవంచలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని సమీకృత బాలుర వసతి గృహం పదవ తరగతి ఫలితాల్లో మరోసారి ప్రతిభ చాటింది. ఈ వసతి గృహం నుండి ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలకు హాజరైన 15 మంది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలు సాధించారు. గత సంవత్సరం కూడా ఇదే విధంగా శాతం శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, ప్రభుత్వ సౌకర్యాల వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి హాస్టల్ వాతావరణం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాబోయే విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభిస్తూ "హాస్టల్ బాట" కార్యక్రమాన్ని సీతంపేట, తిరుమలాపురం, తిమ్మినేనిపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వసతి, భోజనం, విద్యా సౌకర్యాలను వినియోగించుకుని తమ పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావుతో పాటు సిబ్బంది దిలీప్, వెంకటేశ్వర్లు, మహేందర్, జయసింహ పాల్గొన్నారు.

# వలసలు ఆగుతాయి.. బతుకులు మారుతాయి

- మంత్రి సీతక్క



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** బుధవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని మల్కపూర్ గ్రామపంచాయతీ కొత్తపేట తాండలో ఉపాధి హామి కులీల పనులను పరిశీలించి వారి సమస్యలను మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ మంత్రి వర్యులు సీతక్క అడిగితెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధిహామి కులీలకు గొప్ప చట్టం. పనులు కొరకు వలస పోవడాన్ని అరికట్టడానికి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రధానమంత్రి మన్ మోహన్ సింగ్ గాంధీ పేరు మీద 100 రోజులు ప్రవేశపెట్టారన్నారు. ఇప్పుడు ఉపాధి హామి కూలీలకు ఫోటో క్యాప్చర్ చేయలి. సర్వర్ పనిచేయక ఆలస్యమవుతుందన్నారు.ఎండకాలం ఉపాధి హామి కూలీలు ఉదయమే పనులు చేపట్టి టెంట్, మంచినీరు వసతులు కల్పించలన్నారు. సర్పంచ్, పంచాయతీ సెక్రెటరిలు ఉపాధిహామి కూలీలకు మట్టి త్రవేటప్పుడు ముందు రోజే ట్రాక్టర్లతో నీరు తడిపితే నెలనాని త్వరగా త్రవ్వడానికి వీలవుతుందని సూచించారు. మహిళ సంఘాల ద్వారా ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించుకోనుటకు ఒక లక్ష ఋణం అందజేస్తామని, ఒకవేళ మహిళా సంఘం వారు చనిపోతే 10 లక్షల రూపాయలు జీవిత భీమ ద్వారా అందజేస్తామన్నారు. మహిళ సంఘాలకు 60వేల కోట్లు అందజేసామన్నారు.విద్యుత్ 200 యూనిట్లు వరకు ఉచితం, సన్నబియ్యం అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నమన్నారు. గ్రామంలో రోడ్డు వేయడానికి 50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు స్కూల్ పై కప్పు కూలీపోయినందున ఎస్టిమెషన్ ప్రతిపాదనలు పంపాలన్నారు.మల్కపూర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లు పథకం క్రింద మంజూరైన మంజూల సాయగౌడ్ వారి ఇళ్ళను మంత్రి సీతక్క, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, సర్పంచ్ శ్రీధర్ గౌడ్ లతో గృహ ప్రవేశం చేసారు. ఈ సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, అన్వేష్ రెడ్డి, తహెర్ బిన్ హందాన్, సర్పంచ్ శ్రీధర్ గౌడ్, జెడ్పి సిఈఓ సాయగౌడ్, డిఆర్డిఓ సాయన్న పాల్గొన్నారు.






# ఒపెక్ నుంచి యూఏఈ ఎగ్జిట్..
# భారత్‌కు మంచిదే!

**న్యూఢిల్లీ:**చమురు ఎగుమతి దేశాల సమాఖ్య అయిన ఒపెక్, ఒపెక్+ నుంచి నిష్క్రమించనున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించడం చర్చనీయాంశం అయ్యింది. దీనివల్ల ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోతోందన్న దానిపై ఆసక్తి నెలకొంది. అయితే, ఒకరకంగా భారత్‌కు కలిసొచ్చే అంశమని అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ అన్నారు. దిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగడం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌పై ప్రభావం గురించి ఇప్పుడే ఓ అంచనాకు రాలేమని సాగర్ అదానీ అన్నారు. ప్రపంచ ఆయిల్ మార్కెట్ ఒడుదొడుకులు ఎదుర్కొంటుందా? స్థిరత్వం సాధిస్తుందా? అనే దానికి కాలమే సమాధానం చెప్తుందన్నారు. అదే సమయంలో యూఏఈతో భారత్‌కు ఉన్న మంచి సంబంధాల దృష్ట్యా మనకు లాభించే అవకాశం ఉందన్నారు. భారత్ కోణంలో చూస్తే ఈ పరిణామం వల్ల మేలు జరుగుతుందని, ప్రపంచ మార్కెట్ కోణంలో చూడాల్సివస్తే ఇప్పుడే తుది నిర్ణయానికి రాలేమన్నారు.ఒపెక్ నుంచి యూఏఈ వైదొలగడం వల్ల భవిష్యత్‌లో ప్రపంచ చమురు మార్కెట్‌లోకి క్రూడాయిల్ సరఫరా పెరుగుతుందని కోటక్ సెక్యూరిటీస్‌లో రీసెర్చ్ హెడ్ అనింద్య బెనర్జీ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు మెరుగుపడ్డాక సరఫరా పుంజుకొంటుందని చెప్పారు. అలాగే, భారత్, యూఏఈ మధ్య వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడనున్నాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా చమురు కొనుగోళ్లకు రూపాయిల్లో చెల్లింపుల్లో వేగం పుంజుకొనే అవకాశం ఉందన్నారు. డాలర్లకు బదులుగా భారతీయ రూపాయిల్లో చమురు కొనుగోలు చేసే అవకాశం పెరుగుతుందని బెనర్జీ పేర్కొన్నారు.

## మే నెలలో బ్యాంకులకు 9 రోజుల సెలవులు

**న్యూఢిల్లీ:**బ్యాంకింగ్ సేవలు మొబైల్‌తో పొందే సౌలభ్యం వచ్చినప్పటికీ.. నేటికీ బ్యాంక్ బ్రాంచికి వెళ్తే గానీ కొన్ని పనులు కాని పరిస్థితి ఉంది. మే నెలలో అలాంటి ప్రణాళికలు ఏమైనా ఉంటే సెలవుల గురించి తెలుసుకోవడం ముఖ్యం. మే నెలలో బ్యాంకులు మొత్తం 9 రోజులు పాటు తెరుచుకోవు. మే 1న మేడే, మే 27న తేదీ బక్రీద్ సందర్భంగా బ్యాంకులు పనిచేయవు. దీనికి 2, 4 శనివారాలు, ఆదివారాలు అదనం.

# సెన్సెక్స్ పైపైకి..
## లాభాల్లో సూచీలు..



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, రియల్టీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. తర్వాత లాభాల స్వీకరణతో మోస్తరు లాభాలకు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 77,245.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,886.91) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,982.51 పాయింట్ల వద్ద గరిష్ఠాలను తాకిన సూచీ.. చివరికి 609.45 పాయింట్ల లాభంతో 77,496.36 వద్ద ముగిసింది. నిఫ్టీ 181.95 పాయింట్ల లాభంతో 24,177.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.86గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఇండిగో, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 114 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4569 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**సెన్సెక్స్ 900+**

దేశీయ మార్కెట్లు బుధవారం భారీ లాభాల్లో ఉన్నాయి ఆసియా మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లు చేపట్టడం కలిసివచ్చింది. దాంతో సెన్సెక్స్ ఒక దశలో 900 పాయింట్లకు పైగా పెరిగింది. ఉదయం 11.01 గంటల సమయంలో సెన్సెక్స్ 939 పాయింట్లు ఎగబాకి, 77,826 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 288 పాయింట్లు పెరిగి, 24,284 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.81 వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ సూచీలో మారుతీ సుజుకీ, కోల్ ఇండియా, ఎంఅండ్ఎం, టెక్ మహీంద్రా, ఐటీసీ షేర్లు లాభాల్లో ఉన్నాయి. హిందాల్కో, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఏషియన్ పెయింట్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ట్రెంట్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి.
కారణాలివీ..
జపాన్ నిక్కీ మినహా మిగిలిన అన్ని ఆసియా సూచీలన్నీ లాభాల్లో ఉన్నాయి. దాంతో మన సూచీలు నిన్నటి నష్టాల నుంచి కోలుకొని లాభాలబాట పట్టాయి. ఇక, బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్‌కు 0.21 శాతం తగ్గి, 111 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. భారీగా ఇంధన దిగుమతులు చేసుకొనే భారత్‌కు ధరలు తగ్గడమనేది సానుకూలాంశం. మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) గత ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చికి సంబంధించిన లాభాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024-25 ఇదే సమయంతో పోల్చుకుంటే లాభం తగ్గినా.. డిమాండ్ స్థిరంగా ఉంటుందన్న అంచనాలతో మారుతీ సుజుకీ షేర్ 4 శాతం మేర పెరిగింది. మరోవైపు ఎటర్నల్ షేర్ ధర కూడా రెండు శాతం పెరిగింది.

# స్మార్ట్ రెస్పాన్స్ కోసం యూట్యూబ్‌లో ఏఐ ఫీచర్

**న్యూఢిల్లీ:**వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ స్మార్ట్ రెస్పాన్స్ కోసం కొత్త ఫీచర్‌ను తీసుకొస్తోంది. తన సెర్చ్‌బార్‌లో 'ఆస్క్ యూట్యూబ్' ఏఐ ఫీచర్‌ను తీసుకురాబోతోంది. ప్రస్తుతం ఈ ఫీచర్ అమెరికాలో 18 ఏళ్లు పైబడిన కొంతమంది యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రైబర్లకు మాత్రమే అందుబాటులోకి ఉంది. ఒకసారి ఈ ఫీచర్ అందరికీ అందుబాటులోకి వచ్చాక యూట్యూబ్‌లో సెర్చ్ పూర్తిగా ఏఐ రూపం దాల్చనుంది.ఏదైనా విషయంపై ప్రశ్నలు అడిగినప్పుడు అందుకు సంబంధించి వీడియోలతో పాటు ఏఐ రూపొందించిన టెక్స్ట్ సారాంశాన్ని కూడా ఈ ఏఐ చాట్‌బాట్ అందిస్తుంది. అవసరమైన సలహాలను ఇస్తుంది.యూట్యూబ్ సెర్చ్‌బార్‌లో మీకు కావాల్సిన అంశాన్ని టైప్ చేస్తే ప్రస్తుతం వీడియోల లిస్ట్ మాత్రమే వస్తుంది. ఇకపై కొత్తగా అక్కడ 'ఆస్క్ యూట్యూబ్' అనే ఆప్షన్ కనిపిస్తుంది. దానిమీద ట్యాప్ చేస్తే.. యూజర్లు ప్రశ్నలను అడగడానికి ఓ టెక్స్ట్ బాక్స్‌తో కూడిన ఫుల్‌పేజీ ఇస్తుంది. అడిగిన ప్రశ్నలకు సంబంధించిన వీడియోలను చూపించడంతో పాటు ఏఐ ఆధారిత టెక్స్ట్ సారాంశాలను లాంగ్ వీడియో, షార్ట్స్ రూపంలో అందిస్తుంది. ఇందుకు సంబంధించిన వీడియోను యూట్యూబ్ తన బ్లాగ్‌లో పోస్టు చేసింది.ఉదాహరణకు లాంగ్ ట్రిప్స్, కాఫీ షాప్స్ వంటి వాటిపై సమాచారం కోరితే.. అందుకు సంబంధించిన వీడియోలతో పాటు మార్గమధ్యంలో చూడాల్సిన ప్రత్యేకమైన ప్రదేశాలపై సలహాలు ఇస్తుంది.


# మేము చేయని ప్రజా పోరాటం లేదు
### మంత్రి పదవి కావాలని ఎప్పుడూ అడగలేదు: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో టీజేఎస్ పాల్గొనని ప్రజా పోరాటాలు లేవని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం పాల్గొన్నారు. రాజకీయా వ్యూహాల్లో భాగంగానే కాంగ్రెస్‌కు మద్దతిచ్చాం. మంత్రులం, ఎమ్మెల్యేలం కావాలని మాకు లేదు. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ చెప్పలేదు.. నేను అడగలేదు. అవసరమైనప్పుడు ప్రజలకు తోడుగా ఉన్నాం. మే 12న జరిగే ప్లీనరీలో కీలక నిర్ణయాలు తీసుకుంటాం అని అన్నారు. 'మేము ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టులు కావాలని అడుగుతున్నాం. ఈసారి మా పార్టీ నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. 'గత ప్రభుత్వంలో ఎవరినైనా కలవాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఇంట్లోనే ఫోన్ పెట్టి, జాగ్రత్తగా రమ్మని చెప్పేవాళ్లు. భయం అంటే ఏంటో గత ప్రభుత్వం చూపించింది' అని విమర్శించారు. అమరుల స్ఫూర్తి యాత్రకు కూడా పర్మిషన్ ఇవ్వలేదని కోదండరాం గుర్తు చేశారు. ప్రజల నుంచి దూరంగా ఉంటే ఏ పార్టీ అయినా బతకదని, అందుకే కేసీఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని అన్నారు. 'మేం సరిగ్గానే ఉన్నాం. ప్రజలే మారాలని కేసీఆర్ ఆలోచిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. కుటుంబ లోపాలను కవిత బయటపెడుతున్నారని అన్నారు. పార్టీ అంటే కుటుంబమే అని కవిత చెప్పకుండానే చెబుతున్నట్లు ఉందని అన్నారు. ఓట్లు, సీట్లు కావాలంటే పార్టీని వేరేలా నడపాలని.. తాము మార్పు కోసమే పార్టీని నడుపుతున్నామని స్పష్టం చేశారు. అన్ని ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా ఉండలేమని, ఈసారి కచ్చితంగా ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. ముందు నుంచే నియోజక వర్గాలను ఎంచుకుని పని చేస్తామన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు కోదండరాం తెలిపారు.




# మారుతీ సుజుకీ ఆఫర్..
### ఇన్విక్టోపై రూ.2.15 లక్షల వరకు ప్రయోజనాలు

**న్యూఢిల్లీ:**ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ తన కార్లపై భారీ ఆఫర్లు ప్రకటించింది. ఎంపీవీ కేటగిరీకి చెందిన ఇన్విక్టోపై ఏకంగా రూ. 2.15 లక్షల వరకు ప్రయోజనాలను అందిస్తోంది. కన్స్యూమర్ ఆఫర్, ఎక్స్ఛేంజీ బోనస్, స్క్రాపేజీ బోనస్, లాయల్టీ అప్‌గ్రేడ్ బోనస్, కార్పొరేట్ ఆఫర్ వంటివి ఇందులో ఉన్నాయి. దీంతోపాటు ఏప్రిల్ కు సంబంధించి ఇతర మోడళ్ల పైనా ఆఫర్‌ను ప్రకటించింది. మారుతీ సుజుకీకి చెందిన గ్రాండ్ విటారాపై రూ. 1.07 లక్షలు, ఫ్రాంక్స్ ఎస్‌యూవీ రూ. 55 వేలు, ఇగ్నిస్ రూ. 50 వేలు, బాలెనోపై రూ. 40 వేలు, జిమ్నీ ఎస్‌యూవీ, ఎక్స్ఎల్6 ఎంపీవీపై రూ. 50 వేలు వరకు ప్రయోజనాలు కల్పిస్తోంది. ఇన్విక్టో ధర రూ. 24.97 లక్షల నుంచి రూ. 28.60 లక్షల మధ్య (ఎక్స్‌షోరూం) ఉంది. ఇందులో 2.0 లీటర్ ఇంజిన్ అమర్చారు. 184 హెచ్‌పీ పవర్‌ను, 188 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.




## అమెరికా దిగ్బంధనం ఎఫెక్ట్..
# ఇరాన్ ఓడరేవుల్లో భారీగా నౌకలు
# క్యూ



టెహ్రాన్:హార్మూజ్ జలసంధిపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతుండడంతో ఇరాన్ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోంది. దీనివల్ల పర్షియన్ గల్ఫ్‌కు వెలుపల, ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు వద్ద చమురుతో నిండిన ట్యాంకర్లు భారీగా నిలిచిపోయాయి. గత వారం రోజులుగా గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని ఈ ఓడరేవు సమీప జలాల్లో సుమారు ఆరు నుంచి ఎనిమిది సూపర్‌ట్యాంకర్లు నిలిచిపోయినట్లు అంతర్జాతీయ సముద్ర నిఘా సంస్థ వెల్లడించింది. వివిధ దేశాలకు చెందిన పలు చిన్న ట్యాంకర్లు కూడా అక్కడే నిలిచిఉన్నట్లు తెలిపింది. కాగా ఈ దిగ్బంధనం కారణంగా ఇప్పటికే రెండు భారీ నౌకలను వెనక్కి పంపినట్లు అమెరికా నౌకాదళాలు వెల్లడించాయి. చాబహార్ వద్ద భారీగా ట్యాంకర్లు నిలిచిఉండడంతో.. ఇరాన్ నౌకల్లోకి చమురును వాటిలోకి మారుస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం పాత నౌకలను తిరిగి సేవలోకి తీసుకువస్తున్నట్లు షిప్-ట్రాకింగ్ డేటా వెల్లడించింది. అయితే ముడి చమురును నింపుకోవడానికి ఇంకా ఎన్ని ఖాళీ ట్యాంకర్లు అందుబాటులో ఉన్నాయనే దానిపై స్పష్టత లేదు. 2 మిలియన్ బ్యారెళ్ల వరకు ముడి చమురును నిల్వ చేయగల సామర్థ్యం ఉన్న 30ఏళ్ల నాటి ఒక వీఎల్‌సీసీకు చెందిన 'నాషా' నౌక గత వారం పర్షియన్ గల్ఫ్ నుంచి సంకేతాలు పంపడం ప్రారంభించిందని షిప్-ట్రాకింగ్ డేటా వెల్లడించింది. ప్రస్తుతం అది ఖర్గ్ ద్వీపం వైపు వెళ్తోంది. మూడేళ్ల క్రితం ఆ నౌక చివరిసారిగా సరకును పంపిణీ చేసింది. అమెరికా దిగ్బంధనం వల్ల ఇప్పటికే హార్మూజ్ జలసంధి మీదుగా చమురు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో సుమారు 155 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురు నిల్వలు సముద్రంలో ఉన్నాయి. ప్రస్తుతం వీటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చమురును నిల్వ చేసే సామర్థ్యం అయిపోతున్నందున టెహ్రాన్ త్వరలోనే ఉత్పత్తిని నిలిపివేసే అవకాశం ఉంది. మరోవైపు హిందూ మహాసముద్రంలో ట్యాంకర్లను తనిఖీ చేయడం, ఇరాన్ చమురు కొనుగోలుదారుగా పేర్కొంటూ చైనాకు చెందిన రిఫైనరీపై ఆంక్షలు విధించడం వంటి చర్యలతో అగ్రరాజ్యం టెహ్రాన్‌పై ఒత్తిడి పెంచుతోంది.

# కిమ్ సైనికులు.. శత్రువుకు చిక్కకుండా పేల్చుకోవడమే..!



పాగ్యాంగ్:ఉత్తరకొరియాలో కిమ్ జోంగ్ ఉన్ నియంతృత్వ పాలన గురించి ఎప్పటికప్పుడు కొత్త విషయాలు వెలుగులోకి వస్తుం టాయి. రష్యా తరఫున ఉక్రెయిన్‌తో పోరాడుతోన్న కిమ్ సైనికులు శత్రువుకు చిక్కకుండా ఆత్మహత్యకు పాల్పడుతున్నారట వారు తమ ను తాము పేల్చుకుంటున్నారని స్వయంగా అధ్యక్షుడే ధ్రువీకరిం చారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం..ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల స్మారకార్థం రాజధాని నగరం ప్యాంగ్యాంగ్‌లో మెమోరియల్‌ను ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. సైనికులు తమనుతాము పేల్చు కుంటున్నారని పేర్కొన్నారు. "వారు వీరోచిత మరణం పొందారు" అని కొనియాడారు. ఉక్రెయిన్‌తో



యుద్ధం చేస్తోన్న రష్యా రెండేళ్ల క్రితం మిత్రదేశం ఉత్తర కొరియాతో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం.. ఇరు దేశాల్లో ఏ ఒక్క దేశంపై ఇతర దేశాలు దాడి చేసినా, రెండవ దేశం వెంటనే సైనిక సహాయం అందిస్తుంది. దానిలో భాగంగా రష్యాకు కిమ్ ప్రభుత్వం 10వేల మంది సైనికులను పంపిందని దక్షిణ కొరియా, పాశ్చాత్య దేశాల నిఘా సంస్థలు అంచనా వేస్తున్నాయి. యుద్ధంలో ఉ.కొరియా సైనికులు భారీ సంఖ్యలోనే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అలాగే శత్రువుకు చిక్కుకుండా వారు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని కథనాలు వెలువడిన నేపథ్యంలో కిమ్ స్పందన వచ్చింది. ఇదిలా ఉంటే.. ఈ సైనికుల మరణాలపై దేశంలో ఎలాంటి వ్యతిరేకత రాకుండా కిమ్ చూసుకుంటున్నట్లు కూడా కనిపిస్తోంది. గతేడాది ప్యాంగాంగ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన కొందరు ఉత్తర కొరియా సైనికుల చిత్రాలను ప్రదర్శించారు. కిమ్ జోంగ్ ఉన్ వారి మృతదేహాలపై చేతులు ఉంచి బాధాతప్త హృదయంతో నివాళులు అర్పించారు. అలాగే సైనికుల రక్తంతో రాసిన నోట్‌బుక్ ఫొటోలను అక్కడి మీడియాలో ప్రసారం చేశారు. తమ సైనికులు రష్యా యుద్ధంలో పాల్గొనట్లేదని అప్పటివరకు ఉ.కొరియా బుకాయించింది. కానీ కిమ్ ఉద్వేగానికి గురైన దృశ్యాలు ప్రసారం కావడంతో యుద్ధంలో ఆ దేశ సేనలు పోరాడుతున్నట్లు వెల్లడైంది.

# రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు

ఉద్యోగుల ఆర్థిక అవసరాలను, వారు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ నెలకు సంబంధించిన వెయ్యి కోట్ల రూపాయలను యుద్ధ ప్రాతిపదికన విడుదల చేశారు.?పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అత్యంత సానుకూలంగా స్పందించింది. అక్టోబర్ 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలన్నింటినీ ఈ నిధులతో పూర్తిగా క్లియర్ చేశారు. తమ పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరటనిచ్చే అంశం.ఉద్యోగుల ఆరోగ్య అవసరాలకు సంబంధించి మెడికల్ బిల్లులను ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా, ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు చెల్లించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం మెడికల్ బిల్లుల చెల్లింపులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. మెడికల్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లకూ మోక్షం ?ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్క రోజు కూడా జాప్యం లేకుండా మెడికల్ బిల్లుల చెల్లింపులు రెగ్యులర్‌గా జరిగేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది.ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములు. వారి సమస్యలను పరిష్కరించడం మా బాధ్యత" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. పెంచిన నిధులు, క్లియర్ అయిన ఉఖఈ బకాయిలు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.ఉద్యోగ వర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందనే విషయాన్ని ఈ తాజా నిర్ణయం నిరూపిస్తోంది. "ఉద్యోగుల కష్టాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటుంది'' అని అధికారులు పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి చొరవతో పెద్ద మొత్తంలో నిధులు విడుదల కావడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



# ట్రంప్ రక్షణపై పునఃసమీక్ష!

## సీక్రెట్ సర్వీస్ అధికారుల కసరత్తు

**వాషింగ్టన్:**వైట్‌హౌస్ కరెస్పాండెంట్ల విందులో జరిగిన కాల్పుల ఉదంతం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భద్రతను పర్యవేక్షించే సీక్రెట్ సర్వీసు అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రాబోయే పెద్ద కార్యక్రమాల్లో అధ్యక్షుడి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వారు మల్లగుల్లాలు పడుతున్నారు. రెండేళ్ల వ్యవధిలోనే ఆయనకు సమీపంలో మూడు దాడులు జరిగిన నేపథ్యంలో ఈ అంశంపై తీవ్రస్థాయిలో సమీక్ష జరుపుతున్నారు. రాబోయే కొన్ని నెలల్లో ట్రంప్ భారీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంది. అందులో కొన్ని ఆరుబయట కూడా జరగనున్నాయి. బ్రిటన్ రాజు చార్లెస్, రాణి కమిల్లాల అధికారిక పర్యటన, అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమం. ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌కు దేశం ఆతిథ్యమిస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాలను పర్యవేక్షించడం, నవంబరులో జరిగే మిడ్‌టెర్మ్ ఎన్నికలకు ముందు రిపబ్లికన్లకు మద్దతుగా ర్యాలీలు నిర్వహించడం వంటివి ఉన్నాయి. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలోనూ ఆయనకు ఇబ్బందులు పెరిగాయి. ఈ కార్యక్రమాల కోసం భద్రతను సీక్రెట్ సర్వీస్ పునఃపరిశీలిస్తోంది. ఈ దళంలోని ప్రొటెక్టివ్ ఇంటెలిజెన్స్, ముప్పు అంచనా బృందాలు.. ట్రంప్‌నుకు పొంచి ఉన్న భద్రతా రిస్కులను పునఃసమీక్షిస్తున్నాయి. తాజా దాడి నుంచి ప్రేరణ పొంది ఎవరైనా ఇలాంటి చర్యలకు పూనుకోవచ్చన్న ఆందోళనలు ఉన్నాయి. మరోవైపు.. అధ్యక్షుడి కార్యక్రమం ఉన్న హోటల్‌లో ఒక సాయుధ దుండగుడు ఎలా రూమ్ పొందగలిగాడని అమెరికా చట్టసభ సభ్యులు, విందులో పాల్గొన్నవారు ప్రశ్నిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లలో మార్పులు తీసుకురావాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. సీక్రెట్ సర్వీసు అధికారులు వీవీఐపీల రక్షణ మాత్రమే చూసుకున్నారని, కార్యక్రమ భద్రతను పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక నుంచి ట్రంప్ కార్యక్రమాల్లో పాల్గొనేవారిని మరింత క్షుణ్నంగా తనిఖీ చేయవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. దీనివల్ల వేదికలకు దారితీసే ద్వారాల వద్ద భారీ క్యూ లైన్లు తప్పవంటున్నారు.

**భద్రతా సిబ్బందికి టోకరా ఇచ్చి..**

అమెరికా అధ్యక్షుడికి తీవ్రస్థాయిలో ముప్పు పొంచి ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. ఏమాత్రం అలసత్వం చోటుచేసుకున్నా దారుణ పరిణామాలు తప్పవు. అయితే 1901లో ప్రెసిడెంట్‌గా ఎన్నికైన థియోడర్ రూజ్‌వెల్ట్ మాత్రం.. తన వెన్నంటే ఉండే భద్రతా సిబ్బందికే టోకరా ఇచ్చేవారు. ఆయన హయంలోనే అమెరికా అధ్యక్షుడి రక్షణ బాధ్యతలు పూర్తిగా సీక్రెట్ సర్వీస్ తీసుకుంది. నీడలా భద్రతా సిబ్బంది తన వెన్నంటి ఉండటం రూజ్‌వెల్ట్‌కు అసహనం కలిగించింది. దీంతో కొన్నిసార్లు ఆయన సీక్రెట్ సర్వీసు అధికారుల కళ్లుగప్పి వాషింగ్టన్‌లోని రాక్ క్రీక్ పార్కులో గుర్రపుస్వారీలకు వెళుతుండేవారు.

**ప్రచార ఆర్భాటంలో..**

తాజాగా కాల్పులు జరిగిన హిల్టన్ హోటల్‌లోనే 1981లో నాటి అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్‌పై హత్యాయత్నం జరిగింది. నాడు భద్రతా సిబ్బంది ఆయనను నలువైపులా మూసిఉన్న గ్యారేజీ నుంచి నిష్క్రమించాలని కోరారు. రీగన్ వ్యక్తిగత సిబ్బంది దీన్ని వ్యతిరేకించారు. ఆ మార్గంలో వెళితే ఆయన మీడియాలో ఘనంగా కనిపించరని భావించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి రక్షణ లేని ఓపెన్ ఎయిర్ నిష్క్రమణ మార్గం గుండా వెళ్లేందుకు రీగన్ ఉపక్రమించారు. ఈ క్రమంలోనే కాల్పులకు గురయ్యారు. అయితే ఆయనకు ప్రాణహాని కలగలేదు.

**వారి మాట వినాల్సిందే..**

ప్రమాద సమయంలో అధ్యక్షుడిని కాపాడే సమయంలో అవసరమైతే దురుసుగా వ్యవహరించడానికి కూడా సీక్రెట్ సర్వీసు సిబ్బంది వెనకాడరు. వైట్‌హౌస్ కరెస్పాండెంట్ల విందులో కాల్పులు జరుగుతున్నప్పుడు భద్రతా అధికారులు ట్రంప్‌ను చుట్టుముట్టారు. ఆయనను హడావుడిగా తీసుకెళ్లిపోయారు. ఈ క్రమంలో ఆయన తుళ్లి పడబోయారు. మరో బృందం చప్పున రంగంలోకి దిగి.. ఇంకా కుర్చీలో కూర్చొనే ఉన్న ఉపాధ్యక్షుడు వాన్స్‌ను దాదాపు ఈడ్చుకెళ్లినంత పనిచేశారు. కాల్పుల సమయంలో తాను కొద్దిసేపు వేచి చూద్దామనుకున్నానని టంప్ ఆ తర్వాత తెలిపారు.



“చట్టాన్ని కాపాడే చేతులే... తమ కన్నీళ్లను దాచుకోవాల్సి వస్తే, అది ఒక్క వ్యక్తి ఓటమి కాద- వ్యవస్థలోని మౌన బాధల గాథ.” వికారాబాద్ జిల్లాలో వరుసగా రెండు నెలల వ్యవధిలో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు ఆత్మహత్యలకు పాల్పడటం, సమాజాన్ని కలవరపెడుతోంది. ఇతరుల సమస్యలకు పరిష్కారం చూపే పోలీస్ శాఖలోనే, మహిళా సిబ్బంది తమ బాధలను చెప్పుకోలేని పరిస్థితి ఎందుకు ఏర్పడింది? వేధింపులా... విధి ఒత్తిడా... లేక మానసిక వత్తిడా... అనే ప్రశ్నలు సమాధానం లేకుండా మిగిలిపోయాయి. మధ్యతరగతి కుటుంబాల నుంచి ఎంతో కష్టపడి ఉద్యోగం సాధించిన ఈ మహిళలు, తమ కుటుంబాలకు అండగా నిలవాల్సిన సమయంలోనే ఇలాంటి తీవ్ర నిర్ణయాలకు పాల్పడటం వెనుక ఉన్న అసలు కారణాలు ఇంకా వెలుగులోకి రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. నేరాలను ఛేదించే శాఖలోనే, మహిళా కానిస్టేబుళ్ల మానసిక ఆరోగ్యం, భద్రతపై ప్రశ్నలు తలెత్తడం విచారకరం. “సమస్యలతో వచ్చిన వారిని ఆదుకునే వారు... తమ సమస్యలతో ఒంటరిగా మిగిలిపోతే, అది సమాజం మొత్తం ఆలోచించాల్సిన విషయం” అనే భావన ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. ఈ ఘటనలు కేవలం సంఖ్యలు కాదు... రెండు కుటుంబాల ఆశలు, రెండు జీవితాల ముగింపు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, మహిళా సిబ్బందికి సురక్షితమైన వాతావరణం, కౌన్సిలింగ్ వ్యవస్థ, ధైర్యం చెప్పే మద్దతు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం అత్యవసరం.

# రాలిపోతున్న మహిళా కానిస్టేబుళ్లు



## రెండు నెలల వ్యవధిలో ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు ఆత్మహత్య

- రెండు నెలల్లో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ల మృతి.. పోలీస్ శాఖలో కలకలం
- విధి ఒత్తిడిల, మానసిక వేధింపులపై అనుమానాలు
- సమస్య పరిష్కరించే పోలీస్ శాఖలో మహిళ కానిస్టేబుల్ లో ఆత్మహత్యలపై సర్వత్ర చర్చ

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 29 (జనం సాక్షి ) :** మధ్యతరగతి మహిళల స్థితిగతులపై అధ్యయనం చేసి వారికి కొత్త మెరుగైన జీవితాన్ని అందివ్వాలని సంకల్పించిన మహిళ ఎస్పీ సొంత శాఖలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగుల జీవన విధానం వారు ఎదుర్కొంటున్న సమస్యల సవాళ్లు పై దృష్టి సారించడం లేదా అనే సందేహాలు జనంలో కలుగుతున్నాయి. నేరాలపై మంచి పట్టున్న ఎస్పీగా పేరుపొందిన అధికారి సొంత శాఖలో మధ్య తరగతి మహిళ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారి ఆత్మహత్యల వెనుక కుటుంబ సమస్యల లేక విధి నిర్వహణలో ఒత్తిడి లేక ఇంకేమైనా వేధింపులు మానసిక సమస్యల అనే విషయమై రూఢి చేసుకున్నట్లు కనిపించడం లేదు. మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేస్తున్న మహిళ ఎస్పీ ఉన్న జిల్లాలో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు రెండు నెలల వ్యవధిలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వీరి ఆత్మహత్యల వెనక బలమైన కారణం ఏమిటి అన్నది ఇప్పటికి ప్రశ్నార్థకంగా ఉంది. వివరాల్లోకి వెళితే వికారాబాద్ ధరూర్ పోలీస్ స్టేషన్ లో రైటర్ గా పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ దివ్య ఆత్మహత్య మరువకే ముందే జిల్లాలో మరో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడింది. జిల్లా హెడ్ క్వార్టర్స్ లో పనిచేస్తున్న తులసి బాయి ఇంట్లో ఎవరు లేరు సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జిల్లా మహిళా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన స్నేహమేహ్రా తర్వాత రెండు నెలల వ్యవధిలో ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించి చర్చకు దారి తీసింది. ఆత్మహత్యకు పాల్పడ్డ మహిళా కానిస్టేబుళ్లు వీరంతా ఒక సామాజిక వర్గానికి చెందిన మధ్యతరగతి మహిళలే. ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించిన వీరు ఆత్మహత్యలకు పాల్పడిన కారణంగా వారి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగి తేలుతున్నారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు.

జిల్లాలో ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు వారి సొంత ఇండ్లలోనే ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. వీరి ఆత్మహత్యల వెనుక బలమైన కారణాలు ఏమిటి అన్నది కుటుంబ సభ్యులకు పోలీసులకు అంతుచిక్కని ప్రశ్న. నేరాలపై వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా మంచి పట్టు ఉంది. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ వారికి అండగా ఉండే సంకల్పం కలిగిన అధికారిగా పేరు ఉంది. దురదృష్టం ఏమిటంటే ఆమె అధికారిగా పనిచేస్తున్న పోలీస్ శాఖ లోనే జిల్లాలో మొదటిసారిగా ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరి ఆత్మహత్యలపై ప్రజల్లో విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. పోలీస్ శాఖకు అమ్మగా ఉన్న ఎస్పీ స్నేహమేహ్రా కు మహిళా కానిస్టేబుళ్లు తమ సమస్యలు చెప్పుకుంటే సూచనలు కౌన్సిలింగ్ ద్వారా సమస్య పరిష్కరించడా నికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. కానీ పోలీస్ శాఖకు పెద్ద బాస్ వ్యక్తిగత సమస్యలు లేదా అధికారుల వేధింపులు లేదా డ్యూటీలో ఒత్తిడి లేదా మానసిక సమస్యలు ఏమైనా ఎలా చెప్పుకోవాలో తోచని స్థితిలో మహిళా కానిస్టేబుళ్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమస్య ఏదైనా క్రమశిక్షణ కలిగి ధైర్యంగా ఎదుటి వారి సమస్యలను పరిష్కరిస్తూ విధి నిర్వహణలో ఉండే మహిళా కానిస్టేబుళ్లు వారి సొంత సమస్యలు పరిష్కరించుకోకుండా ఆత్మహత్యలకు పాల్పడడంతో వారి కుటుంబాలకు కడుపు కోత మిగులుతుంది. సంఘటన జరిగినప్పుడు అధికారులు కేసు నమోదు చేసి వదిలేస్తున్నట్లు కనిపిస్తుంది. కానీ మహిళ కానిస్టేబుళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను లోతుగా అధ్యయనం చేసి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన దాఖలాలు చేసినట్లు కనిపించడం లేదు. ఏదైనా సమస్య వచ్చి అధైర్య పడకంటే ధైర్యంగా ఉండి విధులు నిర్వహించాలని మనోధైర్యాన్ని ఇచ్చే బాధ్యతను అధికారులు చేపట్టవలసిన అవసరం ఉంది. ఈ దిశగా అధికారులు అడుగులు వేయాలని జిల్లాలో మరో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడకుండా నివారించే యోచన చేస్తారని మరో కుటుంబానికి కడుపుకోత మిర్చకుండా చూస్తారని అందరం ఆశిద్దాం.

# సెక్రట్ హార్ట్ విద్యార్థుల ప్రభంజనం

- 577 మార్కులతో సి.హెచ్ తరుణ్ అగ్రస్థానం
- 500కు పైగా మార్కులతో 45 మంది ప్రతిభ





**మోత్కూర్, ఏప్రిల్ 29 (జనంసాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని సెక్రట్ హార్ట్ హైస్కూల్ విద్యార్థులు ఎస్ఎస్సి పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. మొత్తం 88 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాన్ని నమోదు చేశారు.
ఈ ఫలితాల్లో సి.హెచ్ తరుణ్ 577 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, పి. నీక్షిత, జి. ధాత్రిజ తలో 575 మార్కులతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారు. అదేవిధంగా 45 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. విద్యార్థుల ఈ విశిష్ట ఫలితాలపై పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ ఎం. తానయ్య, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. క్రమశిక్షణ, ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఉపాధ్యాయ బృందం కూడా శుభాకాంక్షలు తెలిపింది.

# మెరిసిన సాయి చైతన్య విద్యార్థుల ప్రతిభ

### అత్యుత్తమ మార్కులతో ముగ్గురు విద్యార్థుల మెరుగైన ప్రదర్శన





**మోత్కూర్, ఏప్రిల్ 29 (జనంసాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని సాయి చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయం సాధించారు. విద్యార్థులలో కె. అభినవ్ 557 మార్కులు సాధించగా, బి. హర్షిత్ 553, పి. నితిన్ 532 మార్కులు సాధించి పాఠశాల ఖ్యాతిని మరింత పెంచారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ వారి కృషి, పట్టుదలే ఈ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. విద్యార్థులు కూడా తమ విజయానికి గురువుల మార్గదర్శకత, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే ప్రతి విద్యార్థి ఇలాంటి విజయాలు సాధించగలదని, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయంతో పాఠశాల ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందగా, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

# యంగ్ ఇండియా సమీకృత గురుకుల

### పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సుదర్శన్ రెడ్డి



**బోధన్, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** బుధవారం బోధన్ మండలంలోని బేలాల్ గ్రామంలో 200 కోట్ల అంచనాల వ్యయం తో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వ సలహాదారు స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ తాను అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ లో ఉన్న స్థలం మంజూరు కావడం తన అదృష్టమని తెలిపారు. విద్యార్థులు ఈ గురుకుల పాఠశాలో చదువుకుని బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని అశిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని అధునాతన సౌకర్యాలతో వసతిని కల్పిస్తూ, ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అందరికీ ఆదర్శంగా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని కలెక్టర్ తెలిపారు. కాంట్రాక్టర్లు భవాన్ని నాణ్యతతో నిర్మించాలన్నారు. విద్యార్థులను కలవడానికి వచ్చే తల్లిదండ్రులకు ప్రత్యేక వసతి భవనం నిర్మించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 119 నియోజకవర్గాలలో మొదటి విడతలో గురుకుల పాఠశాల మంజూరు కావడం మన జిల్లాకు రావడం సంతోశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాకు పెద్ద పీటవేస్తుందన్నారు. జిల్లాలో 20 కోట్లతో పాఠశాలలో విద్యర్థుల కోసం మరుగుదోడ్లు నిర్మించుట జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాద్యయులు మంచి విద్యాను అందిస్తున్నారని విద్యార్థులు బాగా చదువుకొని మంచి ర్యాంకులు సాదించాలన్నారు. ఈ రోజు 10వ తరగతి పరిక్షలలో 600 మార్కులకు గాను 587మార్కులు సాదించిన విజయసాయి ను అభినందించారు. కెజీ నుండి 12 వరకు మంచి అవకాశమని తెలిపారు. ఈ సమావేశంలో ఉర్దు అకాడమి చైర్మన్ తాహేర్ బిన్ హందాన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ దిలిప్ కుమార్, ఆర్డిఓ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ తూము పద్మ, టిపిసిసి డెలిగేట్ గంగా శంకర్, బెల్లాల్, సర్పంచ్ రామావత్ రాజు, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# సిఎంసి కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ మూడవ సాధారణ సమావేశం



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం మూడవ సాధారణ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఏడు అభ్యర్థనలు ఆమోదం పొందినట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో క్రీడా ప్రాంతాల అభివృద్ధి, ఫ్లైఓవర్ అండర్పాస్ ల వద్ద బ్యూటిఫికేషన్ చేయడం, బోరబండ ప్రాంతంలో వర్షపు నీరు నిలవకుండా ఉండేలా రిటైనింగ్ వాల్స్ తో కూడిన బాక్స్ డ్రైన్ లను నిర్మించడం, ప్రశాంత్ నగర్ లో మోడల్ హిందూ స్మశాన వాటికను నిర్మించడం, వట్టినాగులపల్లి సర్వీస్ రోడ్డును గోపనపల్లి ఫ్లైఓవర్ కు అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మాణం అభివృద్ధి, క్రీడా అవకాశాల వినియోగం కోసం యూజర్ చార్జీల పెంపుదల వంటి కీలక విషయాల అభివృద్ధి విషయంలో అధికారులు సమన్వయంతో ముందుకు సాగి నిర్మాణాత్మక ఫలితాలను రాబట్టాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో సత్వర నిర్ణయాలపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందని స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సిఎంసి కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులకు సూచించారు.

# జనగణన విధులను పారదర్శకంగా నిర్వహించాలి

### అడిషనల్ డిస్ట్రిక్ సెన్సెస్ ఆఫీసర్ వెల్డి కిషన్ రావు



**గన్నేరువరం, ఏప్రిల్ 29 (జనంసాక్షి):** సెన్సెస్ 2027 లో భాగంగా దేశవ్యాప్తంగా మే 11 నుండి నిర్వహించే జనగణన కార్యక్రమంలో భాగంగా గన్నేరువరం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని అడిషనల్ డిస్టిక్ సెన్సెస్ ఆఫీసర్ వెల్ది కిషన్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన గణన ప్రక్రియలో భాగస్వాములైన ఎన్యూమరేటర్లు సూపర్వైజర్లు పారదర్శకంగా విధులను నిర్వహించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పలు ప్రభుత్వ పథకాలకు ఈ డాటా ఉపయోగపడుతుందని ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలియజేశారు. ఈసారి జన గణన పూర్తిగా డిజిటల్ మోడ్‌లో నిర్వహించబడుతుందని అన్ని వివరాలు మొబైల్ లోనే సేకరింపబడతాయని తెలిపారు. 26 ఏప్రిల్ నుండి సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమం ప్రారంభమైనదని ఇందులో ప్రజలు స్వచ్ఛందంగా తమ వివరాలు నమోదు చేసుకుంటే వారికి ఒక ఐడి కేటాయింపబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం తహశీల్దార్ కే. కనకయ్య, డిస్ట్రిక్ట్ ఇంచార్జీ తిరుపతి, మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామయ్య,ఎంపిఎస్ఓ సాగర్, గిర్దావర్ రఘు,టీఏ అనిల్, ఫీల్డ్ ట్రైనర్లు ఈ.మల్లేశం, చంద్రశేఖర్ ,రెవెన్యూ సిబ్బంది, ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

### మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



**మల్కాజిగిరి, ఏప్రిల్ 29(జనంసాక్షి) :** వేసవి కాలం దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు మల్కాజిగిరి 183 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు.ఆనంద్‌బాగ్ చౌరస్తా, మల్కాజిగిరి చౌరస్తా వద్ద డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు గోగికర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై, చలివేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు తీవ్రంగా ఉన్న తరుణంలో బాటసారుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. సామాజిక బాధ్యతగా చలివేంద్రాన్ని ఏర్పాటు చసిన వారిని ఆ పార్టీ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బికె. శ్రీనివాస్, గుండా నిరంజన్ జిఎన్‌వి సతీష్, పిట్టల నాగరాజు, చరణ్‌జిత్, రవీందర్ రెడ్డి, నిరుగొండ నాగేందర్, సంజయ్, మహేందర్, కుమార్,రాజు, చారి, అసిమ్, భూదేవి, ఇంద్ర, రవీంద్ర, పార్థసారథి,తదితరులు పాల్గొన్నారు.


# పదిలో కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రభంజనం


### పాఠశాల ప్రధానోపాధ్యాయులు,మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్.

**తాండూరు ఏప్రిల్ 29 ( జనంసాక్షి) :** పదవతరగతి పలితాలాలో కృష్ణవేణి కాన్సెప్ట స్కూల్ ప్రభంజనం సృష్టించింది.బుధవారం వేలువడిన పదిపలితాలలో కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్, తాండూరు మరోసారి అత్యధిక స్కోరు 592 మార్కులను సాధించడం ద్వారా దాని మునుపటి రికార్డు 586 మార్కులను అధిగమించడం ద్వారా తన స్థిరమైన విద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్, డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు మరియు సిబ్బందిని ఈ అత్యుత్తమ విజయం వైపు నడిపిస్తూ ముందుండి నడిపించారు. ఈ విశేషమైన సాఫల్యం విద్యార్థుల అంకితభావం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం మరియు తల్లిదండ్రుల నిరంతర మద్దతును ప్రతిబింబిస్తుందన్నారు. పాఠశాల సగర్వంగా విద్యాపరమైన ప్రకాశం, శ్రేష్ఠత యొక్క సంప్రదాయాన్ని కొనసాగిస్తుందని వేల్లడించారు.

# ఫలితాలే చెప్పుతున్నాయి... ‘అక్షర’ విజయం!

- 100% ఉత్తీర్ణతతో మరోసారి సత్తా చాటిన విద్యార్థులు
- రాష్ట్రస్థాయి మార్కులతో ప్రతిభావంతుల మెరుపులు









**మోత్కూరు, ఏప్రిల్ 29 (జనం సాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని అక్షర విద్యాసంస్థలు ఎస్ఎస్సీ-2026 ఫలితాలలో మరోసారి తమ ప్రతిభను చాటుతూ ఘన విజయాన్ని నమోదు చేసుకున్నాయి. ఈ ఏడాది నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం మాత్రమే కాకుండా, మండల టాపర్స్‌గా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందాయి. విద్యార్థులు సాధించిన అత్యున్నత మార్కులు సంస్థ ప్రతిష్టను మరింత పెంచాయి. ఈ ఫలితాలలో కె. రాధ 579/600 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, డి. అర్చన 575 మార్కులు, కె. సాయి సూరజ్ 572 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. అలాగే ఎస్. స్వాతిక 560, డి. సాయినాథ్ 556, బి. సిరి 552, ఎస్. సృజన 552 మార్కులు సాధించి సంస్థకు మరింత కీర్తి తీసుకువచ్చారు. ఈ విజయంతో అక్షర విద్యార్థులు మండలంలోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా గుర్తింపు పొందారు. విద్యార్థుల ఈ అద్భుత ఫలితాలపై అక్షర విద్యాసంస్థల డైరెక్టర్లు ఎం. రాజిరెడ్డి, ఎం. శివాని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం కలిసి ఈ విజయాన్ని సాధ్యంచేశాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయంతో మోత్కూర్ ప్రాంతంలో అక్షర విద్యాసంస్థ మరోసారి అగ్రస్థానంలో నిలిచిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యుత్ షాక్‌తో లైన్మెన్‌కు ప్రాణాపాయం

### ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల సమయంలో ప్రమాదం

- మంటల్లో కాలిన నాగబాబు... పరిస్థితి విషమం
- ఇటీవలే మరో లైన్మెన్ మృతి... సిబ్బందిలో భయం
- అధికారుల నిర్లక్ష్యంపై కార్మికుల ఆగ్రహం



**నిజాంపేట్, ఏప్రిల్ 29 (జనం సాక్షి):** విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండగా లైన్మెన్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో లైన్మెన్ నాగబాబు శరీరమంతా కాలిన గాయాలతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని డిపోచంపల్లి విద్యుత్ కార్యాలయ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా నాగబాబు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై మంటలు చెలరేగడంతో ఆయన శరీరమంతా మంటలు అంటుకుని తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే సహచరులు స్పందించి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.
ఇటీవలే ఈనెల 20న బహదూర్‌పల్లిలో శ్రీనివాస్‌రావు అనే లైన్మెన్ కూడా ట్రాన్స్‌ఫార్మర్‌పై పని చేస్తూ విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాజాగా మరో ఘటన జరగడంతో విద్యుత్ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇలాంటి ప్రమాదాలకు తగిన భద్రతా చర్యలు లేకపోవడమే కారణమని సిబ్బంది ఆరోపిస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# పెంపుడు జంతువుల కోసం న్యూట్రిషన్ సప్లిమెంట్స్



**ఖైరతాబాద్, ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** సైన్స్ ఆధా రిత పెంపుడు జంతువుల సంరక్షణ స్టార్టప్ అయి న న్యూట్రిషన్ ఎన్.ఎక్స్.టీ తమ ప్రీమియం ఫిలైన్ న్యూట్రిషన్ శ్రేణి అయిన ‘పేరెంట్’ కిటెన్, అడల్ట్ ఫుడ్‌ను, కుక్కల కోసం ప్రత్యేకమైన సాఫ్ట్ చూ ట్రీ ట్స్ అయిన ‘ బోనస్’ తో పాటుగా విడుదల చేసి నట్లు న్యూట్రిషన్ ఎన్.ఎక్స్.టీ వ్యవస్థాపకుడు, సీ ఈఓ ప్రహర్ష చెరుకూరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు జం తువులు ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటూ ఎక్కు వ కాలం జీవించే ప్రపంచాన్ని పెంపొందించడమే మా కంపెనీ లక్ష్యం అన్నారు. కొత్తగా విడుదల చేసిన ఈ ఉత్పత్తులు, పెంపుడు జంతువుల జీవితం లోని ప్రతి దశలో వాటి ప్రత్యేక పోషకాహార అవస రాలకు మద్దతు ఇచ్చేలా రూపొందించ బడ్డాయని తెలిపారు. పేరెంట్ ఫిలైన్ శ్రేణిలో ట్యూనా-ఫ్లేవర్డ్ కిటెన్ ఫార్ములా ఉందన్నారు. ఎదుగుదల కోసం అధిక బయోఅవైలబుల్ ప్రోటీన్, మేక పాలతో స మృద్ధి చెందిందన్నారు. పెంపుడు జంతువుల మా రుతున్న అవసరాలను తీర్చే సమతుల్య, లక్షిత ఆహారాలను రూపొందిస్తున్నామని తెలిపారు.




# అగ్నిగుండంలా రామగుండం

## ఎండ తాకిడికి మండుతున్న పారిశ్రామిక 'ఖని'

- ఉదయం 10 తర్వాత నిర్మానుష్యంగా వీధులు
- దుకాణాలకు తాళాలు.. వ్యాపారులకు తీవ్ర నష్టాలు
- 46 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు.. కార్మికులకు కష్టకాలం





**గోదావరిఖని, ఏప్రిల్ 29 (జనంసాక్షి):** రాష్ట్రంలో ఎండలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం అగ్నిగుండంలా మారింది. ఉదయం నుంచే మండుతున్న ఎండల ప్రభావంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతుండగా, ఉదయం 10 గంటలు దాటిన వెంటనే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాధారణంగా రద్దీగా ఉండే వీధులు వెలవెలబోతుండగా, పట్టణంలోని ప్రధాన బజార్లు మధ్యాహ్నానికి పూర్తిగా ఖాళీ అవుతున్నాయి.
ఎండల తీవ్రత కారణంగా వ్యాపార కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కస్టమర్లు రాకపోవడంతో వ్యాపారులు నిరాశ చెందుతుండగా, చిన్న వ్యాపారులు రోజువారీ ఆదాయం తగ్గిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణాలకు తాళాలు వేసి మధ్యాహ్నం వ్యాపారం నిలిపివేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే కార్మికులు ఎండ వేడికి విలవిల్లాడుతున్నారు. కోల్ మైన్స్, ఓసిపిలలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎండలో పని చేయలేక అలసట, దాహం, తలనొప్పి వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది మధ్యాహ్న వేళల్లో పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఉష్ణోగ్రతలు 40 నుంచి 46 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.
వృద్ధులు, చిన్న పిల్లలు ఇళ్లకే పరిమితం అవుతుండగా, అవసరం లేకుండా బయటకు వెళ్లకూడదని వైద్యులు సూచిస్తున్నారు. తగినంత నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, వేడి నుంచి రక్షణ చర్యలు పాటించడం అవసరమని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఎండల ప్రభావంతో కూలర్లు, ఏసీలకు డిమాండ్ పెరిగింది. ఎలక్ట్రానిక్ దుకాణాల వద్ద ప్రజలు బారులు తీరుతుండగా, పాత కూలర్లు, ఏసీలను మరమ్మతులు చేయించుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. సింగరేణి యాజమాన్యం కార్మికుల కోసం మజ్జిగ, షామియానాలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ ఎండల తీవ్రత తగ్గకపోవడంతో ఆందోళన కొనసాగుతోంది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మే, జూన్ నెలల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు తమ పనులను ఉదయం వేళల్లోనే పూర్తిచేసుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచిస్తున్నారు.

# లేబర్ కోడ్‌ల రద్దుకై మేడే స్ఫూర్తితో పోరాటాలు

- నాలుగు లేబర్ కోడ్‌ల అమలును అడ్డుకోవాలి
- 8 గంటల పనిదినం 12 గంటలకు పెంపు ఆరోపణ
- సింగరేణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్
- మే మొదటి వారంలో పరిష్కారం లేకుంటే సమ్మె హెచ్చరిక




**గోదావరిఖని, ఏప్రిల్ 29 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం మేడే స్ఫూర్తితో ఉద్యమాలు చేపడతామని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్ తెలిపారు. గోదావరిఖనిలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నవంబర్ 2025లో నోటిఫికేషన్ జారీ చేసి 2026 ఏప్రిల్ నుంచి ఈ కోడ్‌ల అమలు దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. అయితే తెలంగాణలో ఇవి అమలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల పనిదినం 8 గంటల నుంచి 12 గంటలకు పెరిగే ప్రమాదం ఉందని, యూనియన్ల హక్కులు తగ్గిపోతాయని, కార్మికుల భద్రతకు భంగం కలుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీతాల పెంపు వంటి అంశాల్లో చర్చించే అవకాశాలు కూడా తగ్గిపోతాయని, కార్మికులు యాజమాన్యాల దయాధాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుందని విమర్శించారు. పాత 29 కార్మిక చట్టాలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యాన్ని కోరారు.
సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను మే మొదటి వారంలోగా పరిష్కరించాలని, లేకుంటే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెకు పిలుపునిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. మెడికల్ బోర్డు నిలిపివేయడం వల్ల వేలాది మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, మెడికల్ అన్‌ఫిట్ కార్మికులకు సంబంధిత సదుపాయాలు కల్పించాలన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల మంజూరు, మారుపేర్ల కేసుల పరిష్కారం, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ భారం యాజమాన్యం భరించడం వంటి డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. సింగరేణి సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ స్పష్టమైన ముందడుగు పడలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేదంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి, సీపీఐ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దు: చాడ వెంకటరెడ్డి




**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 29 (జనం సాక్షి) :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు పండించిన వరి, మొక్కజొన్న పంటలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించాలని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం నాగెల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగినట్లు జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, వరి కోతల సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎండాకాలంలో సాగునీరు సరిగా అందక పంటలు ఎండిపోవడం వల్ల దిగుబడులు తగ్గి రైతులు ఇప్పటికే నష్టాల్లో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, గతంలోలాగా కాకుండా రైతులే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించి అప్పగించాల్సిన పరిస్థితి నెలకొనడం వల్ల ఇబ్బందులు పెరిగాయని తెలిపారు. మిల్లర్లు హమాలీ కొరతను సాకుగా చూపుతూ ధాన్యం అన్‌లోడ్ చేయకుండా రైతులను వేధిస్తున్నారని విమర్శించారు. ఆన్‌లైన్ విధానంతో మిల్లుల కేటాయింపు జరగడం వల్ల ఈ సమస్యలు ఉత్పన్నమయ్యాయని, పౌర సరఫరాల శాఖ లేదా సహకార సంఘాల ద్వారా ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపితే రైతులకు మేలు జరుగుతుందని సూచించారు. ఈ సమస్య ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్య అని ఆయన పేర్కొన్నారు. వరి మాత్రమే కాకుండా మక్కల కొనుగోలు ఆలస్యం జరిగినా రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని తెలిపారు. అకాల వర్షాలు పడితే వడ్లు తడిసి రైతులకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
రైతుల జీవనోపాధి దెబ్బతినకుండా ఉండాలంటే ప్రభుత్వం వెంటనే స్పందించి పంటలను కొనుగోలు చేసే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ధర్నాలు, నిరసనలు చేపడతామని చాడ వెంకటరెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, నాగెల్లి లక్ష్మారెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.

# పారడైజ్ పాఠశాల విద్యార్థుల రాష్ట్రస్థాయి ప్రతిభ

## ఎస్ఎస్సి 2026లో మెరిసిన విద్యార్థులు




**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** ఎస్ఎస్సి 2026 ఫలితాలలో కరీంనగర్‌లోని రేకుర్తి పారడైజ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ విషయాన్ని పాఠశాల చైర్మన్ డాక్టర్ పి. ఫాతిమా రెడ్డి వెల్లడించారు. విద్యార్థులలో వి. సాయిప్రేమ్ 591 మార్కులు సాధించగా, షిఫా తమన్నా 586, వి. అశ్విని మరియు బి. సాహితీ 584 చొప్పున, బి. సుధీష్ణ 579, బి. లక్ష్మీ ప్రసన్న 578 మార్కులు సాధించారు. అలాగే ఎన్. స్ఫూర్తి రెడ్డి, బి. నక్షత్ర 574 చొప్పున, సానియా 573, బి. జిషిత, ఎస్. శ్రీదేవి 570 చొప్పున మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత ఫలితం గా ఈ విజయాలు సాధ్యమయ్యాయని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ డా. పి. ఫాతిమా రెడ్డి, ప్రిన్సిపాల్ టీ. వసంత, వైస్ ప్రిన్సిపాల్ ఏ. మధు, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# టీడీపీ జాతీయ కార్యవర్గానికి శుభాకాంక్షలు

## నూతన నాయకత్వానికి వంచ శ్రీనివాస్ రెడ్డి అభినందనలు

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** తెలుగుదేశం పార్టీ జాతీయ నూతన కార్యవర్గానికి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు వంచ శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన నాయకులు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్ బాబు, పొలిట్ బ్యూరో సభ్యులుగా బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్, జాతీయ అధికార ప్రతినిధులుగా నన్నూరి నర్సిరెడ్డి, తిరునగిరి జ్యోష్ణలకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం దిశగా కొత్త నాయకత్వం మరింత కృషి చేసి ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని ఆకాంక్షించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల తరఫున ఆయన ఈ శుభాకాంక్షలు తెలిపారు.




# మెరిసిన పారమిత విద్యార్థులు

## పదవ తరగతిలో అద్భుత ఫలితాలు.. 100% ఉత్తీర్ణత

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** పదవ తరగతి 2025-26 ఫలితాలలో కరీంనగర్‌లోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు మరోసారి అత్యున్నత ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. 30 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న ఈ విద్యాసంస్థకు ఈ ఫలితాలు యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులకు ఆనందాన్ని కలిగించాయి. ఈ ఫలితాలు పారమిత స్టేట్ బోర్డు బ్రాంచ్‌కు సంబంధించినవిగా ఉండగా, ప్రతి విద్యార్థి ప్రతిభను మెరుగుపరచడం పాఠశాల ప్రధాన లక్ష్యమని మరోసారి నిరూపితమైంది. ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది.
విద్యార్థులలో రాచమల్ల ఆధ్య, రామక కార్తికేయ తలో 583 మార్కులు సాధించగా, గట్టు సంప్రీతి 582 మార్కులతో ప్రతిభ కనబరిచారు. మొత్తం 84 మంది విద్యార్థులు 90 శాతం పైగా, 173 మంది 80 శాతం పైగా, 198 మంది 70 శాతం పైగా మార్కులు సాధించారు. అలాగే 99 శాతం విద్యార్థులు 60 శాతం పైగా ఫలితాలు సాధించడం విశేషం. గణితం, సాంఘీక శాస్త్రం, తెలుగు వంటి సబ్జెక్టుల్లో 100కు 100 మార్కులు సాధించగా, ఆంగ్లం, సైన్స్‌లో 99, హిందీలో 98 మార్కులు సాధించి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. పాఠశాలకు సహకరించిన తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలులో గింజ కటింగు ఉండదు

- మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లు
- కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతు ప్రభుత్వం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**సుల్తానాబాద్, ఏప్రిల్ 29 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గింజ కటింగ్ అనేది ఉండదని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు స్పష్టం చేశారు. బుధవారం ఓదెల మండల కేంద్రంలో సింగిల్ విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్లు, మక్కల కొనుగోలు కేంద్రాలను ఆయన రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. గతంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందుగానే కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.
మొక్కజొన్నకు క్వింటాకు రూ.2,400 మద్దతు ధర నిర్ణయించామని, మార్క్‌ఫెడ్ ద్వారా వ్యవసాయ మార్కెట్ కమిటీలు, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపడుతున్నామని వెల్లడించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 22 వేల ఎకరాల్లో సాగు చేసిన మక్కజొన్నను పూర్తిగా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. గతంలో బస్తాకు 5 నుంచి 10 కిలోల వరకు కటింగ్ చేసి రైతులను నష్టపరిచారని విమర్శించిన ఆయన, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. తడిసిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని కూడా రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు.
రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి సమస్యలు పరిష్కరించి ఒక్క గుంట భూమి కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదు

- తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వాన్ని కోరిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమీక్ష సమావేశం



**ముషీరాబాద్, ఏప్రిల్ 29 (జనం సాక్షి):** తెలంగాణలో గానీ, దేశంలో గానీ పెట్రోల్, డీజిల్ మరియు గ్యాస్ కొరత లేదనీ, ప్రజలు భయాందోళనలకు గురికావల్సిన అవసరం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ మేరకు బుధవారం పెట్రోల్, డీజిల్ మరియు గ్యాస్ సరఫరా, లభ్యతల పై ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులతో రాజ్ భవన్ లోని దిల్ కుషా గెస్ట్ హౌస్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో, హైదరాబాద్ నగరంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. డిమాండ్ కు అనుగుణంగా సరఫరాను భారీగా పెంచినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు 6,400 కిలోలీటర్ల సరఫరా ఉండగా, ప్రస్తుతం దానిని 10,300 కిలోలీటర్లకు పెంచారనీ, నగరంలో సరఫరాను 3,200 నుండి 6,400 కిలోలీటర్లకు (రెట్టింపు) పెంచారన్నారు. సాధారణంగా 8,000 కిలోలీటర్లు ఉండగా, ప్రస్తుతం 15,500 నుండి 19,300 కిలోలీటర్ల వరకు సరఫరా చేస్తున్నారనీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4,325 పెట్రోల్ బంకుల్లో, కేవలం 106 అవుట్‌లెట్లలో మాత్రమే సాంకేతిక కారణాల వల్ల (ట్రాన్స్‌పోర్ట్, ఇండెంట్ ఆలస్యం) స్టాక్ తాత్కాలికంగా అందుబాటులో లేదనీ, సాయంత్రానికి ఈ సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. పెద్ద మొత్తంలో ఇంధనం వాడే 'బల్క్ యూజర్లు' రిటైల్ బంకుల వద్దకు రావడం వల్ల సామాన్య వినియోగదారులకు ఇబ్బంది కలుగుతోందనీ, బల్క్ యూజర్లు తమకు కేటాయించిన ప్రత్యేక సరఫరా వ్యవస్థ ద్వారానే ఇంధనాన్ని పొందాలని కోరారు. ఎల్పీజీ విషయంలో నూ ఎలాంటి కొరత లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు తగినంత సరఫరా చేస్తున్నాయనీ, చిన్న వ్యాపారులు తమ అవసరాల కోసం 5 కిలోల సిలిండర్లను వాడుకోవచ్చని సూచించారు. ధరలు పెరుగుతాయని, సరఫరా ఆగిపోతుందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వల్ల ప్రజలు అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారని, దీనివల్ల కృత్రిమ కొరత ఏర్పడుతోందని పేర్కొన్నారు. ధరల పెంపుపై ఎలాంటి నిర్ణయం లేదని మంత్రి స్పష్టతనిచ్చారు. పెట్రోల్, డీజిల్ ను ఇళ్లలో నిల్వ చేసుకోవద్దనీ, ఇది ముఖ్యంగా వేసవిలో చాలా ప్రమాదకరమనీ సూచించారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని కోరారు.

### పుకార్లతో పెట్రోల్ బంకుల వద్ద రద్దీ

**ఉప్పల్ :** నగరంలో ఇంధన కొరత ఏర్పడిందన్న పుకార్లు సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించడంతో ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్ ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద అసాధారణ రద్దీ నెలకొంది. ఒక్కసారిగా వాహనదారులు పెద్ద సంఖ్యలో బంకుల వద్దకు చేరుకోవడంతో కార్లు, బైకులతో పొడవాటి క్యూలు ఏర్పడ్డాయి. ఈ రద్దీ ప్రభావంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ తీవ్రంగా ప్రభావితమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో వాహనాల క్యూలు రోడ్డుమీదకే రావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కార్యాలయ సమయాల్లో రద్దీ మరింత పెరగడంతో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుని వాహనాలను నియంత్రిస్తున్నారు. అయితే నగరంలో పెట్రోల్, డీజిల్ కొరత ఏమీ లేదని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు. సాధారణంగా ఇంధన సరఫరా కొనసాగుతోందని పేర్కొంటూ, సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించకుండా, అనవసరంగా బంకుల వద్ద రద్దీ సృష్టించవద్దని అధికారులు హెచ్చరించారు.




## పెట్రోల్ బంకుల్లో ఏసిపి ఆకస్మిక తనిఖీలు

### కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు

**మల్కాజిగిరి,ఏప్రిల్ 29(జనంసాక్షి) :** మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, వాహనదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మల్కాజిగిరి, నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పెట్రోల్ బంకుల్లో ఆయన సివిల్ సప్లై అధికారులు,స్థానిక సిఐలతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ వస్తు న్న పుకార్ల నేపథ్యంలో అధికారులు ఈ సోదాలు చేపట్టారు. బంకుల్లోని స్టాక్ రిజిస్టర్లను, నిల్వ సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఏ బంకులోనూ ఇంధన కొరత లేదని, సాధారణ సరఫరా కొనసాగు తోందని తనిఖీల్లో తేలింది, సోషల్ మీడియాలో లేదా ఇతర మార్గాల్లో వస్తున్న తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు భయాందోళనలకు గురికావొద్దు. ఎవరైనా కావాలని కృత్రిమ కొరత సృష్టించినా లేదా బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసు కోవద్దని, బంకుల వద్ద అనవసర రద్దీని తగ్గించాలని అధికారులు కోరారు.

# సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థుల విజయదుందుభి

- పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత
- జిల్లా టాపర్‌గా కె. విశ్వక్సేన్ (592 మార్కులు)
- ఐఐటీ, నీట్‌లోనూ ముందంజలో సిద్ధార్థ : చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి




**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** కరీంనగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు పదవ తరగతి పరీక్షల ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచి విజయదుందుభి మోగించారు. మొత్తం 452 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, 592 మార్కులు సాధించిన కె. విశ్వక్సేన్ జిల్లా టాపర్‌గా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందాడన్నారు. 570 మార్కులకు పైగా 31 మంది, 560 మార్కులకు పైగా 74 మంది, 550 మార్కులకు పైగా 122 మంది విద్యార్థులు ప్రతిభ కనబరచడం సంస్థకు గర్వకారణమని తెలిపారు. మూడున్నర దశాబ్దాలుగా కొనసాగుతున్న సిద్ధార్థ విద్యాసంస్థల ప్రస్థానంలో ప్రతి నలుగురిలో ఒకరు 550కు పైగా మార్కులు సాధించడం విశేషమని పేర్కొన్నారు. విద్యతో పాటు ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల్లోనూ సిద్ధార్థ విద్యార్థులు ముందంజలో ఉండటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన ఆయన, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, విద్యాసంస్థకు పేరు తీసుకురావాలని సూచించారు. డైరెక్టర్ స్వప్న శ్రీపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# వడ దెబ్బతో వ్యక్తి మృతి

**ఎలిగేడు,ఏప్రిల్ 29(జనంసాక్షి) :** మండలం లోని లాలపల్లి గ్రామానికి చెందిన యాళ్ల మల్లారెడ్డి (52) బుధవారము ఎండ తీవ్రతతో వడ దెబ్బ తగిలి మృతి చెందినట్లు గ్రామ ప్రజలు తెలిపారు.ఇంటి పెద్ద మరణంతో కుటుంబానికి తీరని బాధలు ,దుఃఖం మిగిలినట్లు గ్రామస్తులు తెలిపారు.మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ నాయకులు ,ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు.మృతునికి భార్య లత,కూతురు కిరణ్మయి, కుమారుడు అర్జున్ రెడ్డి ఉన్నారు.

# మంత్రి సీతక్కకు ఉత్తమ సేవా పురస్కారం

**సీతక్కకు పురస్కారం అందజేసిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు**



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 29(జనంసాక్షి) :** శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన ఈ ఘన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మంత్రి సీతక్కకు ఈ పురస్కారాన్ని అందజేశారు. వేలాది మంది విద్యార్థుల సమక్షంలో మంత్రి సీతక్క ఈ గౌరవాన్ని అందుకోవడం విశేషంగా నిలిచింది. ప్రజాసేవలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం మంత్రి సీతక్క అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొని మంత్రి సీతక్క సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడ గౌరవంగా భావిస్తున్నానని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజాసేవలో సుదీర్ఘ అనుభవం కలిగిన వెంకయ్య నాయుడు గారంటే అందరికీ గౌరవమని, ఆయన సూచనలు దేశానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ సాధనతోనే విజయాలు సాధ్యమని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని కృషి చేయాలని సూచించారు. విద్యార్థి దశలో కష్టపడితే జీవితాంతం గౌరవంగా జీవించవచ్చని, ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. చదువు మనిషి ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, విద్యే శాశ్వతమని, దానిని ఎవరూ దొంగిలించలేరని స్పష్టం చేశారు. తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, పదో తరగతితో చదువు ఆపిన తాను తరువాత మళ్లీ విద్యను కొనసాగించి ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ పూర్తి చేశానని తెలిపారు. ప్రజాసేవలో కొనసాగుతూనే చదువును ఎక్కడా ఆపలేదని పేర్కొన్నారు. ములుగు జిల్లా పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో తొలి స్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. టీచర్లు క్రమశిక్షణతో పాఠాలు బోధించడం, అప్పటి జిల్లా కలెక్టర్ దివాకర్ మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సుప్రసిద్ధ జర్నలిస్ట్ వెంకట్ నారాయణతో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

# ఫార్మాసిస్ట్ పోస్టుల ఫలితాల విడుదల ఆలస్యం

- హైకోర్టు తీర్పు వెలువడకుండా ఫలితాలు ప్రకటిస్తే రిక్రూట్‌మెంట్ రద్దయ్యే ప్రమాదం
- అభ్యర్థులు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేసిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు
- హైకోర్టులో కేసును పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండడం వల్లే ఫార్మసిస్ట్ పోస్టుల ఫలితాల విడుదలలో ఆలస్యం జరుగుతోందని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. హైకోర్టు తుది తీర్పు వెలువడకుండా ఫలితాలు ప్రకటిస్తే, రిక్రూట్‌మెంట్ పూర్తిగా రద్దు అయ్యే ప్రమాదం ఉందని వెల్లడించింది. ఈ విషయాన్ని ఫార్మసీ అభ్యర్థులు అర్థం చేసుకోవాలని బోర్డు విజ్ఞప్తి చేసింది. కోర్టు తుది తీర్పు తర్వాతే ఫలితాలను వెల్లడిస్తామని బుధవారం ఓ ప్రకటనలో బోర్డు స్పష్టం చేసింది. 732 ఫార్మసిస్ట్ (గ్రేడ్ 2) పోస్టులకు 24 సెప్టెంబర్ 2024న నోటిఫికేషన్ విడుదల చేయగా, 27,101 దరఖాస్తులు వచ్చాయని బోర్డు వెల్లడించింది. ఈ నియామక ప్రక్రియలో మొత్తం 100 మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందని.. అందులో 80 మార్కులు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)కు, మరో 20 మార్కులు కాంట్రాక్ట్ లేదా అవుట్‌సోర్సింగ్ సేవల అనుభవానికి కేటాయించామని బోర్డు వివరించింది. కంప్యూటర్ బేస్డ్ టెస్టును 2024 నవంబర్‌లో నిర్వహించామని, డిసెంబర్‌లో ప్రిలిమినరీ కీ విడుదల పరీక్షను 30 నవంబర్ 2024న నిర్వహించారు. ప్రిలిమినరీ కీ విడుదల చేసి, 2025 మే నెలలో ఫలితాలను ప్రకటించామని గుర్తు చేసింది. కాంట్రాక్ట్ , అవుట్‌సోర్సింగ్ సర్వీస్‌కు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కూడా పూర్తి అయిందని వెల్లడించింది. ఇదే సమయంలో, కొంతమంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఫార్మసిస్టులు ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తూనే ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కూడా ఫార్మసిస్టులుగా నమోదు అయ్యారని ఆరోపిస్తూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. అలాంటి అభ్యర్థులకు వెయిటేజ్ మార్కులు ఇవ్వడం వల్ల ఇతర అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని, ఫార్మసీ చట్టం, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టంలోని నిబంధనలకు ఇది విరుద్ధమని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టు స్పందిస్తూ.. హైకోర్టు తుది తీర్పునకు లోబడే రిక్రూట్‌మెంట్ నిర్వహించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశంపై ప్రభుత్వం న్యాయ నిపుణుల అభిప్రాయం కోరగా, విషయం ప్రస్తుతం హైకోర్టు పరిధిలో ఉండి మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉన్నందున తదుపరి కోర్టు ఆదేశాలను అనుసరించడం సముచితమని న్యాయ నిపుణులు సూచించారు. దీంతో, భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు హైకోర్టు తుది తీర్పు వెలువడిన తర్వాతే, ఫలితాలు విడుదల చేయాలని నిర్ణయించినట్టు బోర్డు వెల్లడించింది. ఈ అంశాన్ని అభ్యర్థులు సానుకూల దృక్పథంతో అర్థం చేసుకోవాలని బోర్డు విజ్ఞప్తి చేసింది. ఈ రెండున్నర సంవత్సరాల్లో ఆరోగ్యశాఖలో సుమారు 12,650 పోస్టుల భర్తీ జరిగిందని బోర్డు గుర్తు చేసింది. హైకోర్టులో తుది తీర్పు వెలువడేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని బోర్డు తెలిపింది. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే వారిని నమ్మి మోసపోవద్దని, పూర్తిగా మెరిట్ బేసిస్‌పైనే ఉద్యోగాల భర్తీ ఉంటుందని బోర్డు స్పష్టం చేసింది. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి పూర్తి వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నామని గుర్తు చేసింది. ఒకటికి రెండుసార్లు అభ్యంతరాల స్వీకరణ, నివృత్తి అనంతరమే ఫలితాలు ప్రకటిస్తామని స్పష్టం చేసింది.

# సరస్వతి అంత్య పుష్కరాల పోస్టర్ ఆవిష్కరణ

- ఏర్పాట్లపై మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ సమీక్ష



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు సంబంధించి బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు. పుష్కరాల నిర్వహణలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలు, రవాణా, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు జరగనున్న పుష్కరాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున చేపట్టిన ఏర్పాట్లును త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సరస్వతి అంత్య పుష్కరాల పోస్టర్, పుష్కరాల టీజర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ధార్మిక సలహా దారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు.

## ఆకివీడు రామాలయ కేసు డిస్పోజ్ చేసిన హైకోర్టు

**అమరావతి, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** ఆకివీడు రామాలయంపై వేసిన పిల్‌ను ఏపీ హైకోర్టు డిస్పోజ్ చేసింది. ఇదే అంశంపై ఇప్పటికే హైకోర్టులో మరో బెంచ్ ముందు రిట్ పిటిషన్‌తో పాటు కోర్టుధిక్కరణ పిటిషన్ కూడా పెండింగ్‌లో ఉన్నాయని కోర్టు తెలిపింది. అక్కడే తేల్చుకోవాలని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ పిల్‌ను ముందుగా డిస్మిస్ చేస్తామని హైకోర్టు చెప్పగా.. పిల్ తరఫున హాజరైన న్యాయవాది శ్రవణ్ కుమార్ డిస్పోజ్ చేయాలని అభ్యర్థించారు.

## రీజెన్సీ సిరామిక్ వ్యవస్థాపకుడు జీఎన్ నాయుడు కన్నుమూత



**యానాం, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** ప్రముఖ పారిశ్రామికవేత్త, యానాం రీజెన్సీ గ్రూపు ఆఫ్ కంపెనీస్ అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు(87) కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. 1983లో రీజెన్సీ సెరామిక్స్‌ను జీఎన్ నాయుడు ప్రారంభించారు. యానాంలోని రీజెన్సీ సెరామిక్స్ కంపెనీలో గతంలో భారీ విధ్వంసం చోటు చేసుకుంది. 2012 జనవరిలో కార్మికులు తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. ఆ సమయంలో కార్మిక సంఘం నాయకుడి మృతితో మిగతా కార్మికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ప్లాంట్‌లోకి ప్రవేశించి పెను విధ్వంసం సృష్టించారు. పరిశ్రమలోని వాహనాలు, యంత్రాలకు నిప్పు పెట్టి ధ్వంసం చేశారు. కంపెనీ రికార్డులను తగలబెట్టారు. ఈ ఘటనలో రీజెన్సీ కంపెనీ ప్రెసిడెంట్ కేసీ చంద్రశేఖర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ హింసాత్మక ఘటన కారణంగా రీజెన్సీ సెరామిక్స్ కంపెనీ లాకౌట్ ప్రకటించింది. దాదాపు దశాబ్దం పాటు మూతపడిన ఈ కంపెనీని 2024లో తిరిగి పునరుద్ధరించారు.

# ఖైదీల్లో పరివర్తనే లక్ష్యంగా పనిచేయాలి

## రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి

- చంచల్ గూడ సికాలో ఢిల్లీ జైళ్ల సిబ్బందికి శిక్షణ ప్రారంభం




**హైదరాబాద్, ఏప్రిల్ 29 (జనంసాక్షి) :** జైలు శాఖలో ఉద్యోగం అనేది కేవలం ఖైదీలను నాలుగు గోడల మధ్య బంధించడం మాత్రమే కాదని, వారిలో పరివర్తన తీసుకువచ్చి తిరిగి సమాజంలో కలిపే గురుతర బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా)లో బుధవారం ఢిల్లీ జైళ్ల సిబ్బందికి ఏర్పాటు చేసిన తొమ్మిది నెలల ప్రాథమిక ప్రవేశ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. జైళ్ల శాఖ నిర్వహణ అత్యంత సంక్లిష్టమైనదని, శిక్షణార్థులు వృత్తిపరమైన నైపుణ్యం, క్రమశిక్షణతో పాటు మానవతా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఖైదీల పట్ల గౌరవభావంతో మెలిగినప్పుడే ఆశించిన సంస్కరణలు సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. తెలిసో ,తెలియకో చట్ట వ్యతిరేకంగా వ్యవహరించినందువల్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలలో మార్పు తీసుకువచ్చి సమాజంలో సత్ప్రవర్తనతో జీవించేలా వారిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన పేరిట అడపాదడపా వస్తున్న విమర్శలను జైళ్ళ శాఖలో ఉద్యోగం చేస్తున్నవారు ఎదుర్కొంటుంటారని పేర్కొన్నారు. శిక్షణలో అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, వార్డర్లు కు విలువలతో కూడిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ అంతర్రాష్ట్ర సహకారం ద్వారానే సంస్కరణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని జైళ్ల శాఖ అన్నారు.ఢిల్లీ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ మన సికాపై నమ్మకంతో ఇంత పెద్ద సంఖ్యలో సిబ్బందిని శిక్షణకు పంపడం గర్వకారణం అన్నారు గతంలో తిహార్ జైలు సిబ్బందికి, బీపీఆర్ అండ్ డి ప్రమాణాలతో సికా అందించిన శిక్షణకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ఆమె గుర్తు చేశారు. ఆధునిక జైలు పరిపాలన ప్రస్తుతం హక్కుల ఆధారిత విధానాల వైపు పయనిస్తోం దని, శిక్షణార్థులు ఈ తొమ్మిది నెలల కాలంలో ఇండోర్, అవుట్‌డోర్ అంశాల్లో మెళకువలు నేర్చుకుని సానుకూల మార్పుకు దోహదపడాలని ఆమె కోరారు. మొత్తం 381 మంది ఢిల్లీ సిబ్బందికి దశలవారీగా శిక్షణ ఇవ్వనుండగా, మొదటి బ్యాచ్‌లో 62 మంది శిక్షణార్థులు (18 మంది అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, 43 మంది మహిళా వార్డర్లు, తెలంగాణ నుండి ఒకరు) చేరారు. వీరికి క్రిమినాలజీ, సైకాలజీ, మానవ హక్కులు, జైలు పరిపాలనలో సాంకేతికతపై శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో శిక్షణకు అవసరమైన కిట్లను ట్రైనీలకు అందజేశారు జైళ్ళ శాఖ ఐజీ ఎన్. మురళీ బాబు, డీఐజీలు డా. డి. శ్రీనివాస్, ఎం. సంపత్, సికా ప్రిన్సిపల్ ఎస్. శ్రీనివాస రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలాగే ఈనెల 28న డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి .శివధర్ రెడ్డి 60వ జన్మదినాన్ని పురస్కరించుకుని శిక్షణ కార్యక్రమం సందర్భంగా జైళ్ల శాఖ అధికారులు కేక్ కట్ చేశారు. జైళ్ళ శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా, ఐజి మురళి బాబు తదితరులు డిజిపి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. డిజిపిని శాలువాతో సత్కరించారు.




# గాంధీలో ఐవీఎఫ్ డెలివరీ

- ప్రైవేట్‌లో రూ.10-12 లక్షలు ఖర్చయ్యే చికిత్స ఉచితంగా..
- డాక్టర్లకు మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని బోయ గూడలో నివసిస్తున్న గడ్డం త్రివేణి – మస్తాన్‌రావు దంపతులు పది సంవత్సరాలుగా పిల్లల కోసం ప్రయత్నిస్తున్నారు. వారి పదేండ్ల నిరీక్షణకు బుధవారం గాంధీ హాస్పిటల్‌లో శుభం కార్డు పడింది. గాంధీ హాస్పిటల్‌లోని ఐవీఎఫ్ సెంటర్‌లో ఐవీఎఫ్ చేయించుకున్న ఆ దంపతులు, బుధవారం అదే హాస్పిటల్‌లో కవల పిల్లలకు జన్మనిచ్చారు. ఒక బాబు, ఒక పాపతో ఇప్పుడు ఆ దంపతులు సంతోషంగా ఉన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇదే చికిత్సకు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉండగా, గాంధీ హాస్పిటల్‌లో పూర్తిగా ఉచితంగా చికిత్సతో పాటు డెలివరీ కూడా చేశారు. అవసరమైన అన్ని మెడిసిన్స్ ఉచితంగా అందజేశారు. వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్న ఈ దంపతులు పది సంవత్సరాలుగా సంతానం కోసం ఎదురుచూశారు. ఈ క్రమంలో ఎన్నో ప్రైవేటు ఆస్పత్రులు తిరిగి చికిత్సలు చేయించుకున్నప్పటికీ ఫలితం రాలేదు. చివరకు గాంధీ ఆస్పత్రి ఐవీఎఫ్ సెంటర్‌ను ఆశ్రయించగా, వైద్యులు పరీక్షలు చేసి సమస్యను గుర్తించి ఐవీఎఫ్ చికిత్స అందజేశారు. ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చినప్పటి నుంచి డెలివరీ వరకూ గాంధీలోనే అవసరమైన వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం తల్లి, శిశువులు ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

# ఆస్తికోసం తల్లిదండ్రుల ఇంటికి నిప్పు

**పల్నాడు, ఏప్రిల్29 (జనంసాక్షి) :** చిలకలూరిపేటలోని గుర్రాల చావిడి ప్రాంతంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆస్తి కోసం కూతురు కన్నతల్లిదండ్రుల ఇంటికే నిప్పు పెట్టింది. వారు చనిపోవాలని చూసింది. అదృష్టవశాత్తు వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆస్తి వివాదం కారణంగా తల్లిదండ్రులపై కూతురు కర్కశంగా వ్యవహరించింది. కన్న తల్లిదండ్రులను కూతురు చంపాలని చూడటం చర్చనీయాంశంగా మారింది. చిలకలూరిపేటకు చెందిన తల్లిదండ్రులు, కూతురికి మధ్య ఆస్తి విషయాల్లో తరచూ గొడవలు జరుతున్నాయి. ఆస్తిని ఇచ్చేందుకు తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో కోపం పెంచుకున్న కూతురు.. వారి ప్రాణాలు తీయడానికి సిద్ధమైంది. గత రాత్రి తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి కూతురు నిప్పు పెట్టింది. మంటలను గుర్తించిన తల్లిదండ్రులు సకాలంలో ఇంటి నుంచి బయటకు వచ్చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370